



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక






Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 04 సోమవారం | ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 320

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# క్రిమినల్ చర్యలు

- కేసీఆర్, హరీష్, ఈటలపై క్రిమినల్ చర్యలకు కమిషన్ సూచన
- కేసీఆర్, హరీష్‌రావు, ఈటల పాత్రపై పీసీ ఘోష్ కమిషన్ ఫోకస్
- కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాలకు గుడ్డిగా ఆమోదం తెలిపిన ఈటల
- కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై అధికారుల కమిటీ అధ్యయనం
- నేడు సమగ్ర వివరాలతో నివేదికను కేబినెట్ ముందు
- కేబినెట్ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకునే ఛాన్స్?



హైదరాబాద్-నవభూమిబ్యూరో
కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై అధికారుల కమిటీ ఆదివారంనాడు అధ్యయనం చేసింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు అధికారుల దృష్టికి వచ్చాయి. సమగ్ర వివరాలతో నివేదికను కేబినెట్ ముందు అధికారుల కమిటీ ఉంచనున్నారు. అధికారుల కమిటీ నివేదికపై సోమవారం తెలంగాణ కేబినెట్‌లో చర్చించ నున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు కేసీఆర్, హరీష్‌రావు, ఈటల రాజేందర్ పాత్రపై పీసీ ఘోష్ కమిషన్ ఫోకస్ చేశారు. కేసీఆర్ నిర్ణయాలకు గుడ్డిగా ఆమోదం తెలిపినట్లు కమిషన్ గుర్తించింది. సమగ్ర విశ్లేషణతో నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు అధికారుల కమిటీ. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగస్వామ్యమైన అందరి గురించి నివేదికలో పీసీ ఘోష్ కమిషన్ పేర్కొన్నారు. కేసీఆర్, హరీష్‌రావు, ఈటల పాత్రపై బాధ్యులందరిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలని పీసీ ఘోష్ కమిషన్ సూచించారు. రేపు(సోమవారం) తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. అయితే, కేబినెట్ ముందుకు కాళేశ్వరం కమిషన్ నివేదిక రానుంది. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. ఆదివారం సాయంత్రం అధికారుల కమిటీతో మంత్రి ఉత్తమ్ సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు.

కమిషన్ నివేదికపై ఇప్పటికే అధికారుల అధ్యయనం పూర్తి అయింది. ఆదివారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో నివేదిక పూర్తి చేశారు. కమిషన్ నివేదికపై కేబినెట్ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

## ఫాం హౌస్‌లో మంతనాలు

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరుస భేటీలు
- ఫాంహౌస్‌లో హరీశ్,కేటీఆర్,జగదీశ్, ప్రశాంత్‌రెడ్డిలతో కేసీఆర్ మంతనాలు
- కాళేశ్వరంపై కమిషన్ నివేదికపై చర్చ
- క్రిమినల్‌చర్యలకు దిగితే ఎదుర్కొనేవిధంగా కేడర్‌ను సిద్ధం చేయాలన్న భావన

2

# ఆరుగురిని మింగిన క్వారీ


- బల్లికురవ గ్రానైట్ క్వారీలో ప్రమాదం..
- క్వారీ అంచు విరిగి 6గురి మృతి
- మృతులు ఒడిశా వాసులుగా గుర్తింపు
- ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి
- ఘటనపై విచారణకు సీఎం ఆదేశం

2

బాపట్ల-నవభూమిబ్యూరో: జిల్లాలోని బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో ప్రమాదం చోటు చేసుకుంది. క్వారీ అంచు విరిగిపడి ఆరుగురు వ్యక్తులు మృతిచెందారు. మృతులను ఒడిశా వాసులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో క్వారీలో 16మంది పనిచేస్తున్నట్లు

# ఉపరాష్ట్రపతిగా దత్తన్న?

- ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీశ్ ధన్కడ్ బీసీకి చెందిన వారు
- మళ్లీ బీసీకే ఉప రాష్ట్రపతి పదవి అప్పగించాలని మోదీ షా ఆలోచన
- ఉపరాష్ట్రపతి పదవికి ఆసక్తి చూపని జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్
- ఐదేళ్ల పదవీకాలం తర్వాత రాజకీయ విశ్రాంతి తప్పదనే భావన
- ఉప రాష్ట్రపతి పదవికి బీసీ నేతలకై జల్లెడ పడుతున్న బీజేపీ అధిష్టానం
- ఏ పదవి లేకుండా ఖాళీగా ఉన్న బండారు దత్తాత్రేయపై దృష్టి



న్యూదిల్లీ-నవభూమిబ్యూరో
ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామా తర్వాత తదుపరి ఆ బాధ్యతలు స్వీకరించే నేత ఎవరు? అన్న చర్చ ఉత్కంఠకు దారితీస్తోంది. పార్లమెంటు ఉభయ సభల్లో ఎన్డీఏ కూటమికి సంపూర్ణ మెజార్టీ ఉండటంతో కాబోయే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బీజేపీ నేతను ఎంపిక చేయొచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, రాజ్ నాథ్ సింగ్ తోపాటు బిహార్‌కు చెందిన పలువురు నేతల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఇక ఇదే సమయంలో బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని కూడా త్వరలో భర్తీ చేయనుండటం, బీజేపీ అధ్యక్ష పదవిని మహిళకు కేటాయించొచ్చన్న ఊహాగానాలతో ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక ఆసక్తికరంగా మారుతోంది.

ప్రస్తుతం ఉన్న సామాజిక సమీకరణల దృష్ట్యా ఉప రాష్ట్రపతిగా బీసీ నేతను ఎంపిక చేయొచ్చని తాజాగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అదీ దక్షిణాది ప్రాంతానికి చెందిన బీసీలకు అవకాశం ఇవ్వాలని సంఘ్ పరివార్ ప్రతిపాదిస్తోందని అంటున్నారు. రాజీనామా చేసిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ఓబీసీ వర్గానికి చెందిన వారు. అదేవిధంగా రాష్ట్రపతిగా ఆదివాసీ బిడ్డ ద్రౌపది ముర్ము ఉన్నారు. అదేవిధంగా బీజేపీ అధికారంలోకి వచ్చాక ఒక ఎస్సీ, ఒక ఎస్టీని రాష్ట్రపతి చేసింది. ఉప రాష్ట్రపతి పదవిని గతంలో ఒకసారి అగ్రవర్ణాలకు కేటాయించగా, రెండోసారి బీసీ వర్గానికి చెందిన జగదీష్ ధన్ ఖర్ కు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో బీసీ రాజీనామా చేసిన ఉప రాష్ట్రపతి పదవిని మళ్లీ అదే వర్గానికి కేటాయించడం సముచితమంటూ బీజేపీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది. ఇక ఉప రాష్ట్రపతి అంటే ఐదేళ్ల తర్వాత రాజకీయ విరామం తీసుకోవాల్సిందేనన్న భావనతో కేంద్రంలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రులు వెనక్కి తగ్గుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా కేంద్ర మంత్రి వర్గంలో చక్రం తిప్పిన వెంకయ్య నాయుడును ఉప రాష్ట్రపతిని చేశారు. ఐదేళ్ల పదవీకాలం తర్వాత ఆయనను రాష్ట్రపతిగా ప్రమోట్ చేయలేదు. దీంతో ఆయన రాజకీ యంగా విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చిందని గుర్తు చేస్తున్నా రు. ఈ కారణంతోనే జేపీ నడ్డా, రాజనాథ్ సింగ్ వంటి వారు ఉప రాష్ట్రపతి పదవిపై సముఖత వ్యక్తం చేయడం లేదని అంటున్నారు. దీంతో ఉప రాష్ట్రపతి పదవికి తగిన బీసీ నాయకుడి ఎంపిక కోసం బీజేపీ పెద్దలు జల్లెడ పడుతున్నట్లు చెబుతున్నారు. దక్షిణాదికి చెందిన బీసీ నేతను ఎంపిక చేయాలని భావిస్తుండటంతో హరియాణా మాజీ గవర్నర్ దత్తాత్రేయ పేరు తెరపైకి వచ్చింది. ఆయన గవర్నర్ గిరీ గత నెలలోనే ముగిసింది. ఆయన స్థానంలో బీజేపీ అషిమ్ కుమార్ ఘోష్‌ను నియమించింది. దీంతో ప్రస్తుతం దత్తాత్రేయ ఏ పదవీ లేకుండా ఖాళీగా ఉన్నారు. దత్తాత్రేయను ఉప రాష్ట్రపతి చేస్తే ఏకగ్రీవం అయ్యేలా సహకరిస్తామని ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో దత్తాత్రేయ పేరు ప్రముఖంగా చర్చకు వస్తోంది. అన్నిపార్టీలతో సత్సంబంధాలు ఉన్న దత్తాత్రేయకు సౌమ్యుడిగా గుర్తింపు ఉంది. అదే సమయంలో గవర్నర్ గా, కేంద్ర మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఆయనకు కలిసివస్తోందని అంటున్నారు. అంతేకాకుండా బీజేపీ, సంఘ్‌తో దత్తాత్రేయకు చాలాకాలంగా అనుబంధం ఉంది. ఈ పరిస్థితుల్లో ఉప రాష్ట్రపతి పదవికి దత్తాత్రేయ తగిన వారు అన్న ప్రచారం వినిపిస్తోంది.



## గుట్టలుగా అస్థిపంజరాలు

- ధర్మస్థలలో వందలాది హత్యల ఆరోపణలపై సిట్ దర్యాప్తు ముమ్మరం
- తవ్వకాల్లో బయటపడుతున్న పుర్రెలు, మహిళల ఎముకలు
- కేసులో కీలక సమాచారంతో ముందుకొచ్చిన మరో సాక్షి
- మీడియాపై విధించిన గ్యాగ్ ఆర్డర్‌ను ఎత్తివేసిన హైకోర్టు
- గతంలో నమోదైన 250 మిస్సింగ్ కేసులపై మళ్లీ అధికారుల దృష్టి

బెంగుళూరు-నవభూమిబ్యూరో
కర్ణాటకలోని ప్రముఖ పుణ్య క్షేత్రం ధర్మస్థలలో జరుగుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తవ్వకాలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. రెండు దశాబ్దాలుగా వందలాది మందిని హత్య చేసి పూడ్చిపెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో, అధికారులు తవ్విన కొద్దీ పుర్రెలు, మానవ ఎముకలు బయటపడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ పరిణామాలతో పవిత్ర క్షేత్రం చుట్టూ అలుముకున్న మిస్టరీ మరింత బలపడుతోంది. 1995 నుంచి 2014 మధ్యకాలంలో ధర్మస్థలలో

# మానవత్వానికి ఖననం
# ధర్మస్థల రహస్య గాథ
## ధర్మస్థలలో మరో షాకింగ్ ఘటన

- అసహజ మరణాల రికార్డుల గల్లంతు
- ఆర్టీఐ ద్వారా బయటపడిన షాకింగ్ వివరాలు
- పోలీస్ స్టేషన్‌లో రికార్డుల మాయం
- యువతి మృతదేహం పాతిపెట్టడంపై ఆరోపణలు
- సిట్ దర్యాప్తుకు కొత్త మలుపు
- నాశనం చేసిన ఆధారాలపై ఆందోళన

2



బెంగళూరు,నవభూమిబ్యూరో- ఆగస్ట్ 03:
ధర్మస్థల ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో మరో సంచలనం చోటు చేసుకుంది. ఈ ధర్మస్థలలో దాదాపు 15 ఏళ్లలో చోటు చేసుకున్న అసహజ మరణాలకు సంబంధించిన రికార్డులన్నీ మాయమయ్యాయి. ఈ విషయం ఆర్టీఐ చట్టం ద్వారా ఆదివారం బహిర్గతమైంది. 2000 నుంచి 2015 మధ్య బెళ్తంగడి పోలీస్ స్టేషన్‌లో అదృశ్యమైన మహిళలు, యువతులు, బాలికలకు చెందిన రికార్డులన్నీ గల్లంతయ్యాయి. ఈ మేరకు ఆర్టీఐ కార్యకర్త జయంత్ ఆదివారం వెల్లడించారు. ఇదే సమయంలో అనుమానాస్పద మరణాలపై ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తాయని ఆయన గుర్తు చేశారు.అయితే తాను వందకు పైగా మహిళలు, యువతుల మృతదేహాలను పూడ్చిపెట్టానంటూ ఒక పారిశుద్ధ్య కార్మికులు ప్రకటించిన వేళ.. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు మాయం కావడం సంచలనం సృష్టిస్తోంది. అదీకాక.. ఈ రికార్డులన్నీ ఒక క్రమ పద్ధతిలో మాయం చేసినట్లు ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడైందని జయంత్ పేర్కొన్నారు. అయితే ఇదే అంశంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు ఫిర్యాదు చేసినట్లు జయంత్ వివరించారు.ఒక యువతి మృతదేహాన్ని అక్రమంగా పాతపెట్టడం తాను చూశానని.. అధికారులు సైతం అక్కడే ఉన్నారని జయంత్ సంచలన విషయం వెల్లడించారు. ఈ నేపథ్యంలో సదరు మృతదేహాన్ని సిట్ అధికారులు వెలికి తీయాల్సి ఉందన్నారు. అయితే ఈ యువతుల గల్లంతుపై పోలీసుల పనితీరు తెలుసుకోవడానికి చాలా కాలంగా ఆర్టీఐను ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు. ఆ క్రమంలో ఆచూకీ గల్లంతైన వ్యక్తులు, వారి ఫొటోలను తాను చాలా కాలం క్రితమే బెళ్తంగడి పోలీసులను అడిగినట్లు .

# కవిత వర్సెస్ జగదీశ్

- కవిత వ్యాఖ్యలతో బీఆర్ఎస్‌లో కలకలం
- 'లిల్లీపుట్ నాయకుడు' అంటూ ఘాటు విమర్శ
- బీఆర్ఎస్ భవిష్యత్తుపై ప్రశ్నలు రేకెత్తిన పరిణామాలు
- పార్టీ అధిష్టానంపై కవిత పరోక్ష విమర్శ
- సోషల్ మీడియాలో కార్యకర్తల మధ్య చిచ్చు
- అధిష్టానం చర్య తీసుకోకుంటే నష్టం ఖాయం
- నాయకుల మధ్య అంతర్గత విబేధాలు
- పార్టీ సమన్వయం లేకపోతే ప్రజల విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం



2

హైదరాబాద్-నవభూమి బ్యూరో
తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విబేధాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డికి మధ్య జరుగుతున్న మాటల యుద్ధం పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పరిణామాలు గులాబీ పార్టీ భవిష్యత్తుపై అనేక ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. ఈ వివాదం కవిత చేసిన సంచలన ఆరోపణలతో మొదలైంది.ఆమె ఏమన్నారంటే.. 'లిల్లీపుట్ నాయకుడు నల్గొండ జిల్లాలో పార్టీని నాశనం చేశాడు. కన్ను లొట్టపోయి గెలిచిన నాయకుడు.. ఎన్నడూ ప్రజా పోరాటాల్లో పాల్గొనలేదు. అసలు బీఆర్ఎస్‌తో మీకేం సంబంధం?' అంటూ జగదీష్ రెడ్డిని టార్గెట్ చేస్తూ కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'లిల్లీపుట్ నాయకుడు, నిన్న మొన్న వచ్చిన చోటా మోటా నాయకులు కూడా నాపై మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్‌కు సంబంధం లేని వ్యక్తితో నాపై ఆరోపణలు చేయిస్తున్నారు. వారి వెనక బీఆర్ఎస్‌లో పెద్ద నాయకుడు ఉన్నారు. నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. సమయం వచ్చినప్పుడు అన్ని బయటపెడతాను. పార్టీ కూడా సమయం వచ్చినప్పుడు స్పందిస్తుంది' అని ఆమె పేర్కొన్నారు. అంతేకాదు.. 'ఒక ఆడ బిడ్డగా నాపైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ సమాజం మొత్తం స్పందించింది కానీ.. బీఆర్ఎస్ పార్టీ స్పందించలేదు. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా' అంటూ పార్టీ అధిష్టానంపై కూడా పరోక్ష విమర్శలు

## మహిళపై పోక్సో కేసు ఖమ్మంలో సంచలనం

- నర్సుగా పనిచేస్తూ మైనర్‌తో ప్రేమలో పడిన మహిళ
- బాలుడిని కిడ్నాప్ చేసిన మహిళపై పోక్సో కేసు
- ఆరు నెలలుగా మాయం..

2




## పంచాయతీ కార్యదర్శులకు షాక్

- నకిలీ హాజరుతో పంచాయతీరాజ్ శాఖలో కలకలం
- ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను మోసం చేసిన కార్యదర్శులు
- మంత్రి సీతక్క ఆగ్రహం.. కఠిన చర్యలు

2


## అత్యాచార కేసులో 35 ఏళ్ల శిక్ష పడ్డ తెలంగాణవాసి ఆత్మహత్య

- నిందితుడిది జనగామ జిల్లా నెల్లుట్ల గ్రామం
- పదేళ్ల క్రితం భార్యతో అమెరికాకు
- ఎడ్మండ్‌లో ముగ్గురు బాలికలపై లైంగిక దాడి
- సాయిపై ఆరోపణలు రుజువవ్వడంతో జైలుశిక్ష

2

# ఏఐతో కొన్ని ఉద్యోగాలకు ముప్పు తప్పదు

- సాధారణ కోడింగ్, టెలిసేల్స్ పనులను ఏఐ చేయగలదని తెలిపిన బిల్ గేట్స్
- సంక్లిష్టమైన కోడింగ్ సవాళ్లను అధిగమించడానికి ఇంకాస్త సమయం
- పారాలీగల్స్, ఎంట్రీ-లెవల్ అకౌంటెంట్ల వంటి ఉద్యోగాలకు ముప్పు తప్పదు



న్యూయార్క్-నవభూమిబ్యూరో
ఏఐ పురోగతి వేగం తనను చాలా ఆశ్చర్యపరిచిందని ఆయన వ్యాఖ్య కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో, దాని ప్రభావంపై మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. ఏఐ రాకతో పారాలీగల్స్, ఎంట్రీ-లెవల్ అకౌంటెంట్ల వంటి కొన్ని ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆయన అంగీకరించారు. అయితే, ఇదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏఐ ఒక గొప్ప వరంగా మారుతుందని, అనేక రంగాల్లో ఉత్పాదకతను పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# అతి త్వరలో భారత్‌లో బుల్లెట్ రైలు

- 2 గంటల్లోనే ముంబై నుంచి అహ్మదాబాద్‌కు!
- త్వరలో ముంబై-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలు సేవలు
- కేవలం 2 గం. 7 ని.లకు తగ్గనున్న ప్రయాణ సమయం
- గంటకు 320 కి.మీ వేగంతో ప్రయాణించనున్న రైలు




న్యూదిల్లీ-నవభూమిబ్యూరో
వేగంగా సాగుతున్న 508 కిలోమీటర్ల హై-స్పీడ్ రైల్ కారిడార్ పనులుదేశ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌పై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. ముంబై-అహ్మదాబాద్ మధ్య దేశంలోని మొట్టమొదటి బుల్లెట్ రైలు సేవలను అతి త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే, ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం కేవలం 2 గంటల 7 నిమిషాలకు

# టాలీవుడ్‌లో సమ్మె సైరన్

- రేపటి నుంచి టాలీవుడ్‌లో సినిమా షూటింగ్‌లు బంద్
- వేతనాలు 30 శాతం పెంచాలన్న సినీ కార్మికుల ఫెడరేషన్
- పెంచిన జీతాలు రోజువారీగా చెల్లించాలని మరో షరతు
- ఐదేళ్లుగా వేతనాలు పెంచలేదని కార్మికుల ఆరోపణ
- నిర్మాతలతో చర్చలు విఫలమవడంతో సమ్మె నిర్ణయం
- ప్రముఖ సినిమాల చిత్రీకరణపై తీవ్ర ప్రభావం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో: తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మళ్లీ సమ్మె సైరన్ మోగింది. వేతనాల పెంపు కోసం సినీ కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. దీంతో సోమవారం నుంచి టాలీవుడ్‌లో అన్ని సినిమా షూటింగ్‌లు నిలిచిపోనున్నాయి. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు విధులకు హాజరుకాబోమని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఫెడరేషన్ నాయకులు తమ ప్రధాన డిమాండ్లను మీడియా ముందుంచారు. కార్మికుల వేతనాలను తక్షణమే 30 శాతం పెంచాలని వారు కోరుతున్నారు. అంతేకాకుండా, పెంచిన వేతనాలను ఏ

## కొడాలి నానికి బిగ్ షాక్!

విశాఖపట్నం-నవభూమి: మాజీ మంత్రి కొడాలి నానికి ఊహించని షాక్ తగిలింది. ఆయనపై మరో కేసు నమోదు అయింది. సీఎం చంద్రబాబు, కుటుంబసభ్యులపై అనుచిత వ్యాఖ్యలు,.. కించ పరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ కొడాలి నానిపై 2024లో విశాఖ త్రీటౌన్ పోలీసులకు విశాఖవాసి అంజనాప్రియ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కొడాలి నానిపై U/S353(2), 352, 351(4), 196(1) BNS 467, IT యాక్టు కింద నమోదు చేశారు. గుడివాడలో కొడాలి నానికి విశాఖ త్రీటౌన్ పోలీసులు నోటీసులు ఇచ్చారు.

## వచ్చే నెలలోనే పాతబస్తీ మెట్రో కారిడార్ పనులకు టెండర్లు?

నవ వార్త



**హైదరాబాద్-నవభూమి:** పాతబస్తీ మెట్రో కారిడార్ పనులపై ప్రభుత్వం దృష్టి సారించింది. వచ్చే నెలలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులను ప్రారంభించేందుకు కార్యాచరణను రూపొందించినట్లు తెలిసింది. జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేలోపు పాతబస్తీలో మెట్రో పిల్లర్ల పనులకు మార్గం సుగమం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగు తుండడం ఆసక్తికరంగా మారింది. నగరంలో మెట్రో రెండోదశ విస్తరణ లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మెట్రో మార్గాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో చేపడుతున్న ఈ మార్గానికి రూ.2,741 కోట్లను కేటాయించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌లో కొన్ని రోజుల క్రితం మార్పులు చేశారు.కారిడార్ నిర్మాణంలో తొలుత 1,100 ఆస్తులు ప్రభావితమవుతున్నట్లు గుర్తించారు. అయితే, కొన్ని రోజులుగా ఆస్తుల సేకరణలో పలుచోట్ల స్వల్ప సవరణలు చేసి 200 ఆస్తులను తగ్గించారు. అక్కన్నమాదన్న ఆలయం దాటిన తర్వాత ఎడమ వైపున అలైన్‌మెంట్‌ను కొద్దిగా సవరించినట్లు అధికారులు తెలిపారు. అలాగే చార్మినార్, లాల్‌దర్వాజా మోడ్ వద్ద ఇంజనీరింగ్ డిజైన్‌ను మార్చడంతో ఆస్తులు తగ్గినట్లు చెప్పారు. ప్రస్తుతం మొత్తం 900ఆస్తులను సేకరిస్తున్నామని, 7.5 కి.మీ. కారిడార్‌లో 20 మీటర్లకు ఒక పిల్లర్ ఉంటుందని, వయాడక్టు నిలిపే పిల్లర్ల మధ్య 25 మీటర్ల దూరం (82 అడుగులు) ఉంటుందని చెప్పారు. మొత్తం 150 పిల్లర్ల నిర్మాణం జరుగుతోందని వివరించారు.ఓల్డ్‌సిటీ కారిడార్‌లో ఇప్పటివరకు 412 ఆస్తులకు అవార్డు జారీచేశారు. ఇందులో నివాసాలు కోల్పోయిన బాధితులకు రూ.360 కోట్ల నష్టపరిహారాన్ని అందించారు. అలాగే 380 ఆస్తులను తొలగించారు. కారిడార్‌లో వచ్చే పిల్లర్ల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించి వాటిని మార్కింగ్ చేస్తున్నారు.

## గుట్టలుగా అస్థిపంజరాలు

**(1వపేజీ తరువాయి)**పారిశుధ్య కార్మికుడిగా పనిచేసిన ఓ వ్యక్తి, తాను వందలాది మృతదేహాలను పూడ్చిపెట్టానని జులై 3న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. లైంగిక దాడులకు గురైన మహిళలు, మైనర్ బాలికల మృతదేహాలు వాటిలో ఉన్నాయని, తన ప్రాణాలకు హాని ఉందని రక్షణ కోరడంతో కర్ణాటక ప్రభుత్వం ఐపీఎస్ అధికారి ప్రణవ్ మొహంతి నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది.

సిట్ అధికారులు ఆ కార్మికుడు చూపిన ప్రదేశాలలో తవ్వకాలు చేపట్టగా, ఆరోపణలకు బలం చేకూరుస్తూ మానవ అవశేషాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటివరకు గుర్తించిన 13 ప్రదేశాలలో ఆరింటిలో తవ్వకాలు జరపగా, ఇటీవల ఆరవ ప్రదేశంలో మరిన్ని ఎముకలు లభ్యమయ్యాయి. ఒకచోట చిరిగిన ఎరుపు రంగు జాకెట్‌తో పాటు లక్ష్మి అనే మహిళకు చెందిన పాన్ కార్డు కూడా దొరకడం దర్యాప్తులో కీలక ఆధారంగా మారింది.

ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే, నేడు జయన్ టి. అనే మరో సాక్షి ముందుకొచ్చాడు. 15 ఏళ్ల క్రితం 15 ఏళ్ల బాలిక మృతదేహాన్ని రహస్యంగా పూడ్చిపెట్టడం తాను చూశానని ఆయన చెప్పడంతో సిట్ అధికారులు ఆ దిశగా కూడా దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, ఈ కేసులో మీడియా కవరేజీని నిలుపుదల చేస్తూ గతంలో జారీ అయిన గ్యాగ్ ఆర్డర్‌ను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది.

1995-2014 మధ్యకాలంలో ధర్మస్థల పరిసరాల్లో దాదాపు 250 మిస్సింగ్ కేసులు నమోదైనట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. 2013 నాటి సౌజన్య అనే విద్యార్థిని హత్య కేసు అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజా ఆరోపణల నేపథ్యంలో పాత కేసుల దస్త్రాలు మళ్లీ తెరుచుకుంటున్నాయి. "ధర్మస్థల దేవాలయం శ్మశాన వాటికగా మారిపోయింది" అని సీపీఐ నేత నారాయణ తీవ్రంగా ఆరోపించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులను వెంటనే అరెస్ట్ చేసి విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. సిట్ దర్యాప్తు ముమ్మరంగా సాగుతుండటంతో, ఈ హత్యల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది త్వరలోనే తేలుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## ఏఐతో కొన్ని ఉద్యోగాలకు ముప్పు తప్పదు

**(1వపేజీ తరువాయి)**ప్రస్తుతం ఏఐ సామర్థ్యాలపై మాట్లాడుతూ, టెలిసేల్స్, టెలి సపోర్ట్ వంటి పనులతో పాటు సాధారణ కోడింగ్ టాస్క్‌లను కూడా ఏఐ సమర్థవంతంగా నిర్వహించగలదని బిల్ గేట్స్ పేర్కొన్నారు. అయితే, అత్యంత సంక్లిష్టమైన కోడింగ్ సవాళ్లను ఎదుర్కొనే స్థాయికి ఏఐ ఇంకా చేరుకోలేదని స్పష్టం చేశారు. ఈ స్థాయికి చేరడానికి ఒకట్రెండు సంవత్సరాలు పడుతుందా లేక దశాబ్ద కాలం పడుతుందా అనే దానిపై నిపుణుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఆయన వివరించారు.

ఏఐ పరిశోధనలో కనిపిస్తున్న వేగవంతమైన పురోగతి తనను ఆశ్చర్యపరిచిందని గేట్స్ తెలిపారు. ముఖ్యంగా అల్ప ఆదాయ దేశాలలో విద్య, వైద్యం, వ్యవసాయం వంటి కీలక రంగాల్లో ఉత్పాదకతను పెంచడానికి ఏఐకి అపారమైన అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సరైన పద్ధతిలో వినియోగిస్తే, ఏఐ మానవాళి అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

గతంలో పరిశ్రమల్లోకి రొబోటిక్ ఆర్మ్స్ వచ్చినప్పుడు బ్లూ-కాలర్ ఉద్యోగాలపై ఎలా ప్రభావం పడిందో, ఇప్పుడు ఏఐ రాకతో వైట్-కాలర్ ఉద్యోగాలపై అలాంటి ప్రభావమే ఉంటుందని ఆయన పోల్చారు. ఈ మార్పులకు అనుగుణంగా ప్రపంచం సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

## హైస్పీడ్‌లో.. ఎలక్ట్రిక్ వాహనాలు

**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్ర రోడ్లపై విద్యుత్ వాహనాలు రయ్యిన దూసుకెళుతున్నాయి. విద్యుత్ వాహనాల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఎలక్ట్రిక్ కార్లు కొనేవారి సంఖ్య ఏటేటా పెరుగుతున్నట్టు రవాణా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల కొనుగోళ్లు కూడా అంతకంతకు దూసుకెళుతున్నాయి. గత ఏడు నెలల్లో రాష్ట్రంలో 50 వేలకుపైగా విద్యుత్ వాహనాలు కొత్తగా రోడ్డెక్కాయి. ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం మినహాయించడంతో కొనుగోళ్లు పెరుగుతున్నాయని.. ఇప్పటివరకు రూ.369.27 కోట్ల మేర పన్ను మినహాయింపు లభించిందని రవాణాశాఖ వర్గాలు తెలిపాయి.

పర్యావరణహిత హైదరాబాద్ లక్ష్యంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ రుసుము మినహాయింపు నిర్ణయం తీసుకుంది. 2024 నవంబరు 16వ తేదీ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. దీనితో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల్లో పెరుగుదల కనిపిస్తోంది. సాధారణంగా కేటగిరీని బట్టి వాహనం ధరలో 12 శాతం నుంచి 20 శాతం వరకు రోడ్ ట్యాక్స్ (లైఫ్ ట్యాక్స్)గా చెల్లించాలి. వాణిజ్యేతర వాహన కేటగిరీలో ఎక్స్ షోరూం ధర రూ.5లక్షల్లోపు ఉన్న కార్లకు రోడ్ ట్యాక్స్ 13 శాతం, రూ5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ధర ఉంటే 14 శాతం, రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల్లోపు వాహనాలకు 17 శాతం, రూ.20 లక్షల కంటే ఎక్కువ ధర ఉండే వాహనాలకు 18 శాతం రోడ్ ట్యాక్స్ వసూలు చేస్తారు. తాత్కాలిక, శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం కార్లకు రూ.2500 నుంచి రూ.5 వేల వరకు.. ద్విచక్ర వాహనాలకు రూ.500-800 వరకు చార్జీ ఉంటుంది. ఈ క్రమంలో రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీల మినహాయింపుతో.. ఒక్కో కారుపై కనిష్టంగా రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు 'ఆన్ రోడ్' ధర తగ్గుతోంది. కొత్త సాంకేతికతలతో వస్తున్న విద్యుత్ వాహనాల మైలేజీ ఎక్కువగా ఉంటోంది. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 250 కిలోమీటర్ల నుంచి 600 కిలోమీటర్ల వరకు ప్రయాణించే కార్లు.. 40 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల వరకు ప్రయాణించగల ద్విచక్రవాహనాలు అందుబాటులోకి వచ్చాయి. విద్యుత్ చార్జింగ్‌తో నడవడం, ఇతర నిర్వహణ వ్యయాలు పెద్దగా ఉండకపోవడం కూడా ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరగడానికి కారణమవుతోంది.


నవంబరు 16 నుంచి జూన్ 30 వరకు ఏడున్నర నెలల్లో రాష్ట్రంలో అన్ని కేటగిరీల విద్యుత్ వాహనాలు కలిపి 50 వేలకుపైగా రిజిస్ట్రేషన్ జరిగాయి. వీటన్నింటికీ కలిపి రూ.369.27 కోట్ల మేర పన్ను మినహాయింపు లభించింది. అందులో 9,058 వ్యక్తిగత (నాన్ ట్రాన్స్‌పోర్ట్) విద్యుత్ కార్లకు సంబంధించి రూ.302.12 కోట్ల పన్ను, రుసుముల మినహాయింపు లభించింది. ఇది మొత్తం మినహాయింపులలో 82 శాతం కావడం గమనార్హం. '2017 నుంచి 2024 వరకు ఈ స్థాయిలో విద్యుత్ కార్ల రిజిస్ట్రేషన్ జరగడం ఇదే ప్రథమం. అది కూడా ఏడు నెలల్లోనే జరిగాయి' అని రవాణా శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఇక 37 వేల విద్యుత్ ద్విచక్ర వాహనాలకు సంబంధించి రూ.43.82 కోట్లు పన్ను, రుసుము మినహాయింపు దక్కింది. వాణిజ్య పరంగా వినియోగించే విద్యుత్ కార్లు, ఆటోలు, సరుకు రవాణా వాహనాలు, బస్సుల రిజిస్ట్రేషన్లు కూడా గతంతో పోలిస్తే పెరిగాయి.

## హైదరాబాద్‌లో ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలం



**హైదరాబాద్-నవభూమి:** పరిసరాల్లోని పోచారం, నాగోలు బండ్లగూడ ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ శనివారం ముగిసింది. అయితే, దరఖాస్తుదారుల విజ్ఞప్తి మేరకు మిగిలిన ఫ్లాట్లకు మరో వారం రోజుల పాటు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దీనితో పాటు, స్వగృహకు చెందిన ఓపెన్ ప్లాట్లను కూడా బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు.రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మార్కెట్ ధరల కంటే తక్కువకు, 'నో లాస్ నో ప్రాఫిట్' పద్ధతిలో మొత్తం 401 ఫ్లాట్లను విక్రయించింది. ఈ ప్రక్రియ ద్వారా సుమారు రూ. 78 కోట్ల ఆదాయం సమకూరింది. అత్యధిక శాతం ఫ్లాట్లకు ఒకే దరఖాస్తు రాగా, ఒక 3బీహెచ్కే ఫ్లాట్‌కు ఏకంగా 69 దరఖాస్తులు వచ్చాయి. బండ్లగూడలో ఫ్లాట్లు లభించని వారికి పోచారంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించి, లాటరీ ద్వారా కేటాయింపులు చేశారు.బండ్లగూడ, పోచారంలలో మిగిలిపోయిన సింగిల్, డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు కోరడంతో.. ఆగస్టు 8వ తేదీ వరకు గడువు పొడిగించారు. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన ఈ ఫ్లాట్లను కేటాయించనున్నట్లు స్వగృహ కార్పొరేషన్ ఎండీ వీపీ.గౌతమ్ తెలిపారు.ఇవే కాకుండా రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు చెందిన ఓపెన్ ప్లాట్లను కూడా బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించారు. ఈ వేలం ఆగస్టు 4 (సోమవారం) నుంచి 3 రోజుల పాటు జరగనుంది.ఆగస్టు 4న రంగారెడ్డి జిల్లా కుర్మల్‌గూడలో 20 ప్లాట్లు, ఆగస్టు 5న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బహదూర్‌పల్లిలో 69 ప్లాట్లు, ఆగస్టు 6న రంగారెడ్డి జిల్లా తొర్రూరులో 100 ప్లాట్లు విక్రయించనున్నారు. ఈ ప్లాట్లు 200 చదరపు గజాలు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్ ధర కంటే కాస్త తక్కువగానే ఈ ఫ్లాట్లు విక్రయించనున్నారు. హైదరాబాద్ నగరంలో సొంతింటి కలను నిజం చేసుకునేవారు ఈ ఫ్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు.

## పంచాయతీ కార్యదర్శులకు షాక్




**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖలో ప్రస్తుతం నకిలీ అటెండెన్స్ వ్యవహారం పెద్ద దుమారాన్ని రేపుతోంది. పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను కొందరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు మోసం చేయడానికి ఉపయోగించడం అధికారులను విస్మయానికి గురిచేసింది. విధులు సరిగా నిర్వర్తించకుండా.. గ్రామాలకు వెళ్లకుండానే, తప్పుడు ఫోటోలు, ఫేక్ వివరాలు సమర్పించడం.. అందులో ఏకంగా ముఖ్యమంత్రి ఫోటోలు, ఖాళీ కుర్చీల చిత్రాలను అప్‌లోడ్ చేసి అటెండెన్స్ వేసుకున్న వందల మంది కార్యదర్శులు అభాసుపాలయ్యారు.మంత్రి సీతక్క సీరియస్..

వందల సంఖ్యలో నకిలీ హాజరు నమోదవ్వడంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించవద్దని సంబంధిత అధికారులను హెచ్చరించారు. దీంతో ఈ ఘటనపై విచారణ చేపట్టిన అధికారులు, ఇప్పటివరకు 553 మంది పంచాయతీ సెక్రెటరీలు ఫేక్ అటెండెన్స్ వేసినట్లు గుర్తించారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఒక పంచాయతీ కార్యదర్శిని వెంటనే సర్వీస్ నుంచి తొలగించారు. మరో 15 మందిని సస్పెండ్ చేశారు. మిగిలిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా.. సెక్రెటరీల హాజరును పర్యవేక్షించాల్సిన ఎంపీఓలు (మండల పంచాయతీ అధికారులు) కూడా విధుల్లో నిర్లక్ష్యం వహించారని ప్రభుత్వం గుర్తించింది. మొత్తం 47 మంది ఎంపీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, వారిపై శాఖాపరమైన చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది.

నకిలీ అటెండెన్స్ వెనుక కారణం ..

ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం, సేవలు అందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతి గ్రామానికి పంచాయతీ కార్యదర్శులను నియమించింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దాదాపు 9 వేలకు పైగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించగా.. అందులో చాలా మంది రెగ్యులర్ అయ్యారు. అయితే.. చాలా మంది కార్యదర్శులు తమ గ్రామాల్లో అందుబాటులో ఉండట్లేదని ఫిర్యాదులు రావడంతో.. వారి హాజరును పారదర్శకంగా పర్యవేక్షించడానికి ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను ప్రవేశపెట్టారు. కానీ.. కొందరు కార్యదర్శులు ఈ సాంకేతికతను కూడా తమ నిర్లక్ష్యానికి అనువుగా మార్చుకున్నారు. తాజాగా వీరి హాజరుపై ఫిర్యాదులు అందడంతో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించగా, ఈ ఫేక్ అటెండెన్స్ వ్యవహారం బయటపడింది.

అత్యధికంగా నకిలీ హాజరు నమోదు చేసిన జిల్లాల వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లాలో 70 మంది, నల్గొండ జిల్లాలో 69 మంది, వికారాబాద్ జిల్లాలో 63 మంది, సూర్యాపేట జిల్లాలో 48 మంది, కామారెడ్డి జిల్లాలో 43 మంది, కొత్తగూడెం జిల్లాలో 42 మంది ఉన్నారు. సస్పెండ్ అయిన కార్యదర్శులు ఎక్కువగా వనపర్తి జిల్లాలో ఉండగా.. ఏడుగురు కార్యదర్శులు సస్పెండ్ అయ్యారు. నిర్లక్ష్యం వహించిన ఎంపీఓలు ఎక్కువ ఉన్న జిల్లాల విషయానికి వస్తే.. సరైన పర్యవేక్షణ చేయని ఎంపీఓలలో కొత్తగూడెంలో 17 మంది, నల్గొండ జిల్లాలో 15 మంది ఉన్నారు. ఆశ్చర్యకరంగా.. అత్యధికంగా ఫేక్ అటెండెన్స్ నమోదైన సిద్దిపేట జిల్లాలో మాత్రం కేవలం ఒక ఎంపీవోది మాత్రమే నిర్లక్ష్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ చర్యల ద్వారా పంచాయతీ వ్యవస్థలో క్రమశిక్షణ, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

## మైనర్‌తో వివాహిత.. ఖమ్మంలో సంచలనం



**హైదరాబాద్-నవభూమి:**ఈ ఆధునిక సమాజంలో బంధాలకు, విలువలకు అర్థం లేకుండా పోతోందా..? అనే ప్రశ్న తలెత్తుతోంది. ముఖ్యంగా.. మైనర్ బాలికలు, బాలురు కూడా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాలుపం చుకోవడం లేదా బాధితులుగా మారడం ఆందోళన కలిగిస్తోంది. అమానవీయమైన. నైతికత లేని పనులు చేసే వ్యక్తులు సమాజంలో పెరిగిపోవడం ఆందోళనకరంగా మారింది. తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న ఒక సంఘటన ఈ వాస్తవాలకు అద్దం పడుతోంది. సాధారణంగా బాలికలపై లైంగిక వేధింపులు జరిగినప్పుడు నిందితులపై పోక్సో చట్టం నమోదు చేయడం మనం చూస్తుంటాం. అయితే.. ఈసారి ఏకంగా ఓ మహిళపైనే పోక్సో కేసు నమోదు అవ్వడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతానికి ఒక మహిళకు గతంలో వివాహం జరిగింది. భర్తతో వచ్చిన గొడవలు, విభేదాల కారణంగా విడాకులు తీసుకుని ఆమె వేరుగా నివసిస్తోంది. సత్తుపల్లిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న ఆమెకు.. ఇదే ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల మైనర్ బాలుడితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం క్రమంగా ప్రేమగా మారింది. బాలుడు మైనర్ అని తెలిసినా, ఆ మహిళ అతడిని తన మాయలో పడేసింది.సుమారు 6నెలల క్రితం ఆమె.. మైనర్ బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లింది. తమ కుమారుడు కనిపించకపోవడంతో బాలుడి తల్లిదండ్రులు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు పెట్టారు. పోలీసులు అప్పటి నుంచి విచారణ చేపట్టినా.. ఎలాంటి ఆచూకీ లభించలేదు. బాలుడిని తీసుకెళ్లిన సదరు మహిళ ఫోన్లు వాడకుండా, ఎలాంటి క్లూ దొరకకుండా జాగ్రత్తలు తీసుకుంది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బాలుడి పుట్టినరోజు సందర్భంగా.. కేక్‌తో ఇద్దరూ కలిసి ఉన్న ఒక ఫోటో బయటపడింది. ఈ ఫోటో ఆధారంగా పోలీసులు రంగంలోకి దిగారు. వారిద్దరూ ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ప్రాంతంలో ఉన్నట్లు కనుగొని, కేసును ఛేదించారు. ఆ మహిళ, మైనర్ బాలుడిని సత్తుపల్లికి తీసుకువచ్చారు.బాలుడు మైనర్ కావడంతో పోలీసులు అతడికి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రుల వద్దకు పంపారు. ఆ వివాహితపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఒక మహిళపై పోక్సో కేసు నమోదు కావడం సత్తుపల్లి ప్రాంతంలో.. రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## అత్యాచార కేసులో 35 ఏళ్ల శిక్ష: తెలంగాణవాసి ఆత్మహత్య

**జనగామ-నవభూమిప్రతినిధి:** అమెరికా జైల్లో తెలుగు యువకుడి ఆత్మహత్య అమెరికాలో జైలు శిక్ష అనుభవిస్తున్న తెలంగాణకు చెందిన యువకుడు కుర్రెముల సాయికుమార్ (31) ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.అమెరికాలో జైలు శిక్ష అనుభవిస్తున్న తెలంగాణ కు చెందిన యువకుడు కుర్రెముల సాయికుమార్ (31) ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లైంగిక నేరాల కేసులో 35 ఏళ్ల జైలు శిక్ష పడిన తర్వాత సాయికుమార్ జూలై 26న జైలులో ఉరి వేసుకుని చనిపోయాడు. జనగామ జిల్లాలోని లింగాలఘనపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన సాయికుమార్ దాదాపు పదేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. సాయికుమార్ ఒక్లహోమా రాష్ట్రంలోని ఎడ్మండ్ నగరంలో తన భార్యతో కలిసి నివసిస్తున్నారు. అక్కడ అతను 15 ఏళ్ల బాలుడిగా నటించి ముగ్గురు బాలికలపై లైంగిక దాడులకు పాల్పడినట్లు, ఇంకా 19 మంది బాలికలను అసభ్యకర చిత్రాలతో బెదిరించినట్లు పోలీసులు గుర్తించారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో, ఎఫ్‌బీఐ రంగంలోకి దిగి 2023 అక్టోబరులో సాయికుమార్‌ను అరెస్ట్ చేసింది. విచారణలో సాయికుమార్‌పై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో, 2025 మార్చి 27న అమెరికా కోర్టు అతడికి 35 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ శిక్ష తర్వాత మానసికంగా కుంగిపోయిన సాయికుమార్ జూలై 26న జైలులో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల విషాదం ఈ విషయం తెలుసుకున్న సాయికుమార్ తల్లిదండ్రులు ఉప్పలయ్య, శోభ అమెరికా వెళ్లారు. అక్కడే అతని అంత్యక్రియలు నిర్వహించినట్లు సమాచారం. ఈ ఘటన తెలుగు యువతకు ఒక హెచ్చరికగా నిలుస్తోంది. ఆన్‌లైన్ ప్రపంచంలో అడ్డగోలుగా చేసే పనులు ఎంతటి ప్రమాదకర పరిణామాలకు దారితీస్తాయో ఈ విషాదం స్పష్టం చేస్తోంది.

## టాలీవుడ్‌లో సమ్మె సైరన్

**(1వపేజీ తరువాయి)**రోజుకు ఆ రోజే చెల్లించాలని మరో కీలకమైన షరతు విధించారు. ఈ నిబంధనలకు అంగీకరించిన నిర్మాతలకు చెందిన సినిమా పనుల్లో మాత్రమే తాము పాల్గొంటామని తేల్చిచెప్పారు. ఈ మేరకు ఇప్పటికే తెలుగు ఫిలిం ఛాంబర్ కు సమ్మె నోటీసు అందజేశారు.

పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రస్తుత వేతనాలతో జీవించడం కష్టంగా మారిందని, అందుకే వేతనాల పెంపు తప్పనిసరి అని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలు దఫాలుగా నిర్మాతలతో జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మెకే మొగ్గు చూపినట్లు తెలిపారు.

ప్రస్తుతం టాలీవుడ్‌లో పలు భారీ బడ్జెట్ చిత్రాలతో పాటు అనేక సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. ఈ ఆకస్మిక సమ్మె కారణంగా షూటింగ్‌లతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఆగిపోనున్నాయి. దీనివల్ల నిర్మాతలకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని సినీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సమస్య పరిష్కారానికి నిర్మాతల మండలి, ఫెడరేషన్ మధ్య త్వరలోనే చర్చలు జరిగే అవకాశం ఉంది.

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మెగాస్టార్ చిరంజీవి**

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఈ భేటీ జరిగింది. చిరంజీవి మర్యాదపూర్వకంగా సీఎంతో సమావేశమై మాట్లాడారంటూ సీఎంఓ కార్యాలయం ఈ భేటీకి సంబంధించిన వీడియోను 'ఎక్స్' ప్లాట్‌ఫారమ్‌లో పోస్టు చేసింది.

## మానవత్వానికి ఖననం ధర్మస్థల రహస్య గాథ

**(1వపేజీ తరువాయి)**తెలిపారు.ఈ వ్యవహారానికి సంబంధించిన ఫొటోలు, వాల్ పోస్టర్లు, పోస్టమార్టం నివేదికలు అన్ని ఒక పథకం ప్రకారం పోలీసులు నాశనం చేశారని వివరించారు జయంత్. దీనిపై శనివారం సిట్ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. గతంలో యువతి మృతదేహం పోలీసులకు లభించిందని.. అయితే వారు ఆ మృతదేహాన్ని అత్యంత దారుణంగా పాతిపెట్టారని చెప్పారు.

ఇప్పుడు మృతదేహాలకు సంబంధించిన అవశేషాలు లభించినా.. వాటిని వేటితో సరి పోల్చుతారని ఆర్టీఐ కార్యకర్త జయంత్ ప్రశ్నించారు. ఈ వ్యవహారం వెనుక ఎవరు ఉన్నారంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. దీనిపై ఇంతగా ఎవరు ప్రభావం చూపించారని ప్రశ్నించారు. ఈ రికార్డులను కంప్యూటర్ బ్యాక్ అప్ ద్వారా వెనక్కి తీయాల్సిన అవసరం ఉందని జయంత్ అభిప్రాయపడ్డారు. దేనికి ఆధారం లేకుండా నాశనం చేశారంటే ఎలా నమ్మాలని, దీనిపై క్షుణ్ణంగా దర్యాపు జరపాలన్నారు. మరోవైపు తన వెనుక ఎవరూ లేరని ఆర్టీఐ కమిషనర్ కుండబద్దలు కొట్టారు. ఈ అంశం తనపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. అందుకే వీటిని తేల్చాలని తాను నిర్ణయించుకున్నానని స్పష్టం చేశారు.

## ఎమ్మెల్సీ కవితకు జగదీష్ రెడ్డి కౌంటర్

**(1వపేజీ తరువాయి)**గుప్పించారు. దీనిపై స్పందించిన జగదీష్ రెడ్డి.. కవిత వ్యాఖ్యలకు అదే రీతిలో కౌంటర్ ఇచ్చారు. 'నా ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితమ్మకు ఉన్న జ్ఞానానికి నా జోహార్లు. కేసీఆర్ శత్రువులైన రేవంత్, రాధాకృష్ణలు నా గురించి మాట్లాడిన మాటల్ని మరొక్కసారి వల్లె వేసేందుకు ఆమె చేసిన ప్రయత్నానికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను' అంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఇటీవల ఒక టీవీ ఛానెల్‌లో మాట్లాడుతూ.. కవిత గురించి తాము సీరియస్‌గా తీసుకోవడం లేదని.. ఆమె పార్టీలో ఉంటే ఒక ఎమ్మెల్సీ మాత్రమేనని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. దీనిపైనే కవిత ఈ స్థాయిలో విరుచుకుపడ్డారు.కవిత, జగదీష్ రెడ్డి మధ్య జరుగుతున్న ఈ మాటల యుద్ధం బీఆర్ఎస్ పార్టీలో పెద్ద కుదుపుకు దారితీసే అవకాశం ఉంది. ఇప్పటికే అధిష్టానం తీరుపై తీవ్ర అసహనంతో ఉన్న కవిత సొంత ఎజెండాతో ముందుకు వెళ్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఇలాంటి బహిరంగ విమర్శలు పార్టీలోని వర్గ విభేదాలను మరింత పెంచే అవకాశాలు లేకపోలేదు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన సమయంలో.. సొంత పార్టీ నాయకుల మధ్యే ఇలాంటి మాటల తూటాలు పేలడం బీఆర్ఎస్ ప్రతిష్టకు నష్టం కలిగించవచ్చు. ప్రజల్లో పార్టీపై విశ్వాసం సన్నగిల్లే అవకాశం కూడా ఉంది.ఇలా పార్టీ నాయకుల మధ్య స్పష్టత లేకపోవడం కార్యకర్తలను గందరగోళంలో పడేస్తుంది. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ కార్యకర్తలు రెండుగా చీలిపోయి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో గులాబీ బాస్ కేసీఆర్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారనేది ఆసక్తిగా మారింది. ఈ వివాదాలను అదుపు చేయకపోతే పార్టీ మరింత బలహీనపడే అవకాశం ఉంది. మొత్తంగా.. బీఆర్ఎస్‌లో జరుగుతున్న ఈ అంతర్గత పోరు పార్టీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. నాయకుల మధ్య సమన్వయం లేకపోతే.. అధికార పక్షాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడం కష్టమవుతుంది.

## ఆరుగురిని మింగిన క్వారీ

**(1వపేజీ తరువాయి)**సమాచారం. వెంటనే అప్రమత్తమైన అధికారులు క్వారీలో సహాయక చర్యలు చేపట్టారు.బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగటం సర్వసాధారణం అయిపోయింది. క్వారీల్లో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్వారీ ప్రమాదాలపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**ఈ ఘటనపై విచారణ జరపాలి: సీఎం చంద్రబాబు**

బల్లికురవ క్వారీ ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా బల్లికురవ క్వారీలో జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో పాటు మరి కొంత మంది కార్మికులు తీవ్రంగా గాయపడిన ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్వారీలో పనులు చేస్తున్న కార్మికులపై రాళ్లు పడటంతో ఆరుగురు కార్మికులు మృతి చెందారని అన్నారు. ప్రమాదంలో ఇంతమంది ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై అధికారులతో సీఎం మాట్లాడారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఈ ఘటనపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

## అతి త్వరలో భారత్‌లో బుల్లెట్ రైలు

**(1వపేజీ తరువాయి)**తగ్గిపోతుందని తెలిపారు.

ఆయన అయోధ్య ఎక్స్‌ప్రెస్, రేవా-పుణె ఎక్స్‌ప్రెస్, జబల్‌పూర్-రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ రైలు గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ నుంచి గుజరాత్‌లోని వాపి, సూరత్, వడోదర, అహ్మదాబాద్ వంటి ప్రధాన నగరాలను కలుపుతూ 508 కిలోమీటర్ల పొడవైన హై-స్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం జరుగుతోందని ఆయన తెలిపారు.

గుజరాత్‌లో చేపట్టనున్న మరిన్ని రైల్వే ప్రాజెక్టుల గురించి కూడా అశ్విని వైష్ణవ్ ప్రస్తావించారు. పోర్‌బందర్-రాజ్‌కోట్ మధ్య కొత్త రైలు, రణవావ్ స్టేషన్‌లో రూ.135 కోట్లతో కోచ్ మెయింటెనెన్స్ కేంద్రం, పోర్‌బందర్‌లో రైల్వే ఫ్లైఓవర్, రెండు గతి శక్తి కార్గో టెర్మినళ్లు వంటివి రానున్నాయని వెల్లడించారు.

గత 11 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా 34,000 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాకులు వేశామని, ఇది రోజుకు సగటున 12 కిలోమీటర్లతో సమానమని ఆయన గుర్తుచేశారు. రైళ్ల రాకపోకలను నిలిపివేయకుండానే 1,300 రైల్వే స్టేషన్లను ఆధునీకరించడం భారత రైల్వే చరిత్రలో అపూర్వమైన ఘట్టమని కొనియాడారు. వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ వంటి ఆధునిక రైళ్లను ప్రవేశపెట్టామని, తక్కువ ధర టిక్కెట్లతో అత్యాధునిక సౌకర్యాలున్న 8 అమృత్ భారత్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని ఆయన అన్నారు. గుజరాత్‌తో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కూడా డబుల్ ఇంజన్ ప్రభుత్వాల సహకారంతో రైల్వే ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని అశ్విని వైష్ణవ్ వివరించారు.

## కొత్త రూల్.. పావురాలకు తిండిపెడితే జైలుకే..





ముంబై-నవభూమి:జంతు ప్రేమికులకు నిజంగా ఇది షాకింగ్ విషయమే అని చెప్పాలి. ఇకపై పబ్లిక్‌లో పావురాలకు తిండిపెడితే జైలు శిక్ష తప్పదు. తాజాగా, ఓ వ్యక్తి పావురాలకు తిండిపెట్టి కేసులో చిక్కుకున్నాడు. అయితే, అది మన తెలుగు రాష్ట్రాల్లో అయితే కాదులెండి. మహారాష్ట్రలోని ముంబై నగరంలో. ముంబై హైకోర్టు జులై 31వ తేదీన బ్రిహన్‌ముంబై మున్సిపల్ కార్పోరేషన్(బీఎమ్‌సీ)కు కీలక ఆదేశాలు జారీ చేసింది. పబ్లిక్ ప్లేసుల్లో పావురాలకు తిండిపెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. వారిపై క్రిమినల్ కేసులు పెట్టమని చెప్పింది.ముంబై హైకోర్టు ఆదేశాల ప్రకారం.. పబ్లిక్, చారిత్రక ప్రదేశాల్లో పావురాలకు తిండిపెట్టడం నిషేదం. పావురాల కారణంగా ప్రజల ఆరోగ్యం పాడవుతోందని,శ్వాసకోశ సంబంధిత సమస్యలు వస్తున్నాయని హైకోర్టు పేర్కొంది. ప్రజల ఆరోగ్యం, వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ కొత్త రూల్ గురించి ప్రజలకు తెలియకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే ఓ వ్యక్తి స్కూటీపై ఎల్‌జీ రోడ్డులోని ఖాబూతరా?నా దగ్గరకు వచ్చాడు.

## దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కేంద్రం గుడ్‌న్యూస్.. 35 రకాల మందుల ధరలు తగ్గిస్తూ నిర్ణయం..!



న్యూఢిల్లీ-నవభూమి:దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కేంద్రం భారీ ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా 35 రకాల మందుల ధరలను తగ్గించింది. దేశ ప్రజలకు ప్రజలకు మందులను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీలు విక్రయిస్తున్న 35 ఔషధాల రిటైల్ ధరలను తగ్గించింది. ఈ ఒంటినొప్పులు, గుండెసంబంధిత, మధుమేహం, మానసిక వ్యాధుల చికిత్సకు ఉపయోగించే ఔషధాలపై తగ్గింపు వర్తించనున్నది. దాంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊరట కలుగన్నుది.


ఈ మేరకు రసాయనాలు-ఎరువుల మంత్రిత్వ శాఖ ఈ ఉత్తర్వులను మేరకు జారీ చేసింది. యేసిలోఫెనాక్, పారాసెటమాల్, ట్రైప్సిన్ కైమోట్రిప్సిన్ ఫిక్స్‌డ్-డోస్ కాంబినేషన్, అమోక్సిసిలిన్-పొటాషియం క్లావ్యులానేట్, అటోర్వాస్టాటిన్, ఎంపాగ్లిఫ్లోజిన్, సిటాగ్లిప్టిన్, మెట్‌ఫార్మిన్ వంటి మందులున్నాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ విక్రయించే యేసిలోఫెనాక్-పారాసెటమాల్-ట్రైప్సిన్ కైమోట్రిప్సిన్ మాత్ర ధరను రూ.13గా నిర్ణయించింది.క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ విక్రయించే అదే ఫార్ములేషన్ ధరను 15.01గా పేర్కొంది. గుండె సంబంధిత వ్యాధులున్న వారు విస్తృతంగా వాడే మెడిసిన్ అయిన అటోర్వాస్టాటిన్ 40 mg క్లోపిడొగ్రెల్ 75 mg మాత్రల ధరలను రూ.25.61గా నిర్ణయించింది. చిన్నపిల్లలకు ఉపయోగించే సెఫిక్సిమ్, పారాసెటమాల్ ఓరల్ సస్పెన్షన్స్, విటామిన్ డీ లోపం ఉన్న వారిలో వాడే కోలికాల్సిఫెరాల్ డ్రాప్స్, డైక్లోఫెనాక్ ఇంజెక్షన్ ధర రూ.31.77కి తగ్గించింది. రిటైలర్లు, డీలర్లు అందరూ మెడికల్ షాపుల్లో తాజా ధరల జాబితాను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించింది. ఎక్కువకు ధరకు ఆయా మందులను విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఔషధ ధరల నియంత్రణ ఆర్డినెన్స్ 2013, ఎసెన్షియల్ కమెడిటీస్ యాక్ట్ 1955 ప్రకారం జరిమానాలు విధించనున్నట్లు తెలిపింది. ఆయా మెడిసిన్ల ధరలు మినహాయించామని.. అదనంగా జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. ఔషధ తయారీ కంపెనీలు కొత్త ధరల జాబితాను ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అప్‌డేట్ చేసి.. ఎన్‌పీపీఏ, రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్స్‌కు సమర్పించాలని ఆదేశించింది. తాజా ఆదేశాలతో ఆయా ఔషధాలపై ఇప్పటికే ఉన్న ధరల ఉత్తర్వులు రద్దయినట్లు స్పష్టం చేసింది.

## వీడియో గేమ్స్‌కు బానిసైన బాలుడు.. ఆత్మహత్యకు పాల్పడి మృతి




న్యూఢిల్లీ-నవభూమి: ఒక బాలుడు వీడియో గేమ్స్‌కు బానిస అయ్యాడు. వర్షం వల్ల స్కూల్‌కు వెళ్లకుండా ఇంట్లో ఉన్నాడు. దీంతో పలు గంటలపాటు మొబైల్ ఫోన్‌లో వీడియో గేమ్స్ ఆడాడు. ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉద్యోగానికి వెళ్లి వచ్చిన తల్లిదండ్రులు చూడగా ఇంట్లో ఉరివేసుకుని అతడు మరణించాడు. దీంతో బాలుడి ఆత్మహత్యపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. అంబికా విహార్ కాలనీలో నివసించే కుటుంబానికి చెందిన పదేళ్ల బాలుడు నంగ్లోయిలోని ఎంసీడీ స్కూల్‌లో చదువుతున్నాడు. మొబైల్ ఫోన్‌లో వీడియో గేమ్స్ ఆడటంలో అతడు బానిస అయ్యాడు. కాగా, జూలై 31న వర్షం వల్ల ఆ బాలుడు స్కూల్‌కు వెళ్లలేదు. ఉద్యోగాలు చేసే తల్లిదండ్రులు అతడ్ని ఇంట్లో ఉంచి వెళ్లారు. ఈ నేపథ్యంలో సుమారు 11 గంటలపాటు మొబైల్ ఫోన్‌లో వీడియో గేమ్స్ ఆడాడు. సాయంత్రం పేరెంట్స్ ఇంటికి వచ్చి చూడగా ఇనుప పైపునకు ఉరి వేసుకుని వేలాడుతూ శవమై కనిపించాడు.మరోవైపు బాలుడి మరణం గురించి తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పరిశీలించారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానించారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు.కాగా, బాలుడి ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లిదండ్రులు తిట్టడం, స్కూల్‌లో ఒత్తిడి లేదా మొబైల్ గేమ్‌లో ఓడిపోవడం వల్ల కలిగే మానసిక ఒత్తిడి కారణంగా ఆ బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## కుమార్తె, ఇద్దరు అబ్బాయిలతో కలిసి.. భర్తను హత్య చేసిన భార్య



గౌహతి-నవభూమి: ఒక మహిళ, ఆమె కుమార్తెకు ఇద్దరు అబ్బాయిలతో సంబంధం ఉన్నది. ఈ నేపథ్యంలో వారంతా కలిసి మహిళ భర్తను హత్య చేశారు.గుండెపోటు వల్ల చనిపోయినట్లు నమ్మించేందుకు ప్రయత్నించారు. అయితే మృతదేహంపై గాయాలు ఉండటంతో హత్యగా నిర్ధారణ అయ్యింది. అస్సాంలోని దిబ్రుగఢ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూలై 25న లాహెూన్ గావ్‌లోని బోర్బరువా ప్రాంతానికి చెందిన ఉత్తమ్ గొగోయ్ గుండెపోటుతో మరణించినట్లు అతడి సోదరుడికి సమాచారం అందింది. దీంతో అతడు వెంటనే ఆ ఇంటికి వెళ్లాడు.కాగా, మరణించిన ఉత్తమ్ చెవిపై గాయం ఉండటాన్ని సోదరుడు గమనించాడు. గుండెపోటుతో చనిపోతే చెవి ఎలా తెగుతుందని ప్రశ్నించాడు. అయితే తమ ఇంట్లో దోపిడీ జరిగిందని, దొంగల దాడిలో ఉత్తమ్ మరణించినట్లు అతడి భార్య బాబీ సోనోవాల్, కూతురు మాటమార్చారు. దీంతో అనుమానించిన మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.మరోవైపు పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. ఉత్తమ్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. దాడి వల్ల అతడు మరణించినట్లు రిపోర్ట్‌లో తేలింది. ఈ నేపథ్యంలో మృతుడి భార్య బాబీ, 9వ తరగతి చదువుతున్న ఆమె కుమార్తెను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.కాగా, తన బాయ్ ఫ్రెండ్స్‌తో కలిసి తండ్రిని హత్య చేసినట్లు మృతుడి కుమార్తె పోలీసుల ముందు అంగీకరించింది. ఈ నేపథ్యంలో ఇద్దరు అబ్బాయిలను కూడా అదుపులోకి తీసుకున్నారు. కుమార్తెతో పాటు ఆమె తల్లి బాబీతో కూడా ఆ అబ్బాయిలకు సంబంధం ఉన్నట్లు పోలీసులు తెలుసుకున్నారు.

## పోలీస్ అధికారి ఇంట్లోకి వరద నీరు.. ఆయన ఏం చేశారంటే?



లక్నో-నవభూమి: పోలీస్ అధికారి ఇంట్లోకి వరద నీరు ప్రవేశించింది. దీంతో చేసేదేమీ లేక ఆ నీటిలో పవిత్ర స్నానమాచరించారు. అలాగే పూజలు చేసి గంగా హారతి ఇచ్చారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. భారీ వర్షాలకు ప్రయాగ్‌రాజ్‌లోని గంగా, యమున నదులు పొంగి ప్రవహించాయి. దీంతో అనేక లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. పలు ఇళ్లను వరద నీరు ముంచెత్తింది.కాగా, సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రదీప్ నిషాద్ ఇంట్లోకి కూడా వరద నీరు ప్రవేశించింది. దీంతో ఆయన వినూత్నంగా స్పందించారు. తన ఇంటి వద్దకు వచ్చిన గంగా ప్రవాహానికి పూలు, పాలు అర్పించి పూజలు చేశారు. ఆ తర్వాత నడుం లోతున ఇంట్లోకి చేరిన నీటిలో పవిత్ర స్నానమాచరించారు. అలాగే గంగా హారతి ఇచ్చారు.మరోవైపు పోలీస్ అధికారి చంద్రదీప్ నిషాద్ ఈ వీడియో క్లిప్స్‌ను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. దీంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో నెటిజన్లు భిన్నంగా స్పందించారు. కొంతమంది ఆయన భక్తిని ప్రశంసించగా, మరికొందరు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై మండిపడ్డారు. 'ఈ గంగా తల్లి ఒక పేద వ్యక్తి ఇంటికి వస్తే మొత్తం ఇంటిని నాశనం చేస్తుంది. ఇది చాలా బాధాకరం' అని ఒకరు వ్యాఖ్యానించారు. 'ఇలాంటి నిస్సహాయత, అవినీతితో జీవించడాన్ని మన భారతీయులు నేర్చుకుంటారు. రాబోయే 5,000 సంవత్సరాలలో కూడా పరిస్థితి ఏమీ మారదు' అని మరొకరు విమర్శించారు.

### ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేసిన

## మాజీ కేంద్రమంత్రి చిదంబరం..!



న్యూఢిల్లీ-నవభూమి: కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి పీ చిదంబరం తీవ్ర ఆరోపణలు చేశారు. బిహార్ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు సంబంధించి ఆయన విమర్శలు గుప్పించారు. రాష్ట్రాల ఎన్నికల నిర్మాణం, ఓటరు సరళిని మార్చేందుకు ఈసీ ప్రయత్నిస్తోందని.. ఇది అధికార దుర్వినియోగంగా ఆరోపించారు. దీన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా వ్యతిరేకించా లన్నారు. బిహార్‌లో 65లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కునే కోల్పోయే ప్రమాదం ఉందని.. తమిళనాడులో 6.5లక్షల మంది ఓటర్లు పెరుగడం ఆందోళనరమైన చర్యని, చట్టవిరుద్ధమని సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రజలు శాశ్వతంగా వలస వచ్చారని చెప్పడం వలస కార్మికులను అవమానించడమేనని.. తమిళనాడు ప్రజలు ప్రతినిధులను ఎన్నుకునే హక్కులో ప్రత్యక్ష జోక్యమన్నారు. ఛత్‌పూజ వంటి పండుగల సమయాల్లో వసల కార్మికులు తమ సొంత రాష్ట్రానికి తిరిగి రాగలిగినప్పుడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిరిగి రాలేరా? అన్న ప్రశ్నను ఆయన లేవనెత్తారు. చిదంబరం ఎన్నికల కమిషన్‌పై ఆరోపణలు చేస్తూ.. శాశ్వత, చట్టబద్ధమైన నివాసం ఉంటేనే ఏ వ్యక్తినైనా ఓటరు జాబితాలో చేర్చవచ్చన్నారు. వలస కార్మికుల నివాసం బీహార్, వారి సొంత రాష్ట్రంలో ఉంటే, వారిని తమిళనాడులో ఓటర్లుగా ఎలా చేర్చగలరని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ ఉద్దేశపూర్వకంగా రాష్ట్రాల ఎన్నికల గుర్తింపు, మోడల్‌ను మార్చడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ మొత్తం అంశంపై ప్రతిపక్షం పార్లమెంటులో నిరసన తెలుపుతోందని.. దానిపై చర్చకు డిమాండ్ చేస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ ఈ ప్రవర్తన ప్రజాస్వామ్యానికి ముప్పు అని దీన్ని విస్మరించలేమన్నారు. రాజకీయంగా, చట్టపరమైన రంగాల్లో పోరాడాలని ఆయన దీనిని విస్మరించలేము. ఈ పోరాటం రాజకీయంగా, చట్టపరంగా పోరాడాలన్నారు. ప్రతి భారతదేశ పౌరుడికి శాశ్వత నివాసం ఉన్న ఏ రాష్ట్రంలోనైనా నివసించడానికి, పని చేయడానికి హక్కు ఉందని, స్పష్టంగా సరైందేనన్నారు. బీహార్ ప్రస్తుత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న లక్షల మంది వ్యక్తులు రాష్ట్రం నుంచి శాశ్వతంగా వలస వెళ్లారని, కావున వారిని మినహాయించాలని ఈసీ ఎలా నిర్ణయానికి వచ్చింది అని ప్రశ్నించారు. ఒక వ్యక్తి ఒక రాష్ట్రం నుంచి శాశ్వతంగా వలస వెళ్లారనే నిర్ధారణకు రాక ముందే, ప్రతి కేసుపై సమగ్ర విచారణ నిర్వహించకూడదా? ఓటుహక్కు తొలగింపు అనేది తీవ్రమైన సమస్యని.. అందుకే సుప్రీంకోర్టు ఆయా పిటిషన్లను విచారిస్తోందన్నారు. చిదంబరం సోషల్ మీడియా పోస్ట్‌ను తమిళనాడు సీఎం కార్యాలయాన్ని ట్యాగ్ చేశారు. అయతే, తమిళనాడు ఓటరు జాబితాలో వలస కార్మికులను చేర్చడంపై అధికార డీఎంకేతో పాటు ప్రాంతీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## క్యాబిన్ లగేజ్ వివాదం



శ్రీనగర్-నవభూమి: క్యాబిన్ ల్యగేజీ విషయంలో ఎయిర్‌లైన్స్ సిబ్బంది, ఆర్మీ అధికారి కి మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. పరిమితికి మించిన లగేజ్‌ను క్యాబిన్‌లోకి తీసుకొచ్చేందుకు ఆర్మీ అధికారి ప్రయత్నించగా.. సిబ్బంది అడ్డుకున్నారు. అదనపు ఛార్జీలు చెల్లించాలని కోరితే అందుకు ఆయన నిరాకరించారు. బోర్డింగ్ ప్రక్రియ పూర్తిచేయకుండానే లోపలికి ప్రవేశించడంతో సిబ్బంది ఆయనను అనుమతించలేదు. దీంతో సిబ్బందిపై దాడిచేసి ముష్టిఘాతాలు కురిపించారు. ఈ తతంగం మొత్తం అక్కడ సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యింది. జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ విమానాశ్రయంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాడిలో నలుగురు ఎయిర్‌లైన్స్ సిబ్బందికి గాయాలయ్యాయి.ఏ టైమ్‌లో ఎండలో ఉంటే విటమిన్ డి సరిగా అందుతుంది,

వివరాల్లోకి వెళ్తే.. శ్రీనగర్ నుంచి న్యూఢిల్లీకి వెళ్లే స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ విమానంలో ఆర్మీ అధికారి టిక్కెట్ బుక్ చేసుకున్నారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం ఎక్కేందుకు వచ్చిన ఆయన.. 16 కిలోల హ్యాండ్ బ్యాగేజీ (క్యాబిన్ లగేజ్) తీసుకొచ్చారు. నిబంధనల ప్రకారం.. క్యాబినెట్ లగేజి పరిమితి 7 కిలోలు. దీనికి రెండింతలు ఎక్కువే ఆయన తీసుకురావడం సమస్య ఉత్పన్నమైంది. లగేజీకి అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని బోర్డింగ్ సమయంలో సిబ్బంది చెప్పినా ఆయన నిరాకరించారు. అంతేకాదు, బోర్డింగ్ ప్రక్రియ పూర్తి చేయకుండా బలవంతంగా ఎయిరో బ్రిడ్జ్‌లోకి ప్రవేశించారు. ఈ సమయంలో సిబ్బంది అడ్డుకోవడంతో రెచ్చిపోయారు. చెక్-ఇన్ గేట్ వద్ద ఉపయోగించే సైన్‌బోర్డుతో ఉద్యోగులపై దాడి చేసి, పిడిగుద్దులు కురిపించారు. అక్కడ ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది పరిస్థితిని నియంత్రించేందుకు ప్రయత్నించినా.. ఆర్మీ అధికారి మాత్రం ఆగలేదు. సిబ్బందిని దూషిస్తూ పదేపదే దాడులు చేశారు. ఈ ఘటనలో ఒకరికి వెన్నెముకకు గాయం కాగా.. ముగ్గురికి ముఖం, దవడపై గాయాలయ్యాయి. ఓ ఉద్యోగి అపస్మారక స్థితిలో కింద పడిపోయినా ఆర్మీ అధికారి వదిలపెట్టలేదు. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇక, గతంలోనూ విమాన సిబ్బందిపై పోలీసులు, ఆర్మీ అధికారులు దాడిచేసిన దాఖలాలు ఉన్నాయి.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన స్పైస్‌జెట్.. ఆర్మీ అధికారిని నో-ఫ్లై లిస్ట్‌లో చేర్చే ప్రక్రియ ప్రారంభించింది. కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. 'తమ ఉద్యోగులపై హింసను స్పైస్‌జెట్ తీవ్రంగా ఖండిస్తోంది. చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటుంది' అని సంస్థ ప్రకటనలో తెలిపింది. అటు, కూడా స్పందిస్తూ.. తమ సిబ్బంది తక్షణమే స్పందించి జోక్యం చేసుకుని పరిస్థితిని నియంత్రించారని, విమాన సర్వీసులు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నామని తెలిపింది. అలాగే, ఆర్మీ వర్గాలు కూడా ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించినట్టు తెలిపాయి. విచారణకు పూర్తిగా సహకరిస్తామని పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## ఒడిశా టీనేజర్‌కు నిప్పంటించిన కేసులో బిగ్ ట్విస్ట్..

### వీడియో విడుదల చేసిన తండ్రి



న్యూఢిల్లీ-నవభూమి: తీవ్రమైన కాలినగాయాలతో ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఒడిశాలోని పూరీకి చెందిన టీనేజర్‌ను బతికించడానికి వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆమె పరిస్థితి విషమించి శనివారం రాత్రి కన్నుమూసింది. అయితే, ఈ కేసు కొత్త మలుపు తిరిగింది. ముగ్గురు వ్యక్తులు ఆ బాలికకు నిప్పటించినట్టు మొదట్లో భావించగా, ఇందులో ఎవరి ప్రమేయం లేదని పోలీసులు తాజాగా ప్రకటించారు. ఇదే సమయంలో బాధితురాలి తండ్రి కూడా ఓ విడుదల చేసి.. తన కుమార్తె మానసిక వేదన కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు.

75 శాతం కాలిన గాయాలతో ఉన్న బాలికను చికిత్స కోసం జులై 19న భువనేశ్వర్ ఎయిమ్స్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మర్నాడు ఢిల్లీకి ఎయిర్‌లిఫ్ట్ చేశారు. కానీ, ప్రభుత్వం, వైద్య నిపుణులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఆమెను కాపాడేకపోయారని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ మాఝా వెల్లడించారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని నిమిషాల్లోనే ఒడిశా పోలీసులు.. దర్యాప్తు తుది దశకు చేరుకుందని ప్రకటించారు. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో ఎవరూ ప్రమేయం లేదని తేలిందని చెప్పారు.అయితే, బాలిక ఏ విధంగా నిప్పు పెట్టుకుందీ అనేది మాత్రం వివరించలేదు.అలాగే, ఈ విషాద సమయంలో ఎవరూ సున్నితమైన వ్యాఖ్యలు చేయవద్దని పోలీసులు సూచించారు. ఇది జరిగిన కొద్దిసేపటికే బాధితురాలి తండ్రి ఓ భావోద్వేగ వీడియోను విడుదల చేశారు. తన కుమార్తె మానసిక వేదనతో అర్థాంతరంగా జీవితం ముగించుకుందని.. దీనిని ఎవరూ రాజకీయం చేయవద్దని, ఆమె ఆత్మకు శాంతి కోరాలన్నియన విజ్ఞప్తి చేశారు."నా కుమార్తెను కోల్పోయాను... మానసిక ఒత్తిడికి తాళలేక ఆమె జీవితాన్ని ముగించుకుంది.. ఆమె భరించలేని వేదన ఎదుర్కొంది.. ఒడిశా ప్రభుత్వం మా కుటుంబానికి చాలా సహాయపడింది.. ఈ విషయాన్ని ఎవ్వరూ రాజకీయంగా వాడుకోకండి.. దయచేసి నా కుమార్తె ఆత్మకు శాంతి కోరండి. నాకు ఇప్పుడు కావాల్సింది శాంతి మాత్రమే" అని ఆయన అభ్యర్థించారు.మరోవైపు, ఈ అంశంపై ఒడిశాలో నిరసనలు కొనసాగుతున్నాయి. బాధిత బాలికకు జూలై 19న నిప్పంటించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యక్షసాక్షుల ప్రకారం ముగ్గురు వ్యక్తులు ఈ ఘటనలో పాల్గొన్నారని చెబుతున్నారు. మంటల్లో కాలిపోతూ నా ఇంటివైపు పరుగెత్తికొచ్చిన ఆమె చేతులు కట్టేసి ఉన్నాయని, తన భార్య, కుమార్తెతో కలిసి మంటలు ఆర్పినట్టు ఓ వ్యక్తి చెప్పారు. తనను బలవంతంగా ముగ్గురు వ్యక్తులు బైక్‌పై నదీ తీరానికి తీసుకెళ్లి, కిరోసిన్ పోసి నిప్పటించారని బాధితురాలు చెప్పిందని ఆమెకు సహాయం చేసిన ప్రత్యక్షసాక్షి దుఖిశ్యామ్ సెనాపతి తెలిపారు. అలాగే, బాధితురాలి తల్లి కూడా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ముగ్గురు గుర్తుతెలియని తెలియని వ్యక్తులు తన కుమార్తెకు నిప్పంటించారని ఆరోపించారు.

## ఉమ్మడి భార్య అక్కడి సంప్రదాయం!



నీలగిరి-నవభూమి: ఒకే మహిళ అన్నదమ్ములిద్దరినీ పెండ్లి చేసుకున్న వార్త, వాళ్ల ఫొటోలు ఇటీవల వార్తల్లో విపరీతంగా వైరల్ అయ్యాయి. అట్టహాసంగా జరిగిన ఈ పెండ్లి వేడుక గురించి చదివిన చాలా మంది ఇది నిజమో కాదో అని అనుమానపడితే, మరికొందరు ఇదేం వింత అని ఆశ్చర్యపోయారు. కొన్ని చోట్ల ఒకే భర్తకు ఇద్దరు, ముగ్గురు భార్యలు ఉన్నట్టే మన భారత దేశంలోని కొన్ని తెగల్లో ఒకే భార్యను అన్నదమ్ములు పెండ్లాడతారు. అరుదైన ఈ సంప్రదాయం వెనుక ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక అంశాలెన్నో ముడిపడి ఉన్నాయి.

హిందూ పురాణాల్లో ద్రౌపది పాండవులందరికీ భార్య. ఒకరు చేసుకున్న వ్యక్తే మిగిలిన వారికీ ఆలి అవుతుంది అక్కడ. అచ్చం ఇదే విధానం పాటించే కొన్ని తెగల వారు భారతదేశంలోనే ఉన్నారు. ముఖ్యంగా హిమాచల్‌ప్రదేశ్‌లోనూ, ఉత్తరాఖండ్ సరిహద్దుల్లో నివసించే హత్తి గిరిజన తెగ వారు దీన్ని తరాలుగా అనుసరిస్తున్నారు. ఇప్పుడు పెండ్లి చేసుకున్న సునీత చౌహాన్, కపిల్ నేగి, ప్రదీప్‌లు కూడా ఇదే తెగకు చెందిన వారు. తమ సంప్రదాయాన్ని ఘనంగా చాటుకోవాలన్న ఉద్దేశంతోనే మూడు రోజులపాటు అట్టహాసంగా పెండ్లి జరుపుకున్నట్టు వాళ్లు ప్రకటించుకున్నారు. ఇదే ప్రాంతంలో ఉండే ఖాసాలుగా పిలిచే మరో తెగవాళ్లతో పాటు తమిళనాడు రాష్ట్రంలోని నీలగిరి ప్రాంతంలో ఉండే తోడా గిరిజనులు కూడా ఈ బహు భర్తృత్వాన్ని పాటిస్తారు. ఇంగ్లిషులో దీన్ని ఫ్రాటర్నల్ పాలియాండ్రీ అని పిలుస్తారు. దీని ప్రకారం అన్నదమ్ముల్లో పెద్దవాడు ఏ అమ్మాయిని చేసుకుంటే ఆమె మిగతా వాళ్లందరికీ భార్య అవుతుంది. ఒకే తల్లికి పుట్టిన బిడ్డలే కాకుండా వేరు వేరు తల్లులకు పుట్టిన ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములూ ఇలా పెండ్లి చేసుకోవచ్చు. ఇద్దరు నుంచి నలుగురు, ఐదుగురు ఇలా సంఖ్య ఏదైనా కావచ్చు. ఇళ్లలో శుభకార్యం జరిగినప్పుడు కూడా భర్తలంతా ఆమె పక్కన కూర్చుంటారు. ఆమె పుట్టింటి వాళ్లు ఊరివాళ్లు కూడా అందరికీ సమానంగా అల్లుడి గౌరవం ఇస్తారు.సాధారణంగా ఈ తెగలన్నింటిలో జనం ఎక్కువగా కొండ ప్రాంతాల్లో నివసిస్తారు. అక్కడ భూమిని పంచుకోవడం అన్నది సమస్యాత్మకంగా ఉంటుంది. ఎగుడు దిగుడు నేలలతో పాటు నీటి లభ్యతలోనూ తేడాలుంటాయి. దానికి తోడు పేదరికం, చిన్న భూకమతాలు ఉండే కుటుంబాలు ఎక్కువ. కాబట్టి వాటిని పంచుకోవడం సమస్యగా మారకుండా ఒక కుటుంబంలోని వాళ్లంతా ఉమ్మడిగా ఉండేందుకు ఒకే ఆలిని కట్టుకుంటారన్నమాట. భూమిని కాపాడుకోవడం కోసమే కాదు, కొండ ప్రాంతాల్లో మంది బలం ఉండటం అన్నది భద్రత పరంగా చాలా ముఖ్యం. ఒకే ఇంట్లో ఎక్కువ మంది మగవారు ఉన్నారంటే ఆ కుటుంబం ఎక్కువ బలంగా ఉన్నట్టు లెక్క. అలాగే ఒకే తల్లికి జన్మించినా, లేదా వేరు వేరు తల్లులకు చెందిన వాళ్లయినా సరే అన్నదమ్ముల మధ్య సఖ్యతను ఏర్పరచి ఉమ్మడి కుటుంబాలను నిలబెట్టడానికి ఈ పద్ధతి ఉపయోగపడుతుందని అక్కడి వాళ్లు నమ్ముతారు.ఇక, ఒక్కొక్కరూ ఒక్కో అమ్మాయిని పెండ్లి చేసుకుని ఒక్కో కుటుంబాన్ని పోషించే స్తోమత లేకపోవడంలాంటి ఆర్థికపరమైన కారణాలూ ఇక్కడ కనిపిస్తాయి. ఇక, ప్రభుత్వ పరంగా చెప్పాలంటే హిమాచల్ ప్రదేశ్ రెవెన్యూ చట్టాల ప్రకారం జోడిదార్‌గా పిలిచే వీళ్ల వివాహాలకు గుర్తింపు ఉంది. ఆమెకు పిల్లలు పుట్టాక వాళ్లని ఒక్కో భర్త ఆ పిల్ల లేదా పిల్లాడిని తమ బిడ్డగా దత్తత తీసుకునే తరహా కార్యక్రమం చేస్తారు. దాని ఆధారంగానే సర్టిఫికెట్లలో బిడ్డకు తండ్రి పేరు రాస్తారట. పుట్టుక నుంచి చావు దాకా ఈ తెగల్లో ఇలాంటి చిత్రమైన వ్యవహారాలెన్నో ఉన్నాయి. సోషల్‌మీడియా కారణంగా ఇది నలుగురిలోకీ వచ్చింది కానీ ఈ ఆచారాలు తరాల నాటివన్నమాట!

## చిన్న విషయాలను కూడా ఏఐని అడిగాకే చేస్తున్న భారతీయులు..



న్యూఢిల్లీ-నవభూమి: రెస్టారెంట్‌కు వెళ్లి ఏ ఫుడ్ ఐటమ్ ఆర్డర్ ఇవ్వాలో తేల్చుకోలేక బుర్ర బద్ధలు కొట్టుకుంటున్నారా? గిఫ్ట్ షాపుకెళ్లి ఏం కొనాలో తికమకపడుతున్నారా? ఈ సమస్య మీ ఒక్కకరిదే కాదు..ప్రస్తుతం దేశంలో అత్యధిక శాతం మంది అతిగా ఆలోచిస్తూ ఓ పట్టాన నిర్ణయం తీసుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ అతి ఆలోచన నుంచి బయటపడేందుకు చాలామంది టెక్నాలజీని ఆశ్రయించడం పరిపాటిగా మారిపోయిందని ఓ తాజా సర్వేలో వెల్లడైంది.ఏదీ తేల్చుకోలేక అయోమయంలో పడినపుడు స్పష్టత కోసం చాట్‌జీపీటీ వంటి కృత్రిమ మేధ(ఏఐ)ను, గూగుల్ సెర్చ్ ఇంజిన్‌ని అత్యధిక భారతీయులు ఉపయోగిస్తున్నట్లు సెంటర్ ఫ్రెష్, యూగవ్ సంయుక్తంగా నిర్వహించిన సర్వే నివేదిక తెలియచేసింది.ప్రతి నలుగురు భారతీయులలో ఒకరు నిర్ణయాల్లో సాయం కోసం టెక్నాలజీని ఆశ్రయిస్తున్నట్లు తేలింది. 2,100 మంది భారతీయులతో శాంపిల్ సైజు సర్వే నిర్వహించగా తాము రోజులో మూడు గంటలు అతిగా ఆలోచిస్తున్నామని అందులో 81 శాతం మంది ఒప్పుకున్నారు. అదో నిత్య అలవాటుగా తమకు మారినట్లు నలుగురిలో ఒకరు చెప్పారు. అతిగా ఆలోచించకుండా త్వరితంగా నిర్ణయం తీసుకునేందుకు తాము చాట్‌జీపీటీపై ఆధారపడుతున్నట్లు ప్రతి ముగ్గురిలో ఒకరు తెలియచేసినట్లు ఇండియా ఓవర్ థింకింగ్ రిపోర్టు పేర్కొంది.దేశవ్యాప్తంగా టైర్ 1, టైర్ 2, టైర్ 3 నగరాలలో ఈ సర్వే జరిగింది. ఆహారం, జీవనశైలి అలవాట్లు, డిజిటల్ సోషల్ లైఫ్, డైటింగ్, రిలేషన్‌షిప్స్, కెరీర్ అంశాలపై ఈ సర్వే నిర్వహించారు. చిన్న చిన్న విషయాలపై నిర్ణయం తీసుకోవడంలో కూడా అతిగా ఆలోచించడం భారతదేశ ప్రజల దైనందిన జీవితంలో భాగమైపోయినట్లు ఈ సర్వే కనుగొంది.

## తొలి రోజు జైలులో ప్రజ్వల్ రేవణ్ణ..



బెంగళూరు-నవభూమి: పలువురు మహిళలపై లైంగిక దాడి కేసులో మాజీ ప్రధాని దేవగౌడ మనవడు, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు ప్రజాప్రతినిధుల కోర్టు శాశ్వత జైలు శిక్ష విధించిన నేపథ్యంలో అతడిని బెంగళూరులోని పరప్పన్ అగ్రహార సెంట్రల్ జైలుకు శనివారం పోలీసులు తరలించారు. అనంతరం అతడికి ఖైదీ నెంబర్ 15528ను కేటాయించారు. అయితే అతడు గత రాత్రి.. అంటే శనివారం రాత్రి చాలా విచారంతోపాటు కొంత ఒత్తిడితో కనిపించారని జైలు అధికారులు ఆదివారం తెలిపారు. ఇక శనివారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత ప్రజ్వల్ ఆరోగ్యాన్ని వైద్యులు పరీక్షించారని చెప్పారు. అతడి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వెల్లడించారన్నారు. వైద్యుల పరీక్షిస్తున్న సమయంలో సైతం అతడు దీనంగా ఉన్నడని.. అలాగే తన బాధను వారికి వ్యక్తం చేశాడని చెప్పారు. మరోవైపు ప్రజా ప్రతినిధుల కోర్టు ఇచ్చిన తీర్పుపై తాను హైకోర్టుకు వెళ్తానని సిబ్బందికి తెలియజేసినట్లు తెలుస్తోంది. ఇంకోవైపు అతడిని భారీ భద్రత ఉన్న సెల్‌లో ఉంచామన్నారు. అలాగే అతడిని ఉంచి సెల్‌కు అసాధారణ రీతిలో భద్రత కల్పించామని చెప్పారు. సాధారణ ఖైదీలకు వలే డ్రస్ కోడ్ ఆయనకు ఉందని తెలిపారు. ఆ డ్రస్‌ను ప్రజ్వల్‌కు అందజేస్తామని స్పష్టం చేశారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు హాసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు చెందిన కొన్ని అసభ్యకర వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయినాయి. అదే సమయంలో ప్రజ్వల్ రేవణ్ణ తమపై లైంగిక దాడి జరిపినట్లు పలువురు మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను నియమించింది. దీనిపై సిట్ విచారణ జరిపి.. ప్రజ్వల్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమని తేల్చి చెప్పింది.


## చెడిన స్నేహం

భారతదేశం అమెరికా మధ్య స్నేహం అనేది గత దశాబ్దంలో మమకారంగా, ఒక వాణిజ్యపరమైన అనుసం ధానాన్ని మించి ఒక మానవ సంబంధంగా అభివృద్ధి చెందిన ట్టుగా భావించబడింది. ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవిలో ఉన్న సమయంలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఉన్న అతీతమైన ఆత్మీయత, ఇద్దరి మధ్యలో ఆరాధన స్థాయికి చేరిన బంధం, "హౌడీ మోదీ", "నమస్తే ట్రంప్" వంటి గోత్ర ధ్వనుల మాయాజాలంలో ప్రజలను లయపరిచింది. కానీ రాజకీయ రంగస్థలంపై మిత్రతలు శాశ్వతం కావని, వాటి వెనుక ప్రయోజనాలే ప్రాథమిక మౌలికాలని తాజా పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. మోదీ -ట్రంప్ సంబం ధం ప్రారంభంలోనే ఒక అప్రతిబంధ, మూడో ప్రపంచ దేశం అమెరికాతో సమానంగా మైత్రిని మెరుగుపరచాలనే ఆశతో నడిచింది. ఉగ్రవాదంపై పోరాటం, వాణిజ్య ఒప్పందాలు, ఆయుధ కొనుగోళ్లు వంటి అంశాలలో సాన్నిహిత్యం పెరిగింది. కానీ ఈ దశల్లో మోదీ ప్రభుత్వం, ట్రంప్ ప్రబలమైన రాజ్యాధికారం మధ్య తేడాలను, విలువల విభిన్నతను గుర్తించలేకపోయింది. ఇది ఒక్క మోదీకి కాదు,ారత దేశానికి చెల్లాల్సిన వ్యయం అయింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ స్వభావం మారబడి రాబోయే వాణిజ్య ఒప్పందాలపై ఒత్తిడి పెంచాడు. ఒకవైపు భారత్‌కు మిత్రుడిగా కనిపిస్తూ, మరోవైపు చమురు దిగుమతులపై అధిక డ్యూటీలు, భారత దిగుమతులపై నిషేధాలు వంటి చర్యలతో తమ స్వలాభం కోసం పన్నులు, ఒత్తిడి విధానాలు సాగించాడు. మోదీ మౌనం పాటించగా, ట్రంప్ మరింత దూకుడుగా తానేగో పెద్ద నాయకుడనటానికి ప్రయత్నించాడు. ఇది ద్వైపాక్షిక గౌరవాన్ని గీసిన గీతను మించిపోయింది. మోదీపై ఉన్న ట్రంప్ విమర్శలు, 'డెడ్ ఎకానమీ' వంటి పదాలు భారత ఆర్థిక వ్యవస్థను కించపరిచే వ్యాఖ్యలుగా మారాయి. విభజనలో మరింత నమ్మకాన్ని గెలుచుకోవాలన్న ప్రయత్నంలో మోదీ ట్రంప్‌ను మితిమీరిన స్థాయిలో పొగిడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 2019 లో హ్యూస్టన్‌లో జరిగిన "హౌడీ మోదీ" కార్యక్రమంలో మోదీ స్వయంగా ట్రంప్‌కు ఎన్నికల ప్రచార వేదికను ఇచ్చిన స్థాయికి వెళ్లారు. ఇది అంతర్జాతీయ విధానాల్లో ఒక ప్రధాన దేశాధినేత తగిన స్థాయిని మరిచే ధోరణిగా విమర్శల పాలైంది. అమెరికా అధ్యక్షుడిగా గెలుపొందిన ట్రంప్, ఆ సాన్నిహిత్యాన్ని సరైన ప్రామాణికతగా భావించలేదు. గాని అవసరమైన దానిని పూర్తిగా దోచుకున్నాడు. మరోవైపు పాకిస్థాన్‌ను అణచివేయాలన్న భారత ఆశయాలకు వ్యతిరేకంగా ట్రంప్ అప్పుడప్పుడూ పాక్ మద్దతు తెలిపే విధంగా వ్యవహరించడం ప్రారంభించాడు. పాక్ సైనికాధికారి మునీర్‌కు ఆయన ఇచ్చిన ఘనస్వాగతం, మోదీతో సమానంగా చేసిన అభినందనలు ఈ మార్పునకు నిదర్శనంగా మారాయి. అంతేకాదు, భారత్-పాక్ యుద్ధ సందర్భాల్లో తానే మధ్యస్థుడినంటూ చేసిన పదే పదే వ్యాఖ్యలు, భారత పరిపాలనా స్వాతంత్ర్యాన్ని నొప్పించేలా మారాయి. మోదీ ఎవరి చెప్పణ్ణీ వినలేదని ప్రకటించిన కొద్ది గంటల్లో ట్రంప్ తానే యుద్ధం ఆపించానని మరోసారి ప్రకటించడం భారత ప్రధానిని అంతర్జాతీయంగా ఇబ్బంది పెట్టింది. ఈ పరిణామాలన్నింటిలోనూ, ట్రంప్ తీరును నిశితంగా గమనిస్తే, అతను అసలు స్నేహానికి విలువనిచ్చే వ్యక్తి కాదని స్పష్టమవుతుంది. ఆయుధాల కొనుగోలు, చమురు దిగుమతులు వంటి భారీ ఒప్పందాలు చేసినా, అమెరికా తన స్వార్థాన్ని మాత్రమే చూసుకుంటున్నదనే తటస్థ అభిప్రాయం బలపడుతోంది. పాకిస్థాన్‌తో అనుకూల సంబంధాలను స్పష్టంగా ప్రకటించిన ట్రంప్, అదే సమయంలో భారత్‌పై ఆంక్షలు విధించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఇది మిత్రబంధాన్ని ద్రోహంగా మార్చిన నిర్ణయ క్షణంగా చరిత్ర గుర్తుంచుకుంటుంది. మోదీ అయితే, ఈ ద్రోహాన్ని గమనించేందుకు ఆలస్యం చేశారు. అమెరికా మాత్రమే కాదు, అంతర్జాతీయంగా అనేక దేశాలతో భారత్ వ్యాపార, భద్రతా సంబంధాలను గట్టిపరిచే అవసరం ఉంది. ఏకైక అగ్రరాజ్యంతో అత్యధికంగా మమేకమవడం మౌలిక దోషం అని ఇప్పుడు గ్రహించాల్సిన పరిస్థితి. మిత్రులపై ఆధారపడటం కాక, స్వయంపరిపాలనలో దేశాధికారాన్ని నిలుపుకోవడం అవసరం. ఈ క్రమంలో భారత్‌కు ప్రధాన పాఠం సంబంధాలు ఆత్మీయతలతో కాదు, లెక్కలతో, లాభనష్టాల సూత్రంతోనే నిలబడతాయని గ్రహించడం. మోదీ చేసిన నమ్మకం, దేశాన్ని కూడా అదే రైలు మీద తీసుకెళ్లడం, ఇప్పుడు విమర్శల పునాది అయింది. స్వతంత్రంగా ఆలోచించగల, ప్రశ్నించగల నాయకత్వం దేశానికి అవసరం. పరిమితి లేకుండా నాయకుల అహంకారాలను దేశ భవిష్యత్తుపై ప్రయోగంగా మార్చడం దేశ భద్రతకే ముప్పు. పర్యవసానం ఏమిటంటే టంప్‌ను నమ్మి మిత్రంగా భావించిన మోదీ, ఆ స్నేహం బలిపశువుగా మారిన తర్వాతనే అపరాధబోదతో వెనుదిరిగే స్థితిలో ఉన్నారు. అంతవరకూ, అమెరికా తన ప్రయోజనాల కోసం వాడుకున్న వాస్తవాన్ని గుర్తించలేకపోయారు. దేశ మాన్యాన్ని నిలబెట్టాలంటే నాయకులు మితిని తెలిసినవారై ఉండాలి. లేకపోతే వారు స్నేహాల పేరుతో దేశాన్ని దుర్దశలోకి నెట్టే అవకాశమే ఎక్కువ. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వం తన పునరాలోచనలను ప్రారంభించాలి. ట్రంప్‌తో సంబంధాలను వ్యూహాత్మకంగా పునర్మూల్యాంకనం చేయాలి. అంతర్జాతీయ రాజకీయం అనేది మిత్రులు మారే రంగస్థలం. ట్రంప్‌ను నమ్మడం ఒక రాజకీయ తప్పిదంగా చరిత్ర పుస్తకాల్లో నిలిచిపోవచ్చు. దేశ ప్రయోజనాలకే నాయకత్వం కట్టుబడి ఉండాలి. వ్యక్తిగత మైత్రులు ఆ ప్రయోజనాలకు క్షీణతను తేవద్దు. "చెడిన స్నేహం" అనేది కేవలం వ్యక్తుల మధ్య గల విబేధం కాదు అది దేశ విదేశాంగ విధానంలో ఒక మార్గచిహ్నం. ఇప్పుడు ఆ మార్గాన్ని మార్చాల్సిన బాధ్యత కూడా మోదీదే.

# మాతో మాట్లాడండి..ప్లీజ్




మనకు జీవితం ఇచ్చినవారు, బుద్ధి నేర్పినవారు, మనిషిగా తీర్చిదిద్దినవారు మన తల్లిదండ్రులు, తాతముత్తాతలు. కానీ ఈ రోజు అదే వారు తమ చివరి దశలో మౌనంగా, ఒంటరిగా, మాట్లాడే మనిషి కోసం ఎదురుచూస్తూ జీవితం గడుపుతున్నారు. ఒక్కసారి మాట్లాడండి, ఓసారి నవ్వండి, ఓ కబురు చెప్పండి అని అడుగుతున్నా... సమాధానం శూన్యం. ఇది కేవలం ఓ కుటుంబపు కథ కాదు ఇది నేటి భారతీయ సమాజం ఎదుర్కొంటున్న గంభీర సమస్య. మాతో మాట్లాడండి.....ప్లీజ్ .. అనే వృద్ధుల ఆవేదన మన మౌనాన్ని, మన ఉదాసీనతను ప్రశ్నిస్తోంది. భారతదేశం వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతున్న దేశాల్లో ఒకటిగా నిలుస్తోంది. ఎల్డర్లీ ఇన్ ఇండియా 2021 నివేదిక ప్రకారం, 2021లో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధుల సంఖ్య సుమారు 13.8 కోట్లు (మొత్తం జనాభాలో 10.1%), 2031 నాటికి ఈ సంఖ్య 19.4 కోట్లకు చేరే అవకాశం ఉంది, అంటే జనాభాలో 13.5-14% వృద్ధులు ఉంటారు. ఈ గణాంకం భవిష్యత్తులో వృద్ధుల సంక్షేమంపై లోతైన చర్చ అవసరమని సూచిస్తుంది. కానీ ఈ వృద్ధుల శారీరక అవసరాల కంటే మానసిక అవసరాలే ప్రధానమైనవి. వారిలో చాలామందికి ఆహారం, మందులు, పింఛను ఉండవచ్చు, కానీ ఒక్క మాట చెప్పే సహృదయుడు, ఒక్కసారి పలకరించే వ్యక్తి లేకపోవడమే నిజమైన బాధ. ఒంటరితనమే ఈ శతాబ్దపు దుర్భాగ్యంగా మారింది. ముఖ్యంగా వృద్ధులు దానికి బలైపోతున్నారు. హెల్ప్‌ఏజ్ ఇండియా సంస్థ 2023లో దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనంలో, సుమారు 65% వృద్ధులు తమతో మాట్లాడే వారు లేరని, 50% మంది వారానికి ఒకసారి కంటే తక్కువ సమయం తమ పిల్లలతో సంభాషించే అవకాశం ఉందని, 70% మంది ఒంటరితనం వల్ల మానసిక బాధను అనుభవిస్తున్నట్లు తెలిపారు. మానసిక ఒత్తిడితో పాటు అల్జీమర్స్, డిమెన్షియా, డిప్రెషన్



వంటి మానసిక సమస్యలు ఈ వయసులో అధికంగా కనిపిస్తున్నాయి. డబ్ల్యూహెచ్‌ఓ 2022 నివేదిక ప్రకారం వృద్ధుల్లో 1/5వ వంతు మానసిక రుగ్మతలకు గురవుతున్నారని స్పష్టం చేసింది. ఒంటరితనం వృద్ధులలో ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తుంది. డిమెన్షియా వంటి మెదడు వ్యాధులకు ఒంటరితనం ఒక ప్రధాన కారణమని ది లాన్సెట్ వంటి ప్రముఖ వైద్య జర్నల్స్ నిర్ధారిస్తున్నాయి. 75 ఏళ్లు పైబడిన వృద్ధులలో సుమారు 30%-40% మంది డిప్రెషన్ లక్షణాలను చూపిస్తున్నట్లు లాంగిట్యూడినల్ ఏజింగ్ స్టడీ ఇన్ ఇండియా (లాసీ) అధ్యయనాలు సూచిస్తున్నాయి. శారీరకంగా దుర్బలత, రోగ నిరోధక శక్తి లోపం, నిద్రలేమి, రక్తపోటు, మానసిక స్థితి దిగజారటం వంటి సమస్యలు పెరిగిపోతున్నాయి. ఎప్పుడూ మాట్లాడే వారితో లేకుండా ఉండటం, అనవసరంగా తాము భారంగా మారుతున్నామన్న భావన వృద్ధుల్లో మనోవేదనను పెంచుతోంది. ఇవన్నీ వినడం వరకు మనకు ఓహ్ అనిపించొచ్చు. కానీ నిజ జీవితంలో వాటి ప్రభావం ఎన్నో కుటుంబాలను కూల్చేస్తోంది. ఒకప్పుడు వారి చేతుల్లో మన బాల్యం నడిచింది. ఈ రోజు వారు మనకు అజ్ఞాతులయ్యారు. వారి మాటలు మనకు భారం అయ్యాయి. వారిని వృద్ధాశ్రమాలకు పంపించడమే పరిష్కారమైపోయింది. 2022 నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం, వృద్ధులపై నిర్లక్ష్యపు హింసాత్మక సంఘటనలు గత ఐదేళ్లలో గణనీయంగా, సుమారు 25%-%30% పెరిగాయి. అనేక సందర్భాల్లో తమ పిల్లల చేతే వృద్ధులు లౌకికంగా, ఆర్థికంగా, భావోద్వేగంగా వేధింపులకు గురవుతున్నారు. ఇది కుటుంబం నుంచి నైతికత, మానవీయత తగ్గిపోయిన స్థితిని సూచిస్తుంది. సాంప్రదాయ భారతీయ కుటుంబ వ్యవస్థను పరిశీలిస్తే, మూడు తరాలు ఒకే నీడలో జీవించే వ్యవస్థగా కనిపించేది. అప్పుడు వృద్ధులు కుటుంబానికి సారథులుగా, మార్గదర్శకులుగా వ్యవహరించేవారు. వారి అనుభవం, జ్ఞానం కుటుంబానికి బలమైన పునాది. కానీ నేటి పరిమిత కుటుంబాల్లో తల్లిదండ్రులకు తగిన స్థానం లేకుండా పోతోంది. నగరాలకు వలస వెళ్లిన పిల్లలు, అస్తవ్యస్తమైన జీవనశైలి, డిజిటల్ ప్రపంచంలో మునిగిపోయిన మనవళ్లు ఈ తరాల మధ్య కలయికను చెదిరిపోయేలా చేశాయి. ఫలితంగా, వృద్ధులు గదిలో ఉన్నా మాట్లాడేవారు లేరు. చేతిలో ఫోన్, కళ్ళెదుట టీవీ, నోట్లో మౌనం ఇదే నేటి వృద్ధుని అనుభవిస్తున్న నిస్సహాయ స్థితి. మాతో మాట్లాడండి.....ప్లీజ్ అని అడిగే వీరి వేదన ఎంతటి మానవతా సంక్షోభానికి సంకేతమో ఆలోచించాలి. ప్రభుత్వాలు వృద్ధుల కోసం పలు పథకాలను ప్రకటిస్తున్నా అవి నామమాత్రంగా మారాయి. బస్సుపాస్‌లు, పింఛన్లు, ఆరోగ్య బీమా వంటి వాణిజ్య సౌకర్యాలకంటే పెద్దగా మానవీయత అవసరం. వృద్ధులకు మానసిక ఆరోగ్య శిబిరాలు, నెరోసైకాలజీ సేవలు, సామాజిక సంబంధ బలపర్చే వాలంటీర్ వ్యవస్థలు ఏర్పడాలి. ప్రతి మండలంలో ఓ వృద్ధుల మానసిక ఆరోగ్య కేంద్రం, గ్రామ స్థాయిలో పునర్వాస సేవలు వంటి కార్యక్రమాలు ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ ఇవన్నీ కేవలం విధానాలుగా కాకుండా... మనస్సుతో నడవాలి. ఇతర దేశాలు ఈ విషయంలో మనకు గొప్ప ఉదాహరణలు. జపాన్‌లో వృద్ధుల కోసం ఇకిగాయ్ అనే జీవన విధానానికి అనుగుణంగా, వారిని చురుకుగా ఉంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంగ్లాండ్‌లో కెంపెయిన్ టు ఎండ్ లోనిలినెస్ అనే కార్యక్రమం వృద్ధుల ఒంటరితనాన్ని నివారించేందుకు వాలంటీర్లను నియమిస్తుంది. ప్రతి వారంలో కనీసం రెండు సార్లు వారిని కలవడం తప్పనిసరి చేస్తుంది. మన దేశంలో కూడా ఈ విధమైన సానుభూతి చూపే కార్యక్రమాలు అవసరం. వృద్ధులకు డబ్బు అవసరం లేదు. వారికావలసింది మాట్లాడే మనిషి మాత్రమే. తమ జీవితానుభవాలను చెప్పడానికి, ఎవరో ఒకరు శ్రద్ధగా వినాలి అనే ఆశ మాత్రమే. ఒక్కసారి వాళ్లతో కూర్చొని మాట్లాడితే, వాళ్లు ఎంత ఆనందపడతారో చెప్పలేం. మనం ఓ చిన్న నవ్వు నవ్వితే, వాళ్ల ముఖంలో పెద్ద చిరునవ్వు కనిపిస్తుంది. మనం పిలిస్తే, చిన్నపిల్లల్లా మురిసిపోతారు. వారికి మన సమయం, మన ప్రేమ అవసరం. ఆ ఆప్యాయత వారికి ఒక అమూల్యమైన ఔషధం. దానికి ఎలాంటి ధర లేదు... అయినప్పటికీ, మనం ఇచ్చే ఆ ప్రేమ వారికి మరచిపోలేని అపారమైన ఆనందాన్ని అందిస్తుంది. వారిని దూరంగా ఉంచకండి... సన్నిహితంగా చేరండి. ఎందుకంటే వారు మనకు గతాన్ని గుర్తు చేస్తారు, జీవిత పాఠాలను నేర్పిస్తారు. మన ప్రేమలో వారి జీవితం కాంతివంతంగా ప్రకాశిస్తుంది. నిజానికి, వృద్ధులు మాటలు ఎక్కువగా కోరరు. కానీ వారు మాట్లాడే ఒక్క మాట మన జీవితాన్ని మారుస్తుంది. మనం వారితో గడిపే ఒక్క క్షణం వారికి జీవితాంతం గుర్తుండిపోతుంది. వారు కోరేదొకటే.. తాము ఈ ప్రపంచంలో తేలిపోయిన జ్ఞాపకంగా కాకుండా, గుర్తుండిపోయిన సంబంధమవ్వాలన్న నిశ్శబ్ద కోరిక మాత్రమే. మనమూ ఓ రోజు వృద్ధులం అవుతాం. అప్పట్లో మనతో ఎవరైనా కాసేపు కూర్చొని మాట్లాడాలని మనకూ ఎంతో ఆకాంక్ష కలుగుతుంది. అప్పుడు మనకూ ఈ మౌనమైన ప్రేమ, ఆప్యాయత విలువ ఎంత ఎక్కువో నిజంగా అర్థమవుతుంది, వాళ్ల మౌనం మనం విని మారాలి.. లేదంటే, రేపు మన మౌనం కూడా ఎవరికీ వినిపించదు.

**మహమ్మద్ అక్బర్**
**జర్నలిస్ట్, నవభూమి దినపత్రిక**
**మహబూబాబాద్‌జి**


# ఏదైనా మన మంచికే



"ఏదైనా మన మంచికే" అనే సూక్తి కేవలం ఒక ఆశావాద వాక్యం కాదుబీ ఇది మానవ మనస్తత్వం, జీవిత పాఠాలను అర్థం చేసుకునే విధానంపై ఆధారపడిన ఒక సంక్లిష్ట తాత్విక దృక్పథం. ఇది ఉపరితలంపై సరళంగా కనిపించినప్పటికీ, దీని వెనుక లోతైన మనోవైజ్ఞానిక, ఆధ్యాత్మిక, సామాజిక కోణాలు దాగి ఉన్నాయి.

**1. తాత్విక పునాదులు ఆశావాదం:**
ఆశావాదానికి మూలస్తంభం లాంటిది. ఇది జీవితంలో సంభవించే ప్రతి సంఘటన, అది మంచిదైనా చెడుదైనా, చివరికి మనకు మేలు చేస్తుందని లేదా ఒక విలువైన పాఠాన్ని నేర్పుతుందని నమ్ముతుంది. నియంత్రణ అంగీకారం: మన నియంత్రణలో లేని విషయాలపై బాధపడకుండా, వాటిని అంగీకరించే వైఖరిని ప్రోత్సహిస్తుంది. స్టోయిసిజం వంటి ప్రాచీన తత్వశాస్త్రాలు కూడా ఇదే భావనను ప్రతిబింబిస్తాయి. మనకు జరిగిన వాటిని మార్చలేము. కానీ వాటికి మనం ఎలా ప్రతిస్పందిస్తామనేది మన చేతుల్లో ఉంటుంది. అంతిమ ప్రయోజనం: ఇది బాధను విస్మరించమని చెప్పదు. బదులుగా దీర్ఘకాలికంగా ఆ సంఘటన నుండి ఏదో ఒక ప్రయోజనం లభిస్తుందని చెబుతుంది. ఇది వ్యక్తిగత ఎదుగుదల కావచ్చు, కొత్త అవకాశాలు కావచ్చు, లేదా ఒక కొత్త దృక్కోణం కావచ్చు అని తెలియజేస్తుంది. ఇది "ఒక తలుపు మూసుకుంటే, ఇంకో తలుపు తెరుచుకుంటుంది" అనే భావనకు దగ్గరగా ఉంటుంది.

**2. మానసిక భావోద్వేగ ప్రభావాలు:**
దీనిని నమ్మడం వల్ల మన మానసిక ఆరోగ్యంపై గణనీయమైన సానుకూల ప్రభావాలు ఉంటాయి. మానసిక స్థితిస్థాపకత: కష్టాలను తట్టుకుని నిలబడటానికి, వాటి నుండి కోలుకోవడానికి ఈ భావన సహాయపడుతుంది. ఒక వైఫల్యం తర్వాత కుంగిపోకుండా, అది ఒక పాఠం లేదా ప్రగతికి సోపానం అని భావించడం ద్వారా, వ్యక్తి మరింత దృఢంగా మారతాడు. తగ్గిన ఒత్తిడి, ఆందోళన: భవిష్యత్తు గురించి లేదా జరిగిన వాటి గురించి ఎక్కువగా ఆందోళన చెందకుండా, "అంతా మంచి జరుగుతుంది" అనే నమ్మకం



ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుంది. ఇది వర్తమాన క్షణంపై దృష్టి పెట్టడానికి సహాయపడుతుంది. బాధను అర్థం చేసుకోవడం: నష్టం లేదా వైఫల్యం బాధను తక్కువ చేయదు, కానీ ఆ బాధకు ఒక అర్థాన్ని, ఒక ప్రయోజనాన్ని ఆపాదించడానికి సహాయపడుతుంది. "ఈ బాధ నన్ను బలపరుస్తుంది" లేదా "దీని నుండి నేను నేర్చుకోవాలి" అనే ఆలోచన బాధను తట్టుకోవడాన్ని సులభతరం చేస్తుంది. కృతజ్ఞతా భావం: కొన్నిసార్లు, ఒక చెడు సంఘటన జరిగిన తర్వాత, మనం ఇంతకు ముందు పట్టించుకోని విషయాలపై కృతజ్ఞతా భావాన్ని పెంపొందించవచ్చు. ఉదాహరణకు, అనారోగ్యం తర్వాత ఆరోగ్యం విలువ తెలుసుకోవడం.

**3. ప్రవర్తనాత్మక , కార్యాచరణ ప్రభావాలు:**
కేవలం ఆలోచన స్థాయిలోనే కాకుండా, ఈ సూక్తి మన ప్రవర్తనను, మనం తీసుకునే నిర్ణయాలను కూడా ప్రభావితం చేస్తుంది.
సమస్య-పరిష్కార వైఖరి: ప్రతికూల పరిస్థితిని ఒక సమస్యగా కాకుండా, ఒక సవాలుగా లేదా పరిష్కరించాల్సిన పజిల్‌గా చూసేలా ప్రోత్సహిస్తుంది. ఇది నిస్సహాయత భావనను తగ్గించి, చురుకైన పరిష్కార మార్గాలను అన్వేషించడానికి దారితీస్తుంది.
**వినూత్న ఆలోచన :** కొన్నిసార్లు ఒక ప్రణాళిక విఫలమైనప్పుడు, అది మనల్ని కొత్త, వినూత్నమైన ఆలోచనలు చేయడానికి ప్రేరేపిస్తుంది. "ప్రయత్నించి విఫలమవడమే ఉత్తమ మార్గం, ఎందుకంటే అది మీకు కొత్త మార్గాలను చూపిస్తుంది" అనే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది.
పరిస్థితులకు అనుగుణంగా మారడం: జీవితం నిరంతరం మారుతూ ఉంటుంది. "ఏదైనా మన మంచికే" అనే భావన మనల్ని మార్పులకు మరింత సులభంగా అనుగుణంగా మారేలా చేస్తుంది, ఎందుకంటే మనం ఆ మార్పుల వెనుక ఒక ప్రయోజనం ఉంటుందని విశ్వసిస్తాం.

**4. పరిమితులు, అపోహలు:**
ఈ సూక్తి శక్తివంతమైనదైనప్పటికీ, దానిని గుడ్డిగా అనుసరించడం కొన్నిసార్లు తప్పుదారి పట్టించవచ్చు.
నిష్క్రియాత్మకతకు దారి తీయకూడదు: "ఏదైనా మన మంచికే" అంటే మనం ఏమీ చేయకుండా కూర్చోవడం లేదా కష్టాల కోసం ఎదురుచూడటం కాదు. ఇది జరిగిన తర్వాత దాని నుండి పాఠం నేర్చుకోవడానికి సంబంధించినది, కానీ నిష్క్రియాత్మకంగా ఉండటానికి కాదు. మనం ఎల్లప్పుడూ మన వంతు కృషి చేయాలి. బాధ్యతారాహిత్యం: ఈ సామెతను మన తప్పులకు లేదా నిర్లక్ష్యానికి సాకుగా ఉపయోగించకూడదు. మన చర్యలకు మనం బాధ్యత వహించాలి. వాటి పర్యవసానాలను అంగీకరించాలి. అతిగా సరళీకరించడం: కొన్ని తీవ్రమైన దురదృష్టాలు లేదా విషాద సంఘటనలను "మంచికే" అని సరళీకరించడం బాధిత వ్యక్తికి అగౌరవంగా అనిపించవచ్చు. ప్రతీ సందర్భంలోనూ తక్షణమే సానుకూలతను చూడలేకపోవచ్చు. కొన్నింటిని జీర్ణించుకోవడానికి సమయం పడుతుంది. "ఏదైనా మన మంచికే" అనేది జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సానుకూల దృక్పథంతో స్వీకరించడానికి, వాటి నుండి పాఠాలు నేర్చుకోవడానికి, మానసిక స్థితిస్థాపకతను పెంపొందించుకోవడానికి ఒక శక్తివంతమైన సాధనం. ఇది ఒక అంతర్గత శక్తిని, ఆశావాదాన్ని నింపుతుంది. అయితే, ఈ సూక్తిని సరైన సందర్భంలో, బాధ్యతాయుతంగా అర్థం చేసుకోవడం ముఖ్యం. ఇది నిష్క్రియాత్మకతకు లేదా బాధ్యతారాహిత్యానికి దారి తీయకూడదు, బదులుగా ప్రతికూలతలను ప్రగతికి సోపానాలుగా మార్చుకునే స్ఫూర్తిని అందించాలి.

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

## హ్యాపీ ఫ్రెండ్షిప్ డే

బడి ప్రాంగణం అంతా మిత్రులే,
గులాబీ బుగ్గలతో
సిగ్గుగా నవ్విన ముఖాలే.

కలసి ఆడిన ఆటలు...
ఒకరు గెలిచారంటే అందరికీ
సంతోషమే,
ఒకరు ఓడినా
ఎవరో గెలిచినట్లు ఆనందమే!

ఒకరి బాక్సులో నచ్చిన
పులిహోర,
ఇంకొకరి దగ్గర ఆవకాయ,
తినే కంటే చూపులతో అడిగే
ఆహ్వానం ఇంకా నాకు గుర్తే

మన మతాలు వేరైనా,
ఆరాధన మాత్రం ఒకటే
ఏ పండుగ వచ్చినా మొదట
గుర్తొచ్చేది నువ్వే మిత్రమా
మొదటి శుభాకాంక్ష నీకే

మనం జామ ఆకులో తిన్న
చింతపండు,
తోటలోని మామిడి పండు
వనభోజనానికి వచ్చి ఆడిన
ఉయ్యాల సయ్యాటలు
ఇంకా కనుల ముందే


ఇప్పుడు మనం వేరు వేరు
నగరాల్లో,
వేరు వేరు జీవితాల్లో ఉన్నా
మన హృదయం మాత్రం
ఒక్కటే...
ఒకే ఆటలో చప్పట్లు విన్న
బాహుబలిగా,
ఒకే ఆటలో ఓడినప్పుడు
కలిసి ఏడ్చిన స్నేహంగా.

బాల్యం పోయింది...
కానీ, నీవు మాత్రం
నేను కాటికి పోయేవరకు నా
మనసులో వుంటావు మిత్రమా
హ్యాపీ ఫ్రెండ్షిప్ డే మిత్రమా..!


-షహనాజ్

## గోశాలుడి పశ్చాత్తాపం

భక్తి



జైన మతానికి చెందిన తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడు. ఆయనకు ఎందరో శిష్యులు ఉండేవారు. వారిలో మక?లి గోశాలుడు ఒకరు. అతను చాలా తెలివైనవాడు. చక్కని మాటకారి. తాను కూడా మహావీరుడిలాంటి తీర్థంకరుడిగా గుర్తింపు పొందాలన్న దురాశ అతనికి కలిగింది. దానికోసం... మహావీరుడు చెబుతున్నవన్నీ తప్పని చాటడానికి ఎన్నో కుట్రలు పన్నాడు. క్రమంగా మహావీరుడు చెప్పే ప్రతిదాన్నీ ప్రత్యక్షంగానే ఖండించడం మొదలుపెట్టాడు. ఒకసారి మహావీరుడు ఏడు రకాల నరకాల గురించి వివరిస్తున్నాడు. అప్పుడు గోశాలుడు "కాదు, మహావీరుడికి ఏమీ తెలియదు. నిజానికి ఏడు వందల నరకాలు ఉన్నాయి" అన్నాడు. ఇలా తన వాక్చాతుర్యంతో తెలిసినవి, తెలియనివి ఎన్నో చెప్పి... మహావీరుడి శిష్యులలో ఎంతోమందిని గోశాలుడు ఆకర్షించాడు. మహావీరుడి నుంచి వేరుపడి... తనదైన ఒక శాఖను స్థాపించాడు. వాక్చాతుర్యం ఉన్న వ్యక్తి తన మేధాశక్తిని ఉపయోగించి ఏదైనా చెబితే... దాన్ని నమ్మడానికి వేలమంది ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. కేవలం నమ్మడమే కాదు... అతనికి సర్వస్వాన్ని సమర్పించే శిష్యులుగా, భక్తులుగా మారుతారు. అతణ్ణి అనుసరిస్తారు. క్రమంగా అతను కొత్త మతాన్నో, ఉన్న మతంలోని ఒక శాఖనో ఏర్పాటు చేస్తాడు. మక?లి గోశాలుడు చేసిది కూడా అదే! ఒకసారి గోశాలుడు ఉంటున్న గ్రామానికి మహావీరుడు వచ్చాడు. గోశాలుడు ప్రచారం చేస్తున్న తప్పుడు సిద్ధాంతాలను గురించి చర్చించి, హెచ్చరించడం కోసం అతణ్ణి కలుసుకున్నాడు. "ఒకప్పుడు నీవు నా శిష్యుడివి కాబట్టి, ప్రేమతో నిన్ను సరైన మార్గంలో పెట్టడానికి వచ్చాను" అన్నాడు మహావీరుడు. "నీకు శిష్యుడిగా ఉన్న ఆ వ్యక్తి ఎప్పుడో మరణించాడు. ఇప్పుడు ఈ శరీరంలో ఉన్నది ఒక తీర్థంకరుడు" అని గర్వంగా చెప్పాడు గోశాలుడు. మహావీరుడు అక్కడి నుంచి నిష్క్రమించాడు. కొంతకాలం గడిచింది. గోశాలుడిలో క్రమక్రమంగా ఆత్మ పరిశీలన ప్రారంభమయింది. తను ఒక అజ్ఞాని, ఏదీ తెలియకపోయినా తెలిసినట్టు నటించే వంచకుడినని అతనికి తెలిసివచ్చింది. హృదయం బరువెక్కింది. పశ్చాత్తాపం కలిగింది. తన శిష్యులను పిలిచాడు. "నేను ఇంతవరకూ బోధించినదంతా అసత్యమే. నేను మరణించాక... నా శరీరాన్ని నడి వీధుల వెంట లాక్కొని వెళ్ళండి. వీడొక నయవంచకుడని ప్రకటించండి. నా శరీరం మీద ఉమ్మెయ్యమనండి" అని చెప్పాడు. ఆ తరువాత... మారిన మనిషిగా, అహంకారం లేకుండా జీవించాడు.



## డబ్బు చెల్లించినా వదలని లోన్ యాప్.. మహిళ ఫొటోను మార్ఫింగ్ చేసి..



ముంబయి-నవభూమి:తక్షణ రుణాల పేరిట లోన్ యాప్ నిర్వాహకులు చేస్తున్న అరాచకాలు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. డబ్బు చెల్లించినా ఇవ్వలేదంటూ రుణగ్రహీతలపై తీవ్ర ఒత్తిడి చేయడం, మార్ఫింగ్ ఫొటోలతో ఇబ్బంది పెట్టడం లాంటివి చేస్తున్నారు. తాజాగా ముంబయిలోని ఓ మహిళకు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి నగ్న చిత్రాలను.. రెప్పపాటులోనే రుణాలు అందిస్తామని జనాలను ఆకర్షిస్తారు. ఆపై రుణం కట్టినా.. ఆలస్యమైనా వేధింపులకు దిగుతారు. ఒకవక్క అధిక వడ్డీల మోత మోగిస్తూనే.. మరోపక్క రుణగ్రహీతలపై బెదిరింపులకు దిగుతారు. వ్యక్తిగత డేటాను తస్కరించి ఫొటోలను మార్ఫింగ్ చేసి మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తారు. బాధితుడు బయటకు చెప్పుకోలేని పరిస్థితులను సృష్టిస్తారు. లోన్ యాప్ వేధింపులు తాళలేక ఇటీవల బలవన్మరణాలకు పాల్పడినవారు ఎందరో. తాజాగా ముంబయిలోని ఓ మహిళ పట్ల ఓ లోన్ యాప్ దారుణంగా వ్యవహరించింది. డబ్బులు కట్టినా కట్టలేదంటూ.. ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి నగ్న చిత్రాలను విడుదల చేసి బెదిరింపులకు దిగింది. లోన్ యాప్ నిర్వాహకుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జోగేశ్వరి వెస్ట్‌లోని క్రాంతి నగర్ కు చెందిన 25 ఏళ్ల బాధితురాలు ఇన్‌స్టాగ్రామ్‌లో 'క్యాష్ లోన్' అనే మొబైల్ యాప్ ప్రకటన చూసింది. డబ్బు అవసరం ఉండటంతో జూలై 20న, ఆమె యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంది. తన వ్యక్తిగత సమాచారం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వివరాలను నమోదు చేసింది.

## బాధితురాలిని నడిరోడ్డుపై కాల్చిన అత్యాచార నిందితుడు..

### బెయిల్ మీద బయటకొచ్చి మరీ..!



న్యూఢిల్లీ-నవభూమి: దేశ రాజధాని ఢిల్లీలో జరి గిన ఒక దారుణ సంఘ టన న్యాయ వ్యవస్థపై, మహిళల భద్రతపై తీవ్ర ప్రశ్నలను లేవనెత్తుతోంది. తనపై అత్యాచారం చేసిన వ్యక్తిపై కేసు పెట్టిన ఓ యువతిని.. ఆ నిందితుడు బెయిల్‌పై బయటకు వచ్చి మరీ కాల్చి చంపేందుకు ప్రయత్నించిన ఘటన కలకలం సృష్టించింది. ఢిల్లీలోని వసంత విహార్ ప్రాంతంలో ఈ దారుణం చోటుచేసుకుంది. ఈ సంఘటన తర్వాత పోలీసులు నిందితుడిని వేగంగా అరెస్టు చేయడంతో బాధితురాలి కుటుంబానికి కొంత ఊరట లభించినప్పటికీ.. భద్రతా లోపాలపై ఆందోళన మాత్రం ఇంకా కొనసాగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. అబుజైర్ సాఫీ అనే వ్యక్తి తనపై అత్యాచారం చేశాడని బాధితురాలు గతంలో కేసు పెట్టింది. ఈ కేసులో జైలుకు వెళ్లిన నిందితుడు ఇటీవలే బెయిల్‌పై విడుదల అయ్యాడు. బెయిల్ మీద బయటకు వచ్చినప్పటి నుంచి అతను బాధితురాలిని వేధించడం, ఆమెను వెంటపడటం వంటివి చేస్తున్నాడు. ఈ వేధింపులు శ్రుతి మించడంతో బాధితురాలు మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేయాలని అనుకుంది. అయితే ఈ లోపే నిందితుడు దారుణానికి ఒడిగట్టాడు. ఆమె రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండడం చూసి వెంటనే ఆమె వద్దకు వెళ్లాడు. అక్కడే ముందుగా మాట్లాడేందుకు ప్రయత్నించిన అతడు.. ఆమెపై తుపాకీతో కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో బాధితురాలికి ఛాతీ భాగంలో బుల్లెట్ తగిలింది. తీవ్ర గాయం కాగా.. నిందితుడు భయపడి అక్కడి నుంచి పారిపోయాడు. విషయం గుర్తించిన స్థానికులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. మరోవైపు పోలీసులకు కూడా సమాచారం అందించగా.. హుటాహుటిన రంగంలోకి దిగారు. అసలేమైందని ఆరా తీయగా.. అబుజైర్ సాఫీయే తనపై కాల్పులు జరిపాడని బాధితురాలు పేర్కొంది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. కొన్ని గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. ప్రస్తుతం అతడు జైల్లో ఉండగా.. బాధితురాలు మాత్రం తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయితే ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు చెబుతున్నారు. కానీ అత్యాచారం చేసి జైలు పాలైన ఓ నిందితుడు.. బెయిల్ మీద బయటకు వచ్చి మరీ చంపాలనుకోవడం, నడిరోడ్డు మీదే కాల్పులు జరిపి అందుకు ప్రయత్నించడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలికి సరైన భద్రత కల్పించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయిందనే విమర్శిస్తున్నారు. నిందితుడిని అరెస్టు చేసినప్పటికీ.. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై, ప్రభుత్వాలపై ఉందని సామాజిక కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు.

## పల్టీలు కొడుతూ.. 300 మీటర్ల లోయలో పడిపోయిన జేసీబీ..



సిమ్లా-నవభూమి: హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో ఘోర ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడటంతో రోడ్డు పనులు చేస్తున్న ఓ జేసీబీ.. పల్టీలు కొడుతూ దాదాపు 300 మీటర్ల లోతు గల లోయలో పడిపోయింది. సిమ్లా జిల్లాలోని జాబ్లీలో ఐదో నంబర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, ఈ ఘటనలో గాయపడిన జేసీబీ డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ప్రమాదంలో రోడ్డు ధ్వంసం కావడంతో ఎన్‌హెచ్ 5పై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో రోడ్డు పునరుద్ధరణ పనులను వేగంగా మొదలుపెట్టి.. ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు.

## మూడో రోజుకు చేరిన ఆపరేషన్ అఖల్.. ఆరుగురు ఉగ్రవాదులు హతం



శ్రీనగర్-నవభూమి: జమ్ము కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉగ్రవాదుల అంతుచూసేందుకునే భద్రతా దళాలు చేపట్టిన ఆపరేషన్ అఖల్ మూడో రోజుకు చేరింది. ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ఆరుగురు ముష్కరులు హతమయ్యారు. ఓ జవాన్ గాయపడ్డారు. ఆపరేషన్ అఖల్ శుక్రవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. కుల్గాం జిల్లాలోని అఖల్ అటవీ ప్రాంతంలో టెర్రరిస్టులు ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు ఆగస్టు 1న గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య శనివారం రోజంతా కాల్పులు కొనసాగాయి. ఈ సందర్భంగా ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. మరోవైపు ముష్కరుల కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్ గాయపడ్డారు. మృతులు ఉగ్రవాదులు నిషేధిత లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌కు చెందినవారని అధికారులు తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడికి టీఆర్‌ఎఫ్ బాధ్యత వహించిన విషయం తెలిసిందే. ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది పర్యాటకులు మరణించారు.

## వరదల తాకిడికి వారణాసి-ప్రయాగ్‌రాజ్ అతలాకుతలం.. అఖిలేష్ యాదవ్ ఆగ్రహం

ప్రయాగ్‌రాజ్-నవభూమి:ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. ముఖ్యంగా పవిత్ర నగరాలైన వారణాసి, ప్రయాగ్‌రాజ్ వరదల తీవ్రతకు చిగురుటాకుల్లా వణుకుతున్నాయి. గంగా, యమునా నదులు ఉప్పొంగి పొర్లుతూ తీరప్రాంతాల్లోని జనజీవితాన్ని ముంచెత్తుతున్నాయి. రహదారులు జలమయమై, ఇళ్లలోకి నీరు ప్రవేశించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రక్షణ బృందాలు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పునరావాస పనుల్లో నిమగ్నమవుతున్నారు. నదుల ఉద్ధృతి తగ్గకపోతే పరిస్థితి మరింత విషమించవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు. గంగా ఉగ్రరూపం..వారణాసిలో గంగా నది ప్రమాద స్థాయిని దాటి అనేక ప్రాంతాల్లోకి నీరు చొచ్చుకొచ్చింది.


## మాలేగావ్ బాంబు పేలుళ్లు కాంగ్రెస్ కుట్రనే..: మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ సంచలనం



భోపాల్-నవభూమి: మాలేగావ్ పేలుళ్ల కేసులో నిర్దోషిగా విడుదలైన తర్వాత.. మధ్య ప్రదేశ్‌కు చెందిన మాజీ ఎంపీ, సాధ్వి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ ఆదివారం రోజు భోపాల్‌కు చేరుకున్నారు. ఈక్రమంలోనే ఆమెకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆమె కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తనపై పెట్టిన కేసు కాంగ్రెస్ కుట్ర అని, ఆ పార్టీపై దేశద్రోహం కేసు పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. కోర్టు ఇచ్చిన తీర్పు 'కాషాయ ఉగ్రవాదం' అనే నినాదాన్ని ప్రచారం చేసిన వారికి చెంపపెట్టు అని సాధ్వి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ముస్లింలను సంతృప్తి పరిచే ప్రయత్నం చేసిందని సాధ్వి ఆరోపించారు. 'హిందుత్వ ఉగ్రవాదం' అనే అపవాదుతో కాంగ్రెస్ హిందువులను వేధించిందని, వారిపై తప్పుడు కేసులు బనాయించి జైల్లో పెట్టిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేసిన ఈ చర్యలు దేశద్రోహానికి పాల్పడటమేనని సాధ్వి తీవ్రంగా విమర్శించారు. అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉగ్రవాదానికి మతాన్ని అంటగట్టిందని, అమాయకులను ఇరికించిందని అన్నారు. మాలెగావ్ పేలుళ్ల కేసులో ప్రజ్ఞా ఠాకూర్ తొమ్మిదేళ్ల పాటు జైలులో గడిపారు. ఈ కేసులో ఆమెను నిర్దోషిగా తేల్చడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. అయితే ఆమె తన ఆరోగ్య సమస్యలకు కారణం అప్పటి పోలీసులు చిత్రహింసలేనని ఆరోపించారు. కేసు విచారణ సమయంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్లు చెప్పాలని తనపై ఒత్తిడి తెచ్చారని కూడా ఆరోపించారు. కానీ అవన్నీ అబద్ధాలే కావడం వల్ల తాను ఏమీ చెప్పలేదన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ నాయకులు సృష్టించిన ఈ తప్పుడు కథనం కారణంగా తన జీవితంలో 17 సంవత్సరాలు వృథా అయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు దర్యాప్తు అధికారి అయిన హేమంత్ కర్కరే తన శాపం కారణంగానే చనిపోయారని ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు కూడా వివాదాస్పదం అయ్యాయి. ఆమెకు బీజేపీ లోక్‌సభ టికెట్ నిరాకరించిన తర్వాత కూడా ఆమె తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పానని, కానీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి తన వ్యాఖ్యలు నచ్చలేదని తెలిపినట్లు వార్తలు వచ్చాయి. ఏది ఏమైనా మాలెగావ్ పేలుళ్ల కేసులో నిర్దోషిగా బయటపడిన తర్వాత ఆమెకు భోపాల్‌లో లభించిన స్వాగతం, ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా మరోసారి చర్చకు దారితీశాయి. హిందుత్వం విజయం సాధించిందని, అబద్ధాలు ప్రచారం చేసినవారికి సరైన సమాధానం లభించిందని ఆమె అభిమానులు పేర్కొన్నారు.

# తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరు?

## శశిథరూర్ సమాధానం ఇదే..!



న్యూఢిల్లీ-నవభూమి: కాంగ్రెస్ నాయకుడు, ఎంపీ శశి థరూర్ ఈ మధ్య బీజేపీ నేతలు, ఆ ప్రభుత్వంతో ఎక్కువగా తిరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. అలాగే ఆయన ఎక్కువగా ఈ సర్కారుకే మద్దతు తెలుపుతుండగా.. ఆయన త్వరలోనే పార్టీ మారతారంటూ పెద్ద ఎత్తునే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అదేమీ లేదని ఆయన చెబుతున్నా.. ఎవరూ ఆ మాటలు నమ్మడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆయన్ను.. మీడియా ప్రతినిధులు ఓ ప్రశ్న అడిగారు. ముఖ్యంగా భారతదేశ తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరు అవుతారని ప్రశ్నించారు. ఇందుకు శశిథరూర్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. మరి ఆయన ఏం చెప్పారో మనం ఇప్పుడు తెలుసుకుందామా. ముంబైలో తన తాజా పుస్తకం 'అవర్ లివింగ్ కాన్స్టిట్యూషన్' ఆవిష్కరణ సందర్భంగా శశిథరూర్‌కు ఈ ప్రశ్న ఎదురైంది. ఈక్రమంలోనే ఆయన మాట్లాడుతూ.. తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరు అవుతారో నాకు తెలియదని చెప్పారు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పగలనంటూ.. అధికార పార్టీ నుంచే నామినీ ఉంటారని వివరించారు. అక్కడితో ఆగకుండా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పార్లమెంటులోని రెండు సభల సభ్యులు మాత్రమే ఓటు వేస్తారని.. రాష్ట్ర శాసనసభ సభ్యులకు ఓటు హక్కు ఉండదని ఆయన గుర్తు చేశారు. కాబట్టి ప్రస్తుత పార్లమెంటు కూర్పును బట్టి చూస్తే.. అధికార పార్టీకి మెజారిటీ ఉండటం వల్ల వారి అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని ఆయన విశ్లేషించారు. అదే సమయంలో థరూర్ తన సమాధానంలో ప్రతిపక్షాల పాత్రను కూడా ప్రస్తావించారు. తదుపరి ఉపరాష్ట్రపతి ఎంపిక విషయంలో అధికార పార్టీ ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరుపుతుందని తాము ఆశిస్తున్నట్లు వివరించారు. కానీ ఈ విషయాన్ని నేరుగా వారికి ఎవరు చెప్పగలరంటూ వ్యాఖ్యానించారు. ఇలాంటి కీలక పదవుల ఎంపికలో అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిదని ఆయన నొక్కిచెప్పారు. దీంతో దేశ రాజకీయాల్లో పెద్ద చర్చే మొదలైంది. ముఖ్యంగా ఉపరాష్ట్రపతి ఎన్నిక గురించి బీజేపీ ఆయనకు చెప్పాలని భావిస్తున్నారేమో అంటూ పలువురు కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇప్పటి వరకు ఉపరాష్ట్రపతిగా పని చేసిన జగదీప్ ధన?డ్ ఇటీవల అనారోగ్య కారణాలతో రాజీనామా చేయడంతో ఈ పదవి ఖాళీ అయింది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం.. ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇటీవలే విడుదల చేసింది. ఆగస్టు 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుండగా.. నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి తేదీ ఆగస్టు 21గా తెలిపారు. అలాగే నామినేషన్ల పరిశీలన తర్వాత అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి ఆగస్టు 24వ తేదీ వరకు గడువు ఉంటుందని వివరించారు. ఇక సెప్టెంబర్ 9న పోలింగ్, ఓట్ల లెక్కింపు ఉండనున్నాయి. అదే రోజు అంటే ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తర్వాత ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

## అమ్మాయిలూ పార్టీలకు వెళ్లకండి, అత్యాచారం జరుగుతుంది..

### ట్రాఫిక్ పోలీసుల పోస్టర్లు వైరల్




అహ్మదాబాద్-నవభూమి:మహిళల భద్రతకు సంబంధించిన ఒక వివాదాస్పద పోస్టర్ ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలో తీవ్ర దుమారాన్ని రేపింది. 'లేట్ నైట్ పార్టీలకు వెళ్లడం వల్ల అత్యాచారం లేదా గ్యాంగ్ రేప్‌కు గురయ్యే అవకాశం ఉంది' అంటూ అహ్మదాబాద్ నగరంలో కొన్ని పోస్టర్లు దర్శనం ఇచ్చాయి. ఈ పోస్టర్ల వెనుక అహ్మదాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు ఉన్నారని వార్తలు రావడంతో ప్రతిపక్షాలు, మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో వివాదాస్పద పోస్టర్లను అధికారులు హుటాహుటిన తొలగించారు. అంతేకాకుండా మరికొన్ని పోస్టర్లలో నిర్జన ప్రాంతాలకు మీ స్నేహితునితో కలిసి వెళ్లకండి.. అలా వెళ్తే అత్యాచారం లేదా గ్యాంగ్ రేప్ జరిగితే అంటూ ప్రశ్నార్థకంగా హెచ్చరికలు జారీ చేశారు. ఈ పోస్టర్ల శైలి మహిళలను లక్ష్యంగా చేసుకుని, వారిని నేరానికి బాధ్యులను చేసే విధంగా ఉందని ప్రతిపక్షాలు, సామాజిక కార్యకర్తలు మండిపడ్డారు. మహిళల భద్రతపై అవగాహన కల్పించడానికి బదులుగా ఈ పోస్టర్లు.. బాధితులనే నిందితులుగా చూపిస్తున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శించింది. గత మూడేళ్లలో గుజరాత్‌లో 6,500 అత్యాచారాలు, 36 గ్యాంగ్ రేప్‌లు జరిగాయని ఆ పార్టీ వెల్లడించింది. వివాదం తీవ్రం కావడంతో అహ్మదాబాద్ ట్రాఫిక్ విభాగం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) నీతా దేశాయ్ దీనిపై స్పందించారు. తాము రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లను మాత్రమే స్పాన్సర్ చేశామని, మహిళల భద్రతకు సంబంధించిన పోస్టర్లను కాదని ఆమె వివరణ ఇచ్చారు. సతర్క గ్రూప్ అనే స్వచ్ఛంద సంస్థ (%చీ+ూ%) ట్రాఫిక్ పోలీసుల అనుమతి లేకుండా ఈ వివాదాస్పద పోస్టర్లను తయారు చేసి, అంటించిందని ఆమె తెలిపారు. ఆ సంస్థ సభ్యులు తమకు ట్రాఫిక్ భద్రతపై అవగాహన పోస్టర్లను మాత్రమే చూపించారని, మహిళల భద్రతకు సంబంధించిన పోస్టర్లు తమకు తెలియకుండా అంటించారని డీసీపీ వెల్లడించారు. తమ దృష్టికి వచ్చిన వెంటనే ఆ పోస్టర్లను తొలగించామని ఆమె స్పష్టం చేశారు. ఈ మొత్తం సంఘటన మహిళల భద్రతపై ప్రభుత్వాల వైఖరిని, సమాజంలో నెలకొన్న ఆలోచనా విధానాన్ని మరోసారి బహిర్గతం చేసింది. నేరానికి కారకులను శిక్షించడం, మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంపై దృష్టి పెట్టకుండా, బాధితులనే నిందించడం ఎంతవరకు సమం

## పహల్గాం ఉగ్రదాడిలో పాకిస్థాన్ హస్తం.. మరోసారి కన్ఫార్మ్ చేసిన తాహిర్ అబీబ్ అంత్యక్రియలు



శ్రీనగర్-నవభూమి:జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి సంబంధించి కీలకమైన ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా ఈ దాడి వెనుక పాక్ హస్తం ఉందని మరోసారి నిరూపితం అయింది. అయితే ఈ దాడిలో పాల్గొన్న ఓ ఉగ్రవాది ఇటీవలే ఆపరేషన్ మహాదేవ్‌లో హతమైన విషయం అందరికీ తెలిసిందే. అయితే తాజాగా అతడి అంత్యక్రియలను పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లో పాకిస్థాన్ ప్రభుత్వమే నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సైతం ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్ని ఉగ్రవాదులు.. శ్రీనగర్‌లోనే అత్యంత ఎత్తైన మహాదేవ్ పర్వత పరిసరాల్లో నక్కినట్లు భద్రతా బలగాలకు ఇటీవలే సమాచారం అందించిద. 13 వేల అడుగులో ఎత్తులో ఉన్న మంచు కొండపైకి వెళ్లిన సైన్యం.. చైనా తయారీ ఎన్ క్రిప్టెడ్ కమ్యూనికేషన్ సెట్ టీ82 యాక్టివేట్ అయినట్లు గుర్తించి మరీ ఉగ్రవాదుల జాడను పసిగట్టింది. ఈక్రమంలోనే సైన్యం, సీఆర్పీఎఫ్, జమ్మూ కాశ్మీర్ పోలీస్ ఆపరేషన్‌కు సన్నాహాలు చేపట్టాయి. ఆపరేషన్ మహాదేవ్ పేరిట కాల్పులు జరపగా.. ఉదయం 11 గంటల సమయంలో ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సైతం సైన్యం విడుదల చేసింది. ముఖ్యంగా పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న నిందితుల వీళ్లేనంటూ చెప్పింది.

అయితే గత ఆదివారం రోజు వీరు ముగ్గురు హతం కాగా.. ఇందులో ఒక ఉగ్రవాది అయిన తాహిర్ హబీబ్‌కు పీఓకేలో జనాబా ఏ గైబ్ విధానంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహం లేకపోయినా.. ఈ విధానం ద్వారా అంతిమ సంస్కారాలు చేశారు. ముఖ్యంగా రావల్‌కోట్ ఖైగలాలో పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఓటెలిగ్రామ్ ఛానెల్‌లో పోస్టు కూడా చేశారు. ఈ సమయంలో స్థానిక లష్కరే కమాండర్ రిజ్వాన్ హనీఫ్, ఇతర సభ్యులు కూడా దానిలో భాగం కావాలని ప్రయత్నించారు. కానీ తాహిర్‌ను అతడి కుటుంబీకులు అంత్యక్రియలకు హాజరు కాకుండా అడ్డుకున్నారు. కానీ హనీఫ్ పట్టుబట్టడంతో.. ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. ముఖ్యంగా స్థానికులను ఉగ్రవాదులు తమ ఆయుధాలతో భయపెట్టారు. దీంతో వారు ఆందోళనకు దిగారు.

తాహిత్ హబీబ్ తొలుత ఇస్లామిక్ జమాత్ తలాబా, స్టూడంట్ లిబరేషన్ ఫ్రంట్‌లో పని చేశాడు. అతడికి అఫ్గాని అనే నిక్ నేమ్ ఉంది. ఇదే ఇంటెలిజెన్స్ రికార్డుల్లో కూడా నమోదు కాగా.. పాక్ సైన్యంతో అతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అదే అతడిని ఉగ్రవాదిగా మార్చింది. ఇలా పహల్గాం ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని మరోసారి బయటపడడంతో.. భారత్ మరింత అప్రమత్తం అవుతోంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరక్కుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటూనే.. పూర్తిగా ఉగ్రవాదులను రూపుమాపేందుకు గట్టిగా కృషి చేస్తోంది.

## స్నేహమంటే వీళ్లదే..! 'కిక్ బటోస్కి', 'గంతర్' ఫ్రెండ్‌షిప్ గురించి మీకు తెలుసా?



న్యూఢిల్లీ-నవభూమి:ఫ్రెండ్స్ ఎలా ఉండాలో వీరిని చూసి నేర్చుకో వచ్చు!. ఇద్దరి వ్యక్తిత్వాలు వేరైనా.. ఒకరంటే ఒకరికి అభిమానం. సాహసాలు, సవాళ్లు ఎదురైనా ఒకరికొకరు అండగా నిలిచారు. దానికోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారి మధ్య గొడవలు, మనస్పర్థలు వచ్చినా.. ఫ్రెండ్‌షిప్‌ను మాత్రం వదలిపెట్టలేదు. స్నేహం కోసం ఎంత రిస్క్ అయినా చేసేవారొకరైతే.. ఆతడికి ఎల్లప్పుడూ సహాయం చేసేవారు ఒకరు. కిక్‌బటోస్కి కార్టూన్ సిరీస్‌లోని.. కిక్, గంతర్ స్నేహం నిజ జీవితంలోని స్నేహానికి ప్రతిబింబం. స్నేహ బంధానికి ఇది ఒక గొప్ప ఉదాహరణ!.

కిక్ బటోస్కి, గంతర్.. స్నేహమంటే వీళ్లదే!..స్నేహం.. ఈ మాటకు కచ్చితమైన డెఫినిషన్ చెప్పే భాష.. ఇప్పటివరకు భూమిపై పుట్టలేదంటే అతిశయోక్తి కాదు!. ఫ్రెండ్‌షిప్‌ను లెక్కలేనంత మంది అనేక రకాలుగా వర్ణించినా.. ఈ బంధంలో ఉండే భావానికి ఇంకేదో అర్థం ఉందనిపిస్తుంది ఎందుకో!. భూమిపైకి ఒంటరిగా వచ్చి.. పోయేటప్పుడు ఒంటరిగా వెళ్తాం అని పెద్దలు చెబుతుంటారు. అది నిజమే అయినా.. పుట్టినప్పుడు ఏమో గానీ.. చనిపోయేటప్పుడు మాత్రం మనకు కావాల్సిన వాళ్లకు.. అతి ముఖ్యంగా మన స్నేహితులకు తీరని శోకాన్ని మిగిల్చి వెళ్తాం. మన కుటుంబం కాకపోయినా.. మన రక్తం పంచుకుని పుట్టకపోయినా.. మనం లేకపోతే, దూరమైతే.. ఎక్కడో మూలకు వెక్కి వెక్కి ఏడుస్తుంటాడు ఓ స్నేహితుడు!. వీరిద్దరూ కూడా అలాంటి స్నేహితులే. వారే.. కిక్‌బటోస్కి కార్టున్ షో లోని క్యారెక్టర్లు కిక్ బటోస్కి, గంతర్. ఏంటీ ఆశ్చర్యపోయారా? కార్టూన్లు అని కామెడీగా తీసిపారేయకండి. వీళ్ల నుంచి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉంది.

వీరి ఫ్రెండ్‌షిప్..ఫెవికాల్ బాండ్..

కిక్, గంతర్ ఫ్రెండ్‌షిప్ సెంట్రల్ థీమ్‌గా కిక్ బటోస్కి యానిమేటెడ్ సిరీస్ వచ్చింది. ఇందులో కిక్ బటోస్కి డేర్‌డెవిల్. అతడికి అడ్వెంచర్, స్టంట్స్ అంటే మహా సరదా. మరోవైపు గంతర్‌కు ఇవేమీ ఇష్టం ఉండవు. సాధారణ పిల్లాడిలా ఉంటాడు. కానీ కిక్‌కు మంచి నమ్మకమైన ఫ్రెండ్‌లా.. అతడు చేసే అన్ని అడ్వెంచర్లలో తోడుగా ఉంటాడు. ఎన్ని సవాళ్లు ఎదురైనా.. ఒకరికొకరు క్లోజ్, సపోర్టివ్‌గా, ఎల్లప్పుడూ పక్కన ఉంటారు. కేవలం కార్టూన్ క్యారెక్టర్లే అయినా.. అవి మాట్లాడే మాటలు, చేసే హావభావాలు నిజ జీవితంలోనివే. మనమందరం ఆచరించాల్సినవే. నమ్మకమే స్నేహానికి పునాది..ఒకానొక సమయంలో కిక్కు, గంతర్.. కుటుంబాల మధ్యం వివాదం తలెత్తుతుంది. ఈ క్రమంలో వారిద్దరిని ఒకరితో ఒకరు మాట్లాడుకోవద్దని పేరెంట్స్ కండిషన్స్ పెట్టి ఇంటి నుంచి బయటకు రానివ్వరు. అలా ఒక ఎపిసోడ్‌లో ఇద్దరూ వేరే స్నేహితులను వెతుక్కునే దాక వెళ్తారు. చివరకు.. పెద్దవాళ్ల మధ్యే గొడవలు.. మన మధ్య కావుగా అని.. ఇబ్బందులు ఎదుర్కొని మరీ ఒకరిని ఒకరు కలుసుకుంటారు. కిక్, గంతర్‌తు ఎదురైనట్లే.. నిజజీవితంలో స్నేహానికి పరీక్షలు ఎదురవుతాయి. ఇంట్రెస్ట్‌లు మారిపోవడం, లైఫ్‌లో మార్పులు రావడం, కమ్యూనికేషన్ ఉండకపోవడం, ట్రస్ట్ ఇష్యూలు, గొడవలు, బయటి వ్యక్తుల జోక్యం వల్ల కావచ్చు.. స్నేహానికి తాత్కాలికంగా బీటలు వారే పరిస్థితి తలెత్తుతుంది. అలాంటి పరిస్థితుల్లోనూ కిక్కు, గంతర్ నిలబడ్డారు. మళ్లీ కలవడం కోసం ఇద్దరూ అనేక ప్రయత్నాలు చేశారు. వారిద్దరికి ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే మళ్లీ కలిపింది. ఇక్కడ మనం గమనించాల్సింది ఏంటంటే.. గొడవలు, మనస్పర్థలు ప్రతి బంధంలో కామన్. అవి మన వల్ల అయినా ఇతరుల వల్ల అయినా వస్తాయి. కానీ ఒకరిపై ఒకరికి ఉండే నమ్మకం ముందు ఇవన్నీ నిలబడవు. నిన్ను అమితంగా అభిమానించే స్నేహితుడి ముందు.. ఒక మెట్టు తగ్గినా ఫర్వాలేదనేది నా ఒపీనియన్. ఏమంటారు?..ఫ్రెండ్‌షిప్ కోసం రిస్క్..ఈ సిరీస్ ఆద్యంతం గంతర్‌ను కాపాడటానికోసమైనా లేదా అతడికి మద్దతుగా నిలవడం కోసమైనా కిక్ తరచుగా రిస్క్‌ల్లో పడతాడు. అంలాంటి పరిస్థితుల్లో గంతర్ కూడా కిక్కుకు సపోర్ట్‌గా ఉంటాడు. వారిద్దరి మధ్య ఉన్న భాగోద్వేగమే ఈ షోకి హైలైట్‌గా నిలుస్తుంది. అలా క్రమంగా వారిద్దరి స్నేహం బలపడుతుంది. ఒకానొక సమయంలో గంతర్.. తాను ప్రేమలో పడ్డానని కిక్కుతో చెబుతాడు. అప్పుడు కిక్కు.. "ఆ కన్నె కాన్నార్పకుండా నిన్నే చూలా చేస్తా గంతర్.." అనడమే కాదండోయ్.. ఎన్నో పాట్లు పడి మరీ గంతర్ కోరుకున్న పిల్లతో పెళ్లి చేస్తాడు. స్నేహితుడి కోసం కిక్కు ఎంతకైనా తెగిస్తాడు. ఇలా తమ స్నేహితులకు.. పెళ్లి పెద్దలు అయిన వాళ్లలో మీరూ ఉన్నారా?. అలాంటప్పుడు మన కోసం రిస్క్ చేసిన ఫ్రెండ్స్‌ను ఎలా మర్చిపోగలం. అలకలు, చిరు కలహాలు మంచివే..ఇవే కాదండోయ్.. గంతర్ కోసం కిక్కు, కిక్కు కోసం గంతర్ చేయని పనులు, వేయని వేశాలు, చేయని సాహసాలంటూ లేవు. అప్పుడప్పుడూ ఒకరంటే ఒకరు పడనట్టు బిహేవ్ చేస్తారు. ఈర్ష్య, అసూయ స్నేహితుల మధ్య సర్వసాధారణమే. అయితే అది.. చిరు చినుకులు జల్లులుగా జాలువారి మళ్లీ ఎండ కాసేవరకే. ఎంతో సేపు నిలవదు. మళ్లీ మన స్నేహితుడి మనసు మన గురించే ఆలోచిస్తుంది. అనుకోకుండా కిక్కు, గంతర్.. ఒకరికొకరు పరిచయం అయ్యారు. తర్వాత ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నారు. క్రమంగా వీడదీయరాని బంధంగా వాళ్లిద్దరి మధ్య స్నేహం పెనవేసుకుంది. అలకలు, కలహాలు, మనస్పర్థలు, చిలిపి కోపాలు.. అన్ని బంధాల్లో సహజమే. వీరిద్దరి మధ్య కూడా అలాంటివి అనేకం జరిగాయి. కాలం వీరి స్నేహానికి అనేక పరీక్షలు పెట్టింది. అయినా వారిలో ఒకరిపై ఒకరికి ఉన్న అభిప్రాయం మారలేదు. వాటిన్నింటినీ దాటుకుని స్నేహానికి మారు పేరుగా నిలిచారు.



## అదనపు హంగులద్దే చంపస్వరాలు

సంప్రదాయం మహిళల అందాన్ని ఇనుమడింపజేయడానికి అనేక ఆభరణాలు ఉన్నాయి. వీటిలో చెంపస్వరాలు ప్రధానమైనవి. ఒకప్పుడు వీటిని సంప్రదాయ నాట్య కళాకారిణులు ధరించేవారు. ఇవి సాధారణంగా చెవి దుద్దుల నుంచి జడను అనుసంధానం చేస్తూ ఉంటాయి. పూర్వం వీటిని చంపక పుష్పం ఆకారంలోనే రూపొందించేవారు. వీటికి ఉండే గొలుసులు కూడా సన్నంగా ఉండేవి. నృత్యం చేసే సమయంలో ఈ గొలుసుల కదలికలు అదనపు ఆకర్షణగా నిలిచేవి. ఆ తరువాతి కాలంలో చెంపస్వరాలు ఒక తరం నుంచి మరొక తరానికి వచ్చే వారసత్వంగా మారాయి. ఆధునిక జీవనంలో చీరలు ధరించటం తగ్గిన తర్వాత వీటిని ఉపయోగించేవారి సంఖ్య తగ్గింది. కేవలం పండుగల సమయంలో ధరించడానికే పరిమితం అయ్యాయి. కానీ ఈ మధ్యకాలంలో వీటికి ఆదరణ బాగా పెరిగింది. ముఖ్యంగా పెళ్లి సమయంలో చెంపస్వరాలు ధరించని వధువులు ఉండటం లేదు. వధువు అలంకరణలో ఇవి ఒక ముఖ్యమైన భాగంగా మారిపోయాయి. ఒకప్పుడు కేవలం బంగారంతో మాత్రమే తయారు చేసేవారు. ప్రస్తుతం ముత్యాలు, వజ్రాలు, కెంపులు లాంటి వాటితో కూడా వీటిని రూపొందిస్తున్నారు.



## తెలంగాణ సాయుధపోరాట యోధురాలు

# దాయం ప్రియంవద



తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడిన నల్గొండ జిల్లా మహిళ యోధురాలు, సుశిక్షితురాలైన గెరిల్లా సైనికురాలు, తెలంగాణ సాయుధ పోరాటం అనంతరం సైద్ధాంతిక నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా ఆదర్శ జీవనప్రస్థానం సాగించి, మహిళా హక్కుల సాధన, బాల్యవివాహాల నిర్మూలన, బాలికా విద్య కోసం ఉద్యమం చేపట్టన నికార్సయిన కమ్యూనిస్టు నాయకురాలు కామ్రేడ్ దాయం ప్రియంవద స్మృతి దినం ! జోహార్లు..!!

**దా**యం ప్రియంవద తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడిన మహిళ. దివంగత తెలంగాణా సాయుధ పోరాటయోధుడు దాయం రాజిరెడ్డి సోదరి. భీమిరెడ్డి నరసింహారెడ్డి, శశిరేఖ, మల్లు స్వరాజ్యం తదితర ఉద్యమకారులంతా ప్రియంవద సమీప బంధువులు.

**జననం - విద్యాభ్యాసం...**

నల్గొండ జిల్లా, తుంగతుర్తి మండలం వెంపటి సమీపంలోని తూర్పుగూడెంలో ఆగస్టు 3, 1928లో లక్ష్మమ్మ, రామకృష్ణారెడ్డి దంపతులకు జన్మించారు. ప్రియంవదది మధ్య తరగతి వ్యవసాయ నాడు అమ్మాయిలకు విద్య అంతంత మాత్రమే అయినా తరగతి వరకు చదువుకుంది. కూడా నేర్చుకుంది. రష్యన్ సాహిత్యం, గోర్కి నవలలు ఆ రోజుల్లోనే చదివింది. రెండో ప్రపంచ యుద్ధం గురించి వెలువడిన పుస్తకాల పట్ల ఆసక్తి చూపడం వల్ల నాటి పరిస్థితిని అర్థం చేసుకోగలిగింది.

**ఉద్యమ ప్రస్థానం..**

సుశిక్షితురాలైన గెరిల్లా సైనికురాలు ప్రియంవద తెలంగాణ సాయుధ పోరాటం అనంతరం సైద్ధాంతిక నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా ఆదర్శ జీవనప్రస్థానం సాగించింది. 1943 సంవత్సరంలో 15ఏళ్ళ వయసులోనే అన్న రాజిరెడ్డితో కలిసి ఖమ్మం ఆంధ్రమహాసభకు హాజరయ్యింది. తెలంగాణ సాయుధపోరాట యోధులు కీ.శే. బొమ్మగాని ధర్మభిక్షం, భీమిరెడ్డి నరసింహారెడ్డి, దాయం రాజిరెడ్డిలతో కలిసి సూర్యాపేట ప్రాంతంలో జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. గెరిల్లా సైనికురాలిగా ఆయుధం పట్టడానికి ముందు ఆమె విజయవాడలో ఆత్మరక్షణ, ఆయుధశిక్షణ పొందింది. సాయుధ పోరాటంలో గాయపడ్డ యోధులకు వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకంగా ఆరోగ్యసేవిక (నర్సింగ్) ట్రైనింగ్ పొందింది.

**పదిహేనేళ్ల ప్రాయంలోనే ఆమె ఉద్యమం పట్ల ప్రభావితమైంది..**

ప్రియంవద వాళ్ల వదిన శశిరేఖ అన్నయ్య భీంరెడ్డి నర్సింహారెడ్డి. అన్న, వదినలతో పాటు భువనగిరిలో జరిగిన ఆంధ్ర మహాసభకు వెళ్లింది ప్రియంవద. అలా పదిహేనేళ్ల ప్రాయంలో ఆమె ఉద్యమం పట్ల ప్రభావితమైంది. స్త్రీల సమస్యలపై, రైతు కూలీల సమస్యలపై అన్నతో కలిసి ఉద్యమబాట పట్టింది. 1952లో జరిగిన ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో పిడిఎఫ్ అభ్యర్థుల విజయానికి కృషిచేశారు. మహిళా హక్కుల సాధన, బాల్యవివాహాల నిర్మూలన, బాలికా విద్య కోసం ఉద్యమం చేపట్టారు. మహిళల కూలీరేట్ల పెంపు కోసం ఆమె రాజీలేని పోరాటం సాగించి, పెద్ద రైతు కుటుంబ నేపథ్యం కలిగిఉన్న అర్ధశేరు వడ్లు మాత్రమే ఉండే రోజు కూలీని, రెండుశేర్ల వడ్లు కూలీగా ఇప్పించారు.

**భువనగిరి ప్రాంతంలో పార్టీ ఆర్గనైజర్‌గా...**

ఆంధ్రమహాసభలు వరంగల్, ఖమ్మంలో జరిగిన తర్వాత అన్న రాజిరెడ్డిను భువనగిరి ప్రాంతంలో పార్టీ ఆర్గనైజర్‌గా నియమించారు. ఇబ్బందుల్లో ఉన్న రాజిరెడ్డికి తోడుగా కొలనుపాక జైన మందిరంలో నడిపే స్కూలులో యాభై రూపాయల జీతంతో టీచర్‌గా చేరారు. అక్కడ ఒక



సంవత్సరంపాటు పనిచేశారు. ఆసమయంలో వీరి కుటుంబంపై ప్రభుత్వం నిషేధం విధించడంతో 1944లో విజయవాడకి వెళ్లారు. అక్కడ జరిగిన అఖిలభారత కిసాన్ మహాసభకు వలంటీర్‌గా పనిచేశారు. ఆ తర్వాత వివిధ గ్రామాలకు వెళ్లి తెలంగాణ సాయుధ పోరాటం గురించి ఆడవాళ్లలో చైతన్యం కలిగించింది. సూర్యాపేటజిల్లాలోని భక్తవత్సలాపురం, అనాజపురం, దురాజ్‌పల్లి, రాయన్‌గూడెం గ్రామాలల్లోతిరిగి, ఇళ్ళల్లోకి వచ్చినప్పుడు ఎట్లా ఎదుర్కోవాలె ? స్త్రీలకు స్థావరాలు కొన్ని తెలిసున్నా చెప్పకుండా ఎట్లుండాలె? కారం చల్లటానికి ఎట్ల సిద్ధమవ్వాలి, ఇల్లు వదిలిపోయేటప్పుడు అన్నం గిట్ల ఉంటె అండ్ల విషం కలిపి పెట్టిపోవాలె వంటివి చెప్పేది. సమాజంలో స్త్రీలకుండే ఇబ్బందులు వాటినెదుర్కోవాలంటే ఏం చెయ్యాలె ? స్త్రీలను ముందుకెట్లా తీసుకురావాలి అన్న విషయాలు ఎంతో ఉత్తేజంతో ప్రసంగించేది. చదువు విషయంలో ఎవరైనా ముందుకొస్తే వాళ్ళకు పాఠాలు చెప్పేది. వీధివీధికి గ్రూపు మీటింగులు పెట్టేది. సూర్యాపేటలో ఒక సంవత్సరం పాటు పనిచేసిన తర్వాత హుజూర్ నగర్ లో మరికొంత కాలం పనిచేసింది.

**రహస్యం జీవితం,.**

ఊళ్ళల్ల రజాకార్ల ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో సొంత ఊళ్ళో వుండకుండా రహస్యంగా ఉండాల్సిన పరిస్థితి కలిగింది. వీరి జాడ చెప్పమని ఆమె తండ్రిని పోలీసులు బాగా హింసించినా ఆచూకీ చెప్పలేదు. అమ్మను, నాన్నను చూసేందుకు ఊరొచ్చింది ప్రియంవద.ఆ విషయం తెలుసుకున్న పోలీసులు రాత్రి పదకొండు గంటలకు వచ్చి చేసి స్టేషనుకు తీసుకుపోయి, రెండు రోజులు తుంగతుర్తి క్యాంపుల ఉంచిన తర్వాత సూర్యాపేటకు తీసుకుపోయారు. అక్కడ ఒకరోజు ఉంచి హైదరాబాద్ తీసుకపోయి, చంచల్‌గూడ జైల్లో బంధించారు. మూడు నెలల తర్వాత బయటికి వచ్చింది.

**ప్రియంవద తుదిశ్వాస విడిచే వరకూ సిపిఐ నాయకురాలిగా....**

జైలు నుంచి వచ్చిన తర్వాత ఆయుధాలు పట్టి కాల్చడం నేర్చుకుంది. దళంలో ప్రత్యక్షంగా పాల్గొనకుండా పరోక్షంగా మాత్రమే సహాయం అందించింది. తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌పై దాడి చేసినప్పుడు గుట్ట మీద సెంట్రీగా పనిచేసింది. అందుకు ఆమె కోసం పోలీసులు వెతికారు. ఆమె యూనియన్ సైన్యం చేతిలో రెండోసారి సొంతింట్లనే అరెస్టయింది. ఈసారి ఆమెను సికింద్రాబాద్ కంటోన్మెంట్ జైలుకు తీసుకెళ్లి, వరంగల్ జైలుకు పంపించారు. రెండేళ్ల తర్వాత బయిటికొచ్చింది. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జైళ్ళలోనూ ఆమె జైలు జీవితం గడిచింది. అవివాహితగా ఉన్న ప్రియంవద తుదిశ్వాస విడిచే వరకూ సిపిఐ నాయకురాలిగా, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు కార్యక్రమాల్లో చురుకైన పాత్రను నిర్వర్తించారు.

**మరణం..**

పోరాటం కొనసాగిస్తున్నప్పుడే ప్రియం వద పార్టీకి చెందిన ఒకాయనను వివాహం చేసుకుందామనుకుంది. కానీ కొన్ని కారణాల వల్ల కుదరలేదు. అయినా ఆమె ఎందుకిలా జరిగిందని విచారించలేదు. మరో వివాహమూ చేసుకోలేదు. ఒంటరిగానే బతికింది. ఉద్యమరోజుల్లో ప్రజలకు అత్యంత దగ్గరగా గడిపిన ఆమె చివరి రోజుల్లో ప్రజా జీవితానికి దూరంగా జీవిస్తూ 2013, ఆగస్టు 3 శుక్రవారం నాడు తుది శ్వాస విడిచారు. స్వగ్రామం తూర్పుగూడెంలో ప్రియంవద అంత్యక్రియలు జరిగాయి. ప్రియంవద భౌతికకాయంపై సిపిఐ జెండాకప్పి పుష్పగుచ్చాలతో నివాళులు అర్పించారు.


**మహమ్మద్ గౌస్**

## ఉల్లిపాయ టీతో జలుబు, దగ్గుకు తక్షణ ఉపశమనం



సాధారణంగా సీజనల్ వ్యాధులను నివారించుకోవడానికి మన ఇళ్లలోనే ఎన్నో చిట్కాలు ఉంటాయి. జలుబు, దగ్గు, తుమ్ములు వంటి సాధారణ వ్యాధులకు ఇంట్లోని పెద్దవాళు వంటింటి వస్తువులతోనే చిటికెలో ఉపశమనం కలిగించే ఔషధాన్ని తయారు చేసి ఇస్తుంటారు. వీటి వల్ల రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందని వారు తరచూ చెబుతుంటారు. కానీ వాటిపై ఈ తరం వారు అంతగా నమ్మకం ఉంచరు. అయితే పెద్దలు చెప్పినట్లుగానే వంటింటి పదార్థాలతో తక్షణ ఉపశమనం పొందే ఎన్నో గుణాలు ఉన్నాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలంటున్నారు నిపుణులు. అందులో ఒకటి ఉల్లిపాయ టీ కూడా. ఉల్లిపాయలు వంటల్లో రుచిని ఇవ్వడమే కాక, మంచి ఆరోగ్యాన్నిచ్చే ఎన్నో లక్షణాలను ప్రేరేపిస్తుందట. అందుకే ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదనే నానుడి కూడా ఉంది.

అయితే ప్రస్తుతం చలికాలంలో చాలా మంది జలుబు, తగ్గు, గొంతునొప్పి, ముక్కు కారడం వంటి సమస్యలతో బాధపడుతుంటారు. అలాంటి వారంతా తక్షణ ఉపశమనం కోసం ఈ ఉల్లిపాయ టీ తీసుకుంటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఆనియన్ టీ రోగనిరోధక శక్తిని పెంచడంలో ప్రభావంతంగా పనిచేస్తుందని పరిశోధనలో కూడా వెల్లడైందట. అంతేగాక ఉల్లిపాయ విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, మెగ్నీషియం, ఐరన్, జింక్ వంటి రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలకు కూడా అమూల్యమైన వనరుగా నిపుణులు చెబుతున్నారు. ఓ కప్పు టీని మీ రోజువారి ఆహారపు అలవాట్లలో చేర్చుకుని రోగనిరోధక శక్తిని పెంచుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఈ టీని ఉల్లిపాయతో లేదా వాటి తొక్కలతో కూడా చేసుకోవచ్చు.



**ఉల్లిపాయ టీ:**

ఒక గ్లాసు నీరు మరిగించి అందులో తరిగిన ఉల్లిపాయ, 2-3 నల్ల మిరియాలు, 1 యాలుకతో పాటు సగం చెంచా సోపు గింజలను జోడించాలి. దీనిని 15-20 నిమిషాల పాటు మరగించి తర్వాత వడకట్టుకుని తాగాలి.

**ఉల్లిపాయ పీల్ టీ:**

టీ పొడి లేదా గ్రీన్ టీ ఆకులు వేసి నీటిని మరగించాలి, ఆ తర్వాత మరిగించిన నీటిని చిన్న ఉల్లిపాయ లేదా సగం ఉల్లిపాయ తొక్కలు తీసి ఉంచుకున్న కప్పులో పోయాలి. వేడి వేడి నీటిలో సుమారు 10 నిమిషాలు పాటు ఈ ఉల్లిపాయ తొక్కలు నానబెట్టాలి. ఆ తర్వాత ఈ నీటిని వడకట్టి తేనె, నిమ్మరసం కలుపుకుని తాగాలి.


## ఇలా చేస్తే లావు తగ్గుతారా?

కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉన్న ఆహారం ఆరునెలలపాటు తింటే శరీరానికి మంచిదట. అంతేకాదు తక్కువ ఫ్యాటు ఉన్న ఫుడ్ కన్నా లో-కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తినడం వల్ల బరువు బాగా తగ్గుతారట. అంటే దాదాపు ఒక కిలో నుంచి నాలుగు కిలోల వరకు బరువు తగ్గుతారట. శాస్త్రవేత్తలు ఇటీవల చేసిన ఒక అధ్యయనంలో ఈ విషయం తేలింది. దీన్నిబట్టి పరిమితకాలం తక్కువ కార్బోహైడేట్స్ ఉండే ఫుడ్ తినడం మంచిది. వీటివల్ల శరీర బరువు కూడా తగ్గుతాము. అయితే లో-ఫ్యాట్ డైట్స్‌తో పోలిస్తే ఇందులో తగ్గే బరువు క్లినికల్‌గా పలు సందేహాలను రేకెత్తిస్తోంది.



ప్రాసెస్డ్ ఫుడ్స్ మంచివి కావు కాబట్టి ప్రతిఒక్కరూ వాటికి దూరంగా ఉండాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలి. కార్బోహైడ్రేట్లు బాగా తక్కువగా ఉండే ఆహారం మూలంగా ఎక్కువ మాంసాన్ని తినే అవకాశం ఉండడం వల్ల కొన్నిసార్లు ప్రాణాపాయం కలుగుతుంది. అంతేకాదు కేన్సర్ వంటి జబ్బులు తలెత్తే ప్రమాదం కూడా ఉంది. బరువు అంటే కండలు తగ్గడమా, కొవ్వు తగ్గడమా వంటి విషయాలు కూడా ఈ స్టడీలో తెలుసుకున్నారు. అంతేకాదు ఎల్‌సిడి (లో-కార్బ్ డైట్స్) అర్థం వైవిధ్యంగా ఉంటుందన్నారు. కార్బోహైడ్రేట్స్ పరిమితంగా తీసుకున్నప్పటికీ తిన్న డైట్‌లోని కార్బోహైడ్రేట్లు నాలుగు శాతం నుంచి 46 శాతం వరకూ కాలరీలు కలిగి ఉంటాయిట. మొత్తానికి ఈ స్టడీలో శాస్త్రవేత్తలు ఎల్‌సిడి వల్ల తలెత్తే సమస్యలతోపాటు ప్రయోజనాలపై కూడా దృష్టి సారించారు. లో-ఫ్యాట్ ఫుడ్స్ వల్ల ఉండే ఇబ్బందులను తెలిపారు.

## పొట్టలో ఈ భాగం పనిచేయకపోతే ఇన్ని తిప్పలా..!



శరీరంలో ఏ భాగానికి నొప్పి, బాధ, ఇబ్బంది కలిగినా మొత్తం ఆరోగ్యం సరిగా లేనట్టే.. శరీరంలో ప్రధాన భాగాలైన గుండె, మెదడు మాదిరిగానే పొట్ట కూడా చాలా కీలకమైన భాగమే. ఇందులోని ప్రతి అవయవం సరైన రీతిలో పనిచేస్తేనే తిన్న ఆహారం సరిగా జీర్ణం అవుతుంది. ముఖ్యంగా ప్రాంక్రియాస్ (క్లోమ గ్రంధి) శరీరంలో సహజ రసాలను, ఎంజైమ్‌లను ఉత్పత్తి చేస్తుంది. ఇది సరిగా పనిచేయనప్పుడు శరీరంలో కనిపించే వివిధ లక్షణాలను గురించి తెలుసుకుందాం.

పొట్టలో ఉండే పెద్ద ప్రేగులు, చిన్నప్రేగులు జీర్ణ సంబంధమైన క్రియలలో పాల్గొంటాయి. ఇక్కడే మరో ముఖ్యమైన అవయవం కూడా ఉంది. అదే ప్యాంక్రియాస్ ఇది మన శరీరానికి జీర్ణ ఎంజైములు, హార్మోన్లను ఉత్పత్తి చేయడంలో కొవ్వును జీర్ణం చేసే ఎంజైమ్ అయిన లిపేస్ ఉత్పత్తికి సహాయపడుతుంది. అంతే కాకుండా ప్రోటీన్‌ను జీర్ణం చేసే ప్రోటీజ్ ఎంజైమ్, కార్బోహైడ్రేట్‌లను సరిగ్గా జీర్ణం చేసే అమైలేస్ ఉత్పత్తికి సహాయపడుతుంది.

శరీరంలోని ముఖ్యమైన అవయవం అయిన ప్యాంక్రియాస్ సరైన జీవనశైలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోకపోవడం, కొన్ని రకాల మందులను వాడటం వల్ల దెబ్బతింటుంది. ఇది సరిగా పనిచేయకపోతే ప్యాంక్రియాటైటిస్, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కింద గుర్తిస్తారు.

**ఈ లక్షణాలు ఎలా ఉంటాయంటే..**

పొత్తికడుపులో నొప్పి ఉంటుంది.. కొన్నిసార్లు అదే పనిగా కడుపులో నొప్పి మొదలవుతుంది. దీనితో పాటు జీర్ణక్రియ కారణంగా, శరీరంలోని ఎంజైములు, పిత్తరసంలో ఇబ్బంది ఉంటుంది. దీని కారణంగా ప్యాంక్రియాస్‌లో నొప్పి, మంట, ఇతర వ్యాధులు వస్తాయి.

**బరువు తగ్గుతారు..**

ప్యాంక్రియాస్ దెబ్బతిన్నప్పుడు ఆహారం నుండి విడుదల అయ్యే పోషకాలు తగ్గుతాయి. ఈ కారణంగా ఎంత ఆరోగ్యకరమైన ఆహారం, పోషకాలను తీసుకున్నా కూడా శరీరం గ్రహించదు. ఇది బరువును ప్రభావితం చేయడం మొదలవుతుంది. దీనితో బరువు తగ్గి, బలహీనంగా మారతారు.

మధుమేహం ఉన్న స్త్రీలలో అధికంగా కనిపించే సంకేతాలు ఇవే..

**వాంతులు అవుతాయి.**

ప్యాంక్రియాస్‌లో సమస్య ఉంటే కనుక, ఆహారాన్ని జీర్ణం చేసే ఎంజైమ్‌ల స్రావం తగ్గుతుంది. వాంతులు, వికారం వంటి లక్షణాలుంటాయి. ఇదే సమయంలో జిడ్డుగా ఉండే ఆహారాన్ని తీసుకుంటే ప్యాంక్రియాస్ దానిని విచ్ఛిన్నం చేయదు. దీని కారణంగా వాంతులు, వికారం ఉంటాయి.

**విరేచనాలు..**

తరచుగా విరేచనాలు అవుతాయి. ఇది జీర్ణక్రియ సమస్య సరిగా లేదని, ప్రాక్రియాస్ పనిచేయడంలేదని సూచిస్తుంది. శరీరం కొవ్వు, ప్రోటీన్లను జీర్ణించుకోలేక విరేచనాలు అవుతాయి.

ఉబ్బరం కూడా ఉంటుంది.


పొట్ట ఉబ్బరం ఉంటుంది. తిన్న వెంటనే కడుపు ఉబ్బరం సమస్య ఎక్కువగా ఉంటుంది. ప్యాంక్రియాస్ ఆహారాన్ని జీర్ణంచేసుకోలేక, గ్యాస్ట్రిక్ యాసిడ్ ఉత్పత్తి చేయలేకపోతుంది. దీని కారణంగా ఉబ్బరం సమస్య ఏర్పడుతుంది.

## మెరిసే చర్మం కోసం

# పండ్ల రసాలు

చలికాలంలో చర్మం ఎక్కువగా తేమను కోల్పోతుంది. దీని వల్ల చర్మం పొడిబారి పగులుతుంటుంది. చర్మంపై తెల్లని పొరలు ఏర్పడి నిర్జీవంగా మారుతుంది కూడా. ఇలా కాకుండా చర్మం మృదువుగా నిగనిగలాడాలంటే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్ల రసాలు తాగాలి.

**క్యారట్-నారింజ రసం..**క్యారట్‌లో బీటా కెరోటిన్ సమ్మేళనాలు, ఎ విటమిన్ అధికంగా ఉంటాయి. ఎ విటమిన్ చర్మంలో కొత్త కణాల ఉత్పత్తికి దోహదం చేస్తుంది. నారింజలో సి విటమిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మంలో కొల్లాజెన్ వృద్ధి పొందేలా చేస్తుంది. చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి కాపాడుతుంది. మిక్సీ గిన్నెలో రెండు క్యారట్‌లను చిన్న ముక్కలుగా కోసి వేయాలి. అందులో ఒక నారిజ పండును తొక్క, గింజలు తీసి వేయాలి. ఒక గ్లాసు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీనిని అలాగే గ్లాసులో పోసి ఒక చెంచా తేనె కలిపి తాగాలి. ఈ రసం చర్మానికి తేమను, కాంతిని అందిస్తుంది. ముడతలను పోగొడుతుంది.



**బీట్‌రూట్-యాపిల్ రసం..**బీట్‌రూట్‌లో ఐరన్, సి విటమిన్ ఉంటాయి. ఇవి రక్త ప్రసరణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. చర్మానికి పోషకాలను, ఆక్సిజన్‌ని అందిస్తాయి. యాపిల్‌లో విటమిన్లు, పీచుపదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మం నుంచి విషపదార్థాలను తొలగిస్తాయి. మిక్సీ గిన్నెలో ఒక చిన్న బీట్‌రూట్‌ను తొక్కతీసి ముక్కలుగా కోసి వేయాలి. అందులోనే ఒక యాపిల్‌ను ముక్కలుగా కోసి వేయాలి. అర గ్లాసు నీళ్లు పోసి గ్రైండ్ చేయాలి. దీనిని గ్లాసులో పోసి రెండు చెంచాల నిమ్మరసం కలుపుకుని తాగాలి. ఈ బీట్‌రూట్-యాపిల్ రసం చర్మానికి పోషణను, మెరుపుని ఇస్తుంది.

**దానిమ్మ రసం..**దానిమ్మలో ఆంథోసియానిన్స్, పాలీఫెనాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుంచి కాపాడతాయి. చర్మం మీద గీతలు, ముడతలు రాకుండా చేస్తాయి. సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల వల్ల చర్మానికి నష్టం కలుగకుండా చేస్తాయి. ఒక పెద్ద దానిమ్మ పండును ఒలిచి గింజలను మిక్సీ గిన్నెలో వేయాలి. అందులో అరగ్లాసు నీళ్లు పోసి గ్రైండ్ చేయాలి. ఈ రసాన్ని గ్లాసులో పోసి ఒక చెంచా తేనె కలుపుకొని తాగాలి. ఈ రసం చర్మానికి రక్తం పట్టేలా చేసి ఆరోగ్యంగా ఉంచుతుంది.

**బొప్పాయి-అనాస రసం..**బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది చర్మంలోని మృత కణాలను తొలగిస్తుంది. అనాసలో సి విటమిన్ ఉంటుంది. ఇది ముఖం మీద మొటిమల వల్ల ఏర్పడిన మచ్చలను పోగొడుతుంది. మిక్సీ గిన్నెలో ఒక కప్పు బొప్పాయి ముక్కలు, అర కప్పు అనాస పండు ముక్కలు వేసి అర గ్లాసు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇందులో రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా తేనె కలుపుకుని తాగితే చర్మానికి తగినంత తేమ అంది నున్నగా మెరుస్తుంది.

**కీరా-నిమ్మ రసం..**కీరాలో 95 శాతం నీళ్లు, సిలికా మినరల్స్ ఉంటాయి. ఇవి చర్మానికి తేమ, పోషణ అందిస్తాయి. నిమ్మరసం చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. మిక్సీ గిన్నెలో ఒక కప్పు కీరా ముక్కలు, రెండు చెంచాల నిమ్మరసం, కొన్ని పుదీనా ఆకులు వేసి అరగ్లాసు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీనిని గ్లాసులో పోసి ఒక చెంచా తేనె కలుపుకుని తాగాలి.

నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in


11 హైదరాబాద్ సోమవారం 04 । ఆగస్టు । 2025


# ఆర్బీఐ తాజా ప్రకటన.. రూ. 2,000 నోట్లు మీ దగ్గరున్నాయా?



**ముంబై-నవభూమి:** మే 19న రూ.2000 నోట్లను ఉపసంహరించుకుంటూ నిర్ణయం తీసుకుంది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దీంతో రూ.2000 నోట్ల చెలామణీ ఆగిపోయింది. ఈ మేరకు తమ దగ్గరున్న రూ.2వేల నోట్లను బ్యాంకుల్లో జమ చేసేశారు ప్రజలు. అయితే, ఈ పెద్ద నోట్లు రద్దయి ఇప్పటికీ రెండేళ్లకు పైగా గడిచినా ఇంకా చాలా నోట్లు ప్రజల దగ్గర ఉన్నాయి. అవి ఎంత మొత్తమంటే, ఏకంగా రూ.6,017 కోట్లు విలువైన రూ.2 వేల కరెన్సీ నోట్లు. ఇంత పెద్దమొత్తంలో రెండు వేల రూపాయల నోట్లు ఇంకా ప్రజల దగ్గర ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ వెల్లడించిన తాజాగా వెల్లడించింది.రెండు వేల రూపాయల నోట్ల రద్దు సమయంలో మార్కెట్లో రూ.3.56 లక్షల కోట్లు విలువైన రెండు వేల నోట్లు ఉండగా(6,017 కోట్ల విలువైన నోట్లు మినహా) క్రమంగా అవి బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చేశాయి. రిజర్వ్ బ్యాంక్ ముద్రించిన మొత్తం రూ.2వేల నోట్లలో ఇప్పటివరకూ 98.31 శాతం నోట్లు తిరిగి బ్యాంకులకు వచ్చాయని ఆర్బీఐ స్పష్టం చేసింది.కాగా, వివిధ కారణాలతో ఇప్పటికీ రెండు వేల రూపాయల నోట్లను మార్చుకోని వారికి ఇంకా వాటిని బ్యాంకులకు ఇచ్చి అంతే విలువ చేసే కరెన్సీ పొందే వీలుంది. హైదరాబాద్ తోపాటు, వివిధ నగరాల్లోని 19 ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో వీటిని మార్చుకోవచ్చు. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, బేలాపూర్, భోపాల్, చండీగఢ్, భువనేశ్వర్, జైపూర్, కోల్‌కతా, జమ్మూ, కాన్పూర్, ముంబై, లక్నో, ఢిల్లీ, పట్నా, నాగ్‌పూర్, తిరువనంతపురంలోని ఆర్‌బీఐ ఆఫీసులకు నేరుగా వెళ్లి మార్చుకోవచ్చు.

# రుణ చెల్లింపులకు విరామం ప్రకటిస్తున్నారా



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆర్థిక పరిస్థితులు ఎప్పుడు ఒకేలా ఉండవు. ఉద్యోగం పోవడం, మెడికల్ ఎమర్జెన్సీ లేదా ఆకస్మికంగా ఆదాయం పడిపోవడం వంటి ఈతి బాధలు ఇప్పుడు సాధారణమైపోయాయి. అందరి విషయంలో కాకపోయినా కొందరి విషయంలో ఇవి జరుగుతుంటాయి. మరి అలాంటి పరిస్థితుల్లో బ్యాంకులు లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ల నుంచి తీసుకున్న రుణాల నెలవారీ వాయిదా (ఈఎంఐ)లను ఎలా చెల్లించాలి? చెల్లింపుల నుంచి తాత్కాలిక విరామం (మారటోరియం) కోరాలా? లేక రుణ పునర్ వ్యవస్థీకరణ కోరాలా? అయితే ఈ స్టోరీ చదవండి.

ఈఎంఐల చెల్లింపుల నుంచి వాయిదా తాత్కాలిక ఉపశమనమే తప్ప.. దీర్ఘకాలిక పరిష్కారం కాదు. పైగా ఈ తాత్కాలిక ఉపశమనం వల్ల దీర్ఘకాలంలో రుణాలపై వడ్డీల మీద వడ్డీ పెరిగిపోయి తడిసి మోపెడవుతుంది. పైగా రుణ చెల్లింపుల వాయిదాలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇప్పుడు అనేక ఆంక్షలు విధించింది. ఉద్యోగాలు పోవడం, తీవ్ర అనారోగ్యం, ప్రకృతి విపత్తుల వంటి ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఈ వాయిదాలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. అయినా ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ వంటి బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఆయా వ్యక్తుల ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఏదో ఒక పేరుతో రుణ చెల్లింపుల వాయిదాలను అనుమతిస్తున్నాయి లేదా రుణాలను పునర్ వ్యవస్థీకరిస్తున్నాయి.

కొన్ని షరతులకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణ చెల్లింపుల నుంచి తాత్కాలిక ఉపశమనానికి అనుమతిస్తాయి. అప్పటి వరకు చెల్లించాల్సిన ఈఎంఐ క్రమం తప్పకుండా చెల్లించి ఉండాలి. ఒకవేళ బకాయి ఉన్నా 90 రోజులకు మించి ఉండకూడదు. ఉద్యోగం పోతే అప్పటి వరకు పని చేసిన కంపెనీ జారీ చేసిన టెర్మినేషన్ లెటర్, అనారోగ్య సమస్య అయితే అందుకు సంబంధించిన మెడికల్ బిల్స్, ప్రకృతి వైపరీత్యాలైతే అందుకు సంబంధించిన ప్రాంతీయ నివేదికలు సమర్పించాలి. ఈ రుజువులన్నీ సమర్పించినా అందరికీ చెల్లింపుల వాయిదా లభిస్తుందని చెప్పలేం. ఆయా వ్యక్తుల ఆర్థిక స్థితిగతులను జాగ్రత్తగా పరిశీలించి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు అందుకు ఆమోదం తెలుపుతాయి.

**ఆర్థికంగా భారమే**

ఈ వాయిదా ఊరికే రాదు. ఈఎంఐ చెల్లింపుల నుంచి తాత్కాలిక ఉపశమనం లభించినా, వాయిదా గడువు ముగిసే సరికి చెల్లించాల్సిన వడ్డీ 'అసలు'కు జమ అవుతుంది. దీంతో ఈఎంఐ లేదా రుణ చెల్లింపు కాల వ్యవధి పెరిగి పోతుంది.ఉదాహరణ: ఒక వ్యక్తి ఐదేళ్లలో చెల్లించేలా 12 శాతం వడ్డీతో ఒక బ్యాంకు నుంచి రూ.5 లక్షలు రుణంగా తీసుకున్నాడు. ఏదో ఆర్థిక సమస్య వచ్చి ఆ వ్యక్తి ఈఎంఐ చెల్లింపుల నుంచి మూడు నెలలు విరామం పొందాడనుకుందాం. ఈ మూడు నెలలకు అతడు చెల్లించాల్సిన రూ.7,500 వడ్డీ అసలుకు జమ అవుతుంది. పైగా ఇది చక్రవడ్డీల రూపంలో ఉంటుంది. మూడు నెలల తర్వాత మళ్లీ చెల్లింపులు ప్రారంభించినప్పుడు ఈఎంఐల రూపంలో రూ.10,000 వరకు అదనపు భారం పడుతుంది.

ఈఎంఐల చెల్లింపుల్లో తీసుకునే ఈ తాత్కాలిక విరామం వల్ల ఆయా వ్యక్తుల క్రెడిట్ స్కోరుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. బ్యాంకులు కూడా ఈ విరామాన్ని డిఫర్డ్ లేదా అండర్ మారటోరియం పద్దు కింద చూపిస్తాయి తప్ప, చెల్లింపులు ఆగిపోయాయని చూపించవు. దీనివల్ల ఆయా వ్యక్తుల పరపతి స్కోరుకు ఎలాంటి ఢోకా ఉండదు. కాకపోతే చెల్లింపుల భారం, ఈఎంఐల గడువు పెరిగిపోతాయి. దీంతో రుణ భారం పెరిగి భవిష్యత్‌లో తీసుకునే రుణాలపైనా ప్రభావంచూపుతుంది. బ్యాంకుతో మాట్లాడడంఆర్థిక పరిస్థితి బాగోలేనప్పుడు అప్పు ఇచ్చిన బ్యాంకుతో నేరుగా మాట్లాడి రుణ పునర్ వ్యవస్థీకరణ, ఈఎంఐ తగ్గింపు లేదా వడ్డీ చెల్లింపుల భారం తగ్గించుకోవడం మంచిది.

ఆర్థిక కష్టాలు తాత్కాలికమైతే అత్యవసర ఖర్చుల కోసం దాచుకున్న మొత్తం నుంచి ఈఎంఐలు చెల్లించడం మంచిది.

**ఖర్చులు తగ్గించుకోవడం**

ప్రతి వ్యక్తికి ఎంతో కొంత అనవసర ఖర్చులు ఉంటాయి. ఈ ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా చాలా వరకు వాయిదాల అవసరం లేకుండానే రుణ ఈఎంఐలు చెల్లించవచ్చు.

**ఇతర మార్గాలు**

టాప్ అప్ రుణాల ద్వారా కూడా రుణ చెల్లింపుల వాయిదాల నుంచి తప్పించుకోవచ్చు. ఒకవేళ అనేక రుణాలు ఉంటే అన్ని రుణాలను, ఒకే రుణంగా మార్చి తక్కువ వడ్డీ వసూలు చేసి బ్యాంకుకు మార్చి కూడా వాయిదాల భారం నుంచి బయట పడవచ్చు.పై విషయాలను దృష్టిలో ఉంచుకుని రుణ చెల్లింపుల 'వాయిదా' అస్త్రాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. లేకపోతే అదే పెద్ద గుదిబండగా మారి ఆర్థిక స్థితి గతుల్ని తారుమారు చేసే ప్రమాదం ఉంది.

# భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. మళ్లీ సామాన్యులకు షాకింగ్

**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం, వెండి ప్రియులకు మరోసారి షాకింగ్ న్యూస్ వచ్చేసింది. ఆగస్టు 3, 2025 ఉదయం 6:20 గంటల సమయానికి గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, బంగారం, వెండి ధరలు భారీగాపెరిగాయి. 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,540 పెరిగి రూ.1,01,350 స్థాయికి చేరగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.92,290కి చేరుకుంది. అదేవిధంగా, వెండి ధర కిలోగ్రాముకు రూ.100 పెరిగి రూ.1,13,000కి చేరింది.తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో బంగారం, వెండి ధరలు దాదాపు ఒకే స్థాయిలో ఉన్నాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,01,350, 22 క్యారెట్ల బంగారం రూ.92,290గా ఉంది. వెండి ధర కిలోగ్రాముకు రూ.1,23,000. విజయవాడలో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. చెన్నై, బెంగళూరు, ముంబై వంటి నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,01,350గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.92,290గా ఉంది. వెండి ధర కిలోగ్రాముకు రూ.1,12,800 నుంచి రూ.1,13,100కి పెరిగింది.బంగారం, వెండి ధరల పెరుగుదలకు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు ప్రధాన కారణం. అమెరికా డాలర్ విలువ క్షీణత, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపడం ఈ ధరల పెరుగుదలకు దోహదపడ్డాయి. అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు, రష్యా-చైనా వంటి అంశాలు కూడా బంగారం డిమాండ్‌ను పెంచాయి. దేశీయంగా, దిగుమతి సుంకాలు, జీఎస్టీ వంటి పన్నులు ధరలను మరింత పెంచాయి.

# వాహనదారులకు కేంద్రం షాక్.. అలా రోడ్డెక్కితే 20 వేల ఫైన్.. ఓసారి చెక్ చేసుకోండి మరి!




**న్యూఢిల్లీ-నవభూమి:** వాహనదారులకు బిగ్ అలర్ట్. కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ మోటారు వాహనాల చట్టానికి కొన్ని సవరణలు ప్రతిపాదించింది. జాతీయ రహదారులపై వేగ పరిమితులు, బీమా లేని వాహనాలకు జరిమానాల పెంపు విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణకు సైతం కఠిన నిబంధనలు విధించనున్నారు. ఈ సవరణల ద్వారా రహదారి భద్రతను మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇన్సూరెన్స్ లేని కార్లు, ఇతర వాహనాలు రోడ్డెక్కితే ఇకపై 5 రెట్లు ఎక్కువ పెనాల్టీ విధించేలా కొత్త మార్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది.స్పీడ్ లిమిట్‌లో స్పష్టత, రహదారి భద్రతను మెరుగుపరచడానికి కేంద్ర ఉపరితల రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ మోటారు వాహనాల చట్టానికి సవరణలు చేస్తోంది. ఆగస్టు 3వ తేదీ ఈ మేరకు టైమ్స్ ఆఫ్ ఇండియా ఈ విషయాన్ని రిపోర్ట్ చేసింది. జాతీయ రహదారులకు కేంద్రం, రాష్ట్ర రహదారులకు రాష్ట్ర ప్రభుత్వాలు వేగ పరిమితులు నిర్ణయిస్తాయి. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రాలు వేర్వేరు వేగ పరిమితులు విధిస్తున్నాయి. దీని వల్ల డ్రైవర్లు గందరగోళానికి గురవుతున్నారు. జాతీయ మార్గదర్శకాలను అనుసరించాల్సిన రహదారులపై రాష్ట్రాలు వేర్వేరు పరిమితులు విధిస్తుండటంతో డ్రైవర్లు తెలియకుండానే ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ఈ సవరణల ద్వారా వేగ పరిమితులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల డ్రైవర్లకు జరిమానాలు తగ్గించవచ్చు. అలాగే అమలు చేయడం సైతం సులభమవుతుంది.ఇన్సూరెన్స్ లేకపోతే రూ.20000 ఫైన్

ఇక బీమా లేని వాహనాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది. జరిమానాలు భారీగా పెంచాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం బీమా లేకుండా డ్రైవ్ చేస్తే మొదటిసారి రూ. 2,000, ఆ తర్వాత రూ. 4,000 జరిమానా విధిస్తున్నారు. కొత్త ప్రతిపాదన ప్రకారం ఇన్సూరెన్స్ లేని వాహనాల డ్రైవర్లు మొదటిసారి బీమా బేస్ ప్రీమియంకు మూడు రెట్లు, ఆ తర్వాత అయితే ఐదు రెట్లు జరిమానా చెల్లించాల్సి వస్తుంది. అంటే ఇది రూ.20 వేల వరకు ఉంటుందని అంచనా. భారతీయ రోడ్లపై బీమా లేని వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

డ్రైవింగ్ లైసెన్స్ రూల్స్


డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణకు కూడా కఠిన నిబంధనలు విధించనున్నారు. అతివేగం, మద్యం సేవించి డ్రైవ్ చేయడం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన వ్యక్తులకు రెన్యూవల్ సమయంలో తప్పనిసరిగా డ్రైవింగ్ పరీక్ష ఉంటుంది. అలాగే 55 ఏళ్లు పైబడిన డ్రైవర్లు లైసెన్స్ పునరుద్ధరించే సమయంలో డ్రైవింగ్ పరీక్షకు హాజరుకావాలి. దీని వల్ల డ్రైవర్లు పూర్తి నైపుణ్యం కలిగి ఉంటారని

# అదృష్టం అంటే వీరిదే.. ఏడాదికే లక్షకు రూ.78 లక్షలు



**ముంబై-నవభూమి:** స్మాల్ క్యాప్ కేటగిరి, ఇన్ఫ్రా సెక్టార్‌కి చెందిన ప్రముఖ సంస్థ జీహెచ్వీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ షేర్లు తమ ఇన్వెస్టర్ల తలరాతలను మార్చేసింది. అది కూడా కేవలం ఏడాది కాలంలోనే. గత శుక్రవారంతో ముగిసిన స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్లో ఈ స్టాక్ 2 శాతం లాభంతో మళ్లీ అప్పర్ సర్క్యూట్లో లాక్ అయింది. సరికొత్త 52 వారాల గరిష్ఠ స్థాయి రూ. 1549.20ని నమోదు చేసింది. రోజు రోజుకు భారీగా పెరుగుతూ దూసుకెళ్తోంది. తాజాగా స్టాక్ స్ప్లిట్ చేసేందుకు ఆమోదం లభించడంతో పాటు రూ. 2645 కోట్ల ఆర్డర్‌కి చెందిన లెటర్ ఆఫ్ అవార్డు పొందినట్లు ప్రకటించడంతో ఈ స్టాక్ కొనేందుకు మదుపరులు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో వరుసగా అప్పర్ సర్క్యూట్లు కొడుతోంది.జూలై నెల ప్రారంభం నుంచి ఈ షేర్ వరుసగా అప్పర్ సర్క్యూట్స్ కొడుతూ వస్తోంది. గత ఏడాది కాలంలో ఈ స్టాక్ ఏకంగా 7732 శాతం లాభాన్ని అందించి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో ఒకటిగా నిలిచింది. ఒక వేళ ఏడాది క్రితం రూ.1 లక్ష పెట్టుబడి పెట్టి షేర్లు కొనుగోలు చేసి ఉంటే ఇప్పుడు వాటి విలువ రూ. 78 లక్షల వరకు ఉంటుంది.కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. జూలై 24వ తేదీన జరిగిన కంపెనీ బోర్డు సమావేశంలో 2:1 నిష్పత్తిలో స్టాక్ స్ప్లిట్‌కి ఆమోదం లభించింది. రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉన్న 1 ఈక్విటీ షేరుని రూ. 5 ఫేస్ వ్యాల్యూ ఉండేలా 2 షేర్లుగా విభజిస్తారు. మరోవైపు రానా ఎగ్జిమ్ అనే సంస్థ నుంచి రూ. 2645 కోట్లు ఆర్డర్ లెటర్ ఆఫ్ అవార్డు అందుకున్నట్లు తెలిపింది. ఈ ఆర్డర్లో భాగంగా యూఏఈలోని రాస్ అల్ ఖైమా ఎకనామిక్ జోన్లో ఎరీషా స్మార్ట్ మ్యానిఫ్యాక్చరింగ్ హబ్‌కు చెందిన ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బిల్డింగుల %జూజ%లను 24 నెలల్లోగా అభివృద్ధి చేయాల్సి ఉంటుందని కంపెనీ తెలిపింది.ఇక ఆగస్టు 1వ తేదీ శుక్రవారంతో ముగిసిన స్టాక్ మార్కెట్ చివరి ట్రేడింగ్ సెషన్లో జీహెచ్వీ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ షేరు 2 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ టచ్ చేసింది. గత వారం రోజుల్లో ఈ షేరు 8 శాతం పెరిగింది. గత నెల రోజుల్లో 52 శాతం లాభాన్ని ఇచ్చింది. గత ఆరు నెలల్లో 961 శాతం లాభాన్ని అందించింది. గత ఏడాది కాలంలో చూసుకుంటే ఏకంగా 7732 శాతం లాభాన్ని అందించింది. ఈ కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 2230 కోట్ల వద్ద ఉంది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 1549.20గా ఉండగా అది గత శుక్రవారమే టచ్ చేయడం గమనార్హం. ఇక 52 వారాల కనిష్ఠ ధర రూ. 77.64 వద్ద ఉంది.

# ఇన్వెస్టర్లకు పండగే.. ఈవారం ఏకంగా 10 ఐపీఓలు.. 12 లిస్టింగులు



**ముంబై-నవభూమి:** పబ్లిక్ ఇష్యూ సందడి ఈ వారం సైతం కొనసాగనుంది. ఎందుకంటే ఏకంగా 10 కొత్త ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్స్ ( ఐపీఓ)లు వస్తుండగా అందులో రెండు మెయిన్ బోర్డు ఐపీలు, 8 ఎస్ఎంఈ సెగ్మెంట్ ఐపీఓలు ఉన్నాయి. ఈ వారమే ఆయా పబ్లిక్ ఇష్యూల సబ్‌స్క్రిప్షన్ మొదలవనుంది. కొత్త పబ్లిక్ ఇష్యూలతో పాటుగా ఈ వారం మార్కెట్లో ఏకంగా 12 కంపెనీల షేర్లు లిస్టింగ్ అవుతున్నాయి. అందులో ప్రధానంగా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించిన లక్ష్మీ ఇండియా ఫైనాన్స్ కంపెనీల ఐపీఓలు ఉన్నాయి. ఈ క్రమంలో ఏ ఏ కంపెనీల ఐపీఓలు వస్తున్నాయి, ఏఏ కంపెనీలు లిస్టింగ్ అవుతున్నాయో తెలుసుకుందాం.ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 7వ తేదీన మొదలై ఆగస్టు 11వ తేదీతో ముగుస్తుంది. ప్రైస్ బ్యాంక్ త్వరలోనే ప్రకటించనున్నారు.

ఎస్సెక్స్ మెరైన ఐపీఓ

ఇది ఒక ఎస్ఎంఈ ఐపీఓ. సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 4వ తేదీన ప్రారంభమై ఆగస్టు 6వ తేదీతో ముగుస్తుంది. ప్రైస్ బ్యాండ్ రూ.54గా నిర్ణయించారు.

**బీఎల్‌టీ లాజిస్టిక్స్ ఐపీఓ**

ఈ ఎస్ఎంఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 4న మొదలై 6వ తేదీన ముగుస్తుంది. ఈ ఐపీఓ ప్రైస్ బ్యాండ్ రూ.71 నుంచి రూ.75గా నిర్ణయించారు.

**జ్యోతి గ్లోబల్ ప్లాస్ట్ ఐపీఓ**

ఈ ఎస్ఎంఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ సైతం సోమవారం 4వ తేదీన మొదలై గురువారం 6వ తేదీతో క్లోజ్ అవుతుంది. ఇందులో ఒక్కో షేరు ధర రూ.62-66 గా నిర్ణయించారు.

పార్థ ఎలక్ట్రికల్స్ ఐపీఓ

ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ సైతం ఆగస్టు 4నే మొదలై 6వ తేదీతో క్లోజ్ అవుతుంది. ఇందులో ప్రైస్ బ్యాండ్ రూ.160-170 మధ్య నిర్ణయించారు.

**భడోరా ఇండస్ట్రీస్ ఐపీఓ**

ఈ ఎస్ఎంఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ 4వ తేదీన మొదలై 6వ తేదీతో ముగుస్తుంది. ఇందులో ధరల శ్రేణి రూ.97-103 మధ్య ఉంది.

**సవాలియా ఫుడ్స్ ప్రొడక్ట్స్ ఐపీఓ**

ఈ ఎస్ఎంఈ ఐపీఓ బిడ్లు దాఖలు ఆగస్టు 7న మొదలై ఆగస్టు 11 వరకు కొనసాగుతుంది. ఇందులో ప్రైస్ బ్యాండ్ రూ.114 నుంచి రూ.120గా నిర్ణయించారు.

**ఏఎన్‌బీ మెటల్ క్యాస్ట్ ఐపీఓ**

ఈ కంపెనీ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 8 నుంచి ఆగస్టు 12 వరకు కొనసాగుతుంది. ఇంకా ప్రైస్ బ్యాండ్ వివరాలు వెల్లడించలేదు.

**12 కంపెనీల లిస్టింగ్స్ ఇవే**

ఆగస్టు 4వ తేదీన ఉమియా మొబైల్, రెపోనోను మార్కెట్లలో లిస్ట్ అవుతున్నాయి. ఆ తర్వాత ఆగస్టు 5వ తేదీన ఆదిత్య ఇన్ఫోటెక్, లక్ష్మీ ఇండియా ఫైనాన్స్, కైటెక్స్ ఫాబ్రిక్స్ ఐపీఓలు లిస్టింగ్ అవుతున్నాయి. ఇక ఆగస్టు 6వ తేదీన ఎన్ఎస్‌డీఎల్, శ్రీ లోటస్ డెవలప్మెంట్, ఎంఅండ్‌బీ ఇంజినీరింగ్, టక్యోన్ నెట్‌వర్క్స్, మెహుల్ కలర్స్, బీడీ ఇండస్ట్రీస్ సంస్థల స్టాక్స్ లిస్టవుతాయి. ఆ తర్వాత ఆగస్టు 7వ తేదీన రెనోల్ పాలికెమ్, క్యాష్ యూవర్ డ్రైవ్ మార్కెటింగ్ షేర్లు లిస్టవుతుండగా, ఆగస్టు 8వ తేదీన ఫైన్స్కు ఏవియేషన్ ఐపీఓ లిస్టవుతోంది.

# రూ.2 కోట్లు, రూ.3 కోట్లు.. భారత్‌లో సౌకర్యవంత 'రిటైర్డ్' జీవితానికి ఎంత కావాలి?



భారతీయులు పదవీ విరమణ తర్వాత భద్రమైన, సౌకర్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు ఎంత సొమ్ము అవసరం అవుతుంది అనే అంశంపై హెచ్ఎస్‌బీసీ సంస్థ ఓ నివేదిక విడుదల చేసింది. సుమారు 4,01,000 డాలర్లు అవసరమవుతాయని తెలిపింది. అంటే భారతీయ కరెన్సీలో సుమారు రూ. 3.5 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. పెరుగుతున్న జీవన వ్యయాలు, ఇన్‌ఫ్లేషన్, ఆయుర్దాయం వంటి అంశాలపై భారతీయుల్లో ఇప్పుడిప్పుడే స్పృహ పెరుగుతున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో పదవీ విమరణ ప్రణాళికల ధోరణి సైతం మారుతున్నట్లు నివేదిక తెలిపింది. అందుకు తగినట్లుగా విభిన్నమైన పెట్టుబడి మార్గాలను ఎంచుకుంటున్నట్లు పేర్కొంది.ముఖ్యంగా దీర్ఘకాల ఆర్థిక లక్ష్యాల్లో ప్రయాణాలు, పిల్లల ఉన్నత చదువులు, ఆస్తుల కొనుగోలు వంటి వాటికి ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నట్లు హెచ్ఎస్‌బీసీ రిపోర్ట్ పేర్కొంది. దీర్ఘకాలంలో ఆర్థిక భద్రతకు ప్లాన్ చేస్తున్న వారి సంఖ్యా క్రమంగా పెరుగుతోందని తెలిపింది. షేర్లు, బంగారంతో పాటుగా ఇతర మార్గాల్లోనూ భారీగా పెట్టుబడులు పెడుతున్నారని చెబుతోంది. గడిచిన 12 నెలల కాలంలో చూసుకుంటే బంగారంలో పెట్టుబడులు భారీగా పెరిగినట్లు తెలిపింది. అయితే పెట్టుబడులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని నివేదిక సూచించింది. పదవీ విరమణ కోసం పెట్టుబడి పెట్టడాన్ని 30 ఏళ్ల వయసు నుంచే ప్రారంభించిన వారు తమ లక్ష్యాలను చేరే అంశంలో ధీమాగా ఉంటున్నట్లు పేర్కొంది. ఆ తర్వాత 40, 45, 50 ఏళ్ల వయసులో మొదలు పెట్టిన వారు తమ రిటైర్మెంట్ అనంతర జీవితంలో రాజీ పడాల్సి వస్తుందనే ఆందోళనతో ఉన్నారని నివేదిక పేర్కొంది.ఇతర దేశాల్లో ఎంత అవసరం అవుతుంది?

హెచ్ఎస్‌బీసీ నివేదిక ప్రకారం భారత్‌ల రిటైర్మెంట్ తర్వాత దర్జాగా బతికేందుకు రూ. 3.5 కోట్లు కావాలి. అలాగే ఇతర దేశాల్లో ఎంత అవసరం ఉందో చూద్దాం. అమెరికాలో పదవీ విరమణకు సగటు పొదుపు 1.57 మిలియన్ డాలర్లు అవసరమవుతుందని నివేదిక పేర్కొంది. ఇక చైనాలో రిటైర్మెంట్ తర్వాత 1.09 మిలియన్ డాలర్లు అవసరమవుతాయి. ఇక సింగపూర్ దేశంలో 1.39 మిలియన్ డాలర్లు కావాల్సి వస్తుందట. అలాగే హాంకాంగ్ దేశంలో 1.10 మిలియన్ డాలర్లు అవసరమవుతాయని హెచ్ఎస్‌బీసీ నివేదిక పేర్కొంది.

రిటైర్మెంట్ తర్వాత పెద్ద మొత్తంలో కార్పస్ అందించేందుకు చాలా పొదుపు పథకాలు అందుబాటులో ఉన్నాయి. చాలా మంది రిస్క్ తీసుకుని స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెడుతున్నారు. అలాగే రిస్క్ తీసుకోలేని వారు కేంద్ర ప్రభుత్వం అందించే పొదుపు పథకాలను ఎంచుకుంటున్నారు. వాటిల్లో రాబడి తక్కువున్నా ఎలాంటి రిస్క్ లేకుండా గ్యారెంటీ రిటర్న్లు అందుతాయి.

# దోశలతో జీవితమే మారిపోయింది..



**బెంగళూరు-నవభూమి:** దోశ ప్లేట్‌లో పట్టేంత చిన్నదే కానీ.. అవకాశాల్లో భూగోళమంత విశాలమైనదని నిరూపించారు కర్ణాటకకు చెందిన శ్రియా నారాయణ్, అఖిల్ అయ్యర్. బెంగళూరు, ముంబయిలలో ఏర్పాటు చేసిన 'బెన్నె' దోశలతో నెలకు కోటి రూపాయలు సంపాదిస్తున్నారు. దోశల క్రేజ్‌ని భలేగా క్యాష్ చేసుకున్నారిలా..

ఏంటీ.. దోశల కోసం విరాట్‌కోహ్లీ, అనుష్క శర్మ వచ్చారా?. అయితే మనం కూడా ఆ ప్రత్యేక దోశల్ని తినాల్సిందే!" అంటూ జనం ఎమ్మెల్యే దోశంత పొడుగ్గా క్యూ కట్టేశారు. నోటి ప్రచారం, ఇన్‌స్టాగ్రామ్ పోస్టుల ద్వారా జనంలోకి వెళ్లిందీ సమాచారం. వచ్చిన వాళ్లందరికీ వేడి వేడి దోశలు వేసి వేసి.. వంటమాస్టారు చేతులే గరిటెలయ్యాయి. ముంబయిలోని అతి ఖరీదైన, పాపులర్ ప్రాంతం బాంద్రాలో వెలిసిందీ చిన్న హొటల్. చూసేవాళ్లకు ఎంత ఆశ్చర్యమంటే 'అంత ఫేమస్సు అయిన హొటల్ ఇదా' అనిపిస్తుంది.

ఎట్లున్నా దోశల గిరాకీ మాత్రం తగ్గేదేల్యా!. అలాంటి ఒక దోశల హొటలే ముంబయి బాంద్రాలోని 'బెన్నె దోశ'. ఆ పరిసరాలకు వెళ్లినోళ్లు వీటిని తినకుండా అస్సలు వెనక్కి రాలేరు. బంగారు వర్ణపు ఛాయతో.. పైన జారుగా కరిగే వెన్నెతో.. కరకరలాడే బెన్నె దోశను చూడగానే ఫిదా కావడం ఖాయం.

'బెన్నె, బెంగళూరు హెరిటేజ్' పేరుతో బెంగళూరు, ముంబయిలో చిన్న హొటళ్లను నెలకొల్పారు దంపతులైన శ్రియ నారాయణ్, అఖిల్ అయ్యర్. ఒకప్పుడు ఆయన ఫిల్మ్ ప్రొడ్యూసర్, ఆమె సైకాలజిస్టు.కారందోశ, ఉల్లిదోశల్లా వీరిద్దరూ భార్యాభర్తల్లాగే కాదు.. విజయవంతమైన వ్యాపారవేత్తలుగానూ రాణించాలనుకున్నారు. వీరి నిర్ణయానికన్నా ముందు.. దోశల మధ్య వివాదం రాజుకుంది. దోశ జన్మస్థలం ఎక్కడ? అన్న చర్చ కాలే పెనంలా వేడెక్కింది. ఆహారచరిత్రపై అధ్యయనం చేసిన పి.తంకప్పన్ నాయర్ "దోశలు ఎక్కడి నుంచి వచ్చాయన్న చర్చలో కర్ణాటకే గెలిచింది. ఉడిపి నుంచే వచ్చాయన్న వాదనకు బలం చేకూరింది" అన్నాడాయన. "12వ శతాబ్దపు సంస్కృత గ్రంథం మానసోల్లాసలో 'దోసక' పేరుతో దోశలను నమోదు చేయించాడు చాళుక్య రాజు అయిన సోమేశ్వర-3.." అని నాయర్ పేర్కొన్నారు.కానీ, ఆయన అభిప్రాయాన్ని దోశను తిరగేసినట్లు తిప్పేసి చెప్పాడు చరిత్రకారుడైన కేటీ అచయ. తన పుస్తకం 'ది స్టోరీస్ ఆఫ్ అవర్ ఫుడ్'లో.. 'దోసాయి' అని పిలిచే దోశ 1వ శతాబ్దం నుంచే తమిళ సంస్కృతిలో భాగం.. సంగం సాహిత్యం ప్రకారం ఆధునిక తమిళనాడు పుదుచ్చేరి, కేరళ, లక్ష్యద్వీప్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలలోని కొన్ని ప్రాంతాలు కలిగివున్న పురాతన తమిళ భూభాగంలో దోశ పాతుకుపోయిందని వాదించారు. అప్పట్లో రేగిన ఈ రచ్చ మంటలను రాజేసి.. తమిళ, కన్నడిగుల మనసులు మాడేలా చేసింది కూడా!.

ఈ తతంగంతో దోశలు మళ్లీ ట్రెండింగ్‌లోకొచ్చి.. జనం దృష్టిని ఆకర్షించాయి. ఇదే అదునుగా భావించిన ఔత్సాహిక వ్యాపారవేత్తలు అనేక స్టార్టప్‌లను ప్రారంభించారు. ఆ హాట్ ట్రెండ్‌లో గుభాళించిన స్టార్టప్ 'బెన్నె'. కన్నడలో బెన్నె అంటే వెన్న అని అర్థం. కరకరలాడే దోశలపైన వెన్న పూస్తే ఆ రుచే వేరు. ఈ కిటుకు వీరు కొత్తగా కనిపెట్టిందేం కాదు. దావణగెరె దోశల తయారీలో వాడుతున్నదే! బియ్యం, రాగులు, సగ్గుబియ్యం, పచ్చికొబ్బరి, మినుములు, అటుకులతో బెన్నె దోశలను వేస్తారు కన్నడిగులు. కొబ్బరి, పల్లీలతో చేసిన చట్నీ తప్పనిసరి.

తొలుత బెంగళూరులో ఏర్పాటు చేసిన బెన్నె దోశ భలే ఆకట్టుకుంది. ఇదే ఉత్సాహంతో ముంబయిలోని బాంద్రాలో ఇంకో అవుట్‌లెట్ ప్రారంభించారు దోశల దంపతులు. అక్కడ రోజుకు ఎనిమిది వందల దోశల్ని అమ్ముతున్నారట. నెలకు కోటి రూపాయలు సంపాదిస్తున్నట్లు అంచనా. కన్నడ బెన్నె దోశలు తినేందుకు విరాట్ దంపతులతో పాటు.. దీపికా పదుకొణే, రణ్‌వీర్‌సింగ్, రాజ్‌కుమార్‌రావు, శ్రద్ధాకపూర్, దియామీర్జా వంటి సెలబ్రిటీలు వచ్చేసరికి.. 'బెన్నె' ట్రెండింగ్‌లో నిలిచింది. దాంతో శ్రియా, అఖిల్‌ల జీవితం... మసాలాదోశలా మహారుచిగా మారిందిప్పుడు.


# యూపీఐలో మార్పులేమిటంటే..

**బెంగళూరు-నవభూమి:** మీరు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి డిజిటల్ చెల్లింపుల యాప్‌లు వాడుతున్నారా..? ఈ యాప్‌ల ద్వారా యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను వినియోగించుకుంటున్నారా..? అయితే, ఈ వార్త మీ కోసమే. ఎందుకంటే ఈ నెల 1 నుంచే యూపీఐ సేవల్లో కొన్ని మార్పులు వచ్చాయి. అయితే, ఈ మార్పులతో రోజువారీ చెల్లింపులపై ఎలాంటి ప్రభావం ఉండనప్పటికీ, యూపీఐ సేవల వినియోగంపైన మాత్రం యూపీఐ అభివృద్ధి, నిర్వహణ సంస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొన్ని పరిమితులను విధించింది. ఆ వివరాలు..ఇప్పటివరకు వినియోగదారులకు యూపీఐ ద్వారా అనుసంధానిత బ్యాంకు ఖాతాలో ఎంత నగదు ఉందని ఎన్ని సార్లైనా పరిశీలించే వెసులుబాటు ఉంది. తాజాగా ఈ సేవలపై ఎన్‌పీసీఐ పరిమితి విధించింది. ఈ నెల 1 నుంచి ఒక్కో యూపీఐ యాప్ నుంచి రోజులో 50 సార్లు మాత్రమే బ్యాంకు అకౌంట్‌లోని బ్యాలెన్స్‌ను చెక్ చేసుకునే వీలుంటుంది. అత్యధిక లావాదేవీలు చోటు చేసుకునే సమయాల్లో వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించేందుకు ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, యూపీఐ యాప్ నుంచి జరిపే ప్రతి చెల్లింపు పూర్తయ్యాక మీ ఖాతాలో నిల్వ ఎంత మిగిలి ఉందనేది వెంటనే చూడగలుగుతారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ సోమవారం 04 । ఆగస్టు । 2025

నవచిత్ర

# రూ.3 కోట్ల బడ్జెట్‌తో రూ.28 కోట్లు.. కన్నడలో రికార్డులు సృష్టిస్తున్న 'సు ఫ్రమ్ సో'




కన్నడ ఫిల్మ్ ఇండస్ట్రీని కేజీఎఫ్ ముందు కేజీఎఫ్ తర్వాత అని మాట్లాడుకుంటాం. అయితే కేజీఎఫ్ కంటే ముందు ఆ తర్వాత కూడా శాండల్‌వుడ్ ఇండస్ట్రీ నుంచి మంచి సినిమాలు వస్తున్నాయి. అలానే వచ్చి ఎటువంటి భారీ అంచనాలు లేకుండా, చిన్న సినిమాగా విడుదలై కన్నడ చిత్రసీమలో సంచలనం సృష్టిస్తోంది 'సు ఫ్రమ్ సో' చిత్రం. జూలై 25న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తూ, విశ్లేషకుల ప్రశంసలు అందుకుంటోంది. రాజ్ బి శెట్టి సహ-నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు జెపి తుమినాడ్ దర్శకత్వం వహించారు. హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం, వినూత్నమైన కథాంశంతో కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. తాజాగా ఈ చిత్రం కన్నడలో అరుదైన రికార్డును నమోదు చేసుకుంది.కేవలం రూ.3 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటివరకు రూ.28 కోట్ల వరకు వసూళ్లను రాబట్టింది. అంతేగాకుండా కేవలం మూడు రోజుల్లోనే ఈ చిత్రం 3.80 లక్షలకు పైగా టిక్కెట్లు అమ్ముడై, ఒకే రోజులో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో అత్యధిక టిక్కెట్లు అమ్ముడైన కన్నడ చిత్రంగా రికార్డు సృష్టించింది.





# క్రికెట్ టీమ్ కొనేసిన చాహల్ గాళ్ ఫ్రెండ్



నిన్న మొన్నటి వరకూ ఒక సాధారణ రేడియో జాకీ (ఆర్జే).. కంటెంట్ క్రియేటర్.. కానీ ఇప్పుడు బిజినెస్ ఉమెన్. ఎంటర్ ప్రెన్యూర్ గా తొలి అడుగులు వేయడమే గాక అంచెలంచెలుగా ఎదిగేందుకు బలమైన ప్రణాళికతో ముందుకు సాగుతోంది ఆర్జే మహ్వాష్. అంతేకాదు.. ఇప్పుడు ఏకంగా షాన్ మార్ష్ కెప్టెన్‌గా కొనసాగే ఒక క్రికెట్ టీమ్‌నే కొనుగోలు చేసి ఆశ్చర్యపరిచింది. మహ్వాష్ క్రికెట్ వ్యాపారంలోకి ప్రవేశించారని తెలియగానే సోషల్ మీడియాల్లో తన ఫాలోవర్స్, నెటిజనులు షాక్ కి గురయ్యారు. నిన్న మొన్నటివరకూ క్రికెటర్ చాహల్ తో లవ్- డేటింగ్ అంటూ పుకార్లు పుట్టుకు రాగా, నిజంగా మహ్వాష్ కి అంత సీన్ ఉందా? అనుకున్నారు. ఏదో స్టేడియంలో తనదైన గ్లామ్ షోతో యువతరాన్ని ఆకర్షిస్తోందని అనుకున్నారు కానీ, ఉన్నట్టుండి ఇలా క్రికెట్ టీమ్ ని కొనుగోలు చేసి ఎంటర్ ప్రెన్యూర్ రేంజుకు ఎదిగేస్తుందని ఎవరూ ఊహించలేదు. కానీ ఊహకు అతీతంగా దూసుకెళ్లే సత్తా తనకు ఉందని నిరూపించారు ఆర్జే మహ్వాష్. అతడితో సాన్నిహిత్యంతోనే క్రేజ్: క్రికెటర్ యజ్వేంద్ర చాహల్ తో ఎఫైర్ వార్తల కారణంగా మహ్వాష్ పేరు నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లో నిలిచింది. చాహల్ తన భార్య ధనశ్రీకి విడాకులిచ్చి మహ్వాష్‌తో అత్యంత సన్నిహితంగా మెలగడంతో ఆమె క్రేజ్ కూడా పీక్స్ కి చేరుకుంది. భార్య నుంచి విడాకులు తీసుకున్న క్రికెటర్‌తో షికార్లు మహ్వాష్ క్రేజ్ ని పెంచాయే కానీ తగ్గించలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలు, డిజిటల్ మాధ్యమాల్లో మహ్వాష్ అసాధారణ ఫాలోవర్స్ ని పెంచుకుంటూ క్రేజీగా దూసుకెళుతోంది. 20-20 ని మించిన టోర్నీకి ప్లాన్: ఇలాంటి సమయంలో మహ్వాష్ నుంచి అంతకుమించి అనిపించేలా పెద్ద శుభవార్త అందింది. పరిమిత ఓవర్ల (10 ఓవర్లు) టోర్నీలో పోటీపడే ఒక క్రికెట్ టీమ్ ని మహ్వాష్ వేలంలో కొనుగోలు చేసింది. ఆగస్టు 22-24 తేదీలలో నోయిడాలో మూడు రోజుల టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ సిఎల్‌టి10 (క్రికెట్ లీగ్ 10) జరగనుండగా, ఇందులో పాల్గొనే సుప్రీం స్ట్రైకర్స్ టీమ్ ని తన సొంతం చేసుకుంది. ఢిల్లీలో జరిగిన వేలంలో మహ్వాష్ క్రేజీ ఆటగాళ్లున్న టీమ్ ని ఛేజిక్కించుకుని యజమానిగా మారింది. పైగా ఆస్ట్రేలియన్ మాజీ క్రికెట్ స్టార్ షాన్ మార్ష్ ను టీమ్ కెప్టెన్ గా ప్రకటించింది మహ్వాష్. పాపులర్ క్రీడా ప్రెజెంటర్ చారు శర్మ నిర్వహించిన CLT10 వేలంలో పలువురు బాలీవుడ్ స్టార్లు కూడా పాల్గొన్నారు. శృంగార నటి సన్నీ లియోన్ , ప్రిన్స్ నరులా వంటి ప్రముఖులు ఈ క్రీడా వేలంలో పాల్గొన్నారని సమాచారం. ఆ ఇద్దరూ కూడా కొన్ని టీమ్‌లలో తెలివిగా పెట్టుబడులు పెట్టారని తెలిసింది. ఎంత పోటీ ఉన్నా నిరాశచెందక మహ్వాష్ బిడ్డింగ్ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రతిభావంతులు ఉన్న టీమ్‌ని కొనుగోలు చేయడంలో చాకచక్యం చూపించారు. ఇకపై కెప్టెన్ షాన్ మార్ష్ తో ముడిపడి ఉన్నామని మహ్వాష్ టీమ్ ని కొనుగోలు చేసిన సందర్భంగా ఆనందంగా ప్రకటించారు. టీ- 20 కెప్టెన్సీలో విజయవంతమైన కెప్టెన్ గా నిరూపించుకున్న మార్ష్ తన టీమ్ కి కెప్టెన్ కావడంతో ఆర్జే మహ్వాష్ ఆనందంలో మునిగి తేల్తున్నారు. పది ఓవర్ల ఫార్మాట్ లో సాగే ఈ టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. 20-20తో పోలిస్తే, ఇది (10-10 ఓవర్లు) రెట్టింపు వేగం, ఉత్సుకతను కలిగించే టోర్నీ అని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రీతి జింతా, కావ్యా మారన్ తరహాలోనే ఇప్పుడు ఆర్జే మహ్వాష్ క్రీడా రంగ వ్యాపారంలో రాణించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.ర్యకుడి రిప్లై ఇదే ఈ ఆట లక్ష్యం: సాధారణంగా ఫోర్ కట్స్ బాల్ తో క్రికెట్ ఆడుతున్నారు. ఈ తరహా ఆటకు భిన్నంగా సాంప్రదాయ టెన్నిస్ బాల్ క్రికెట్‌ను భారీ పెట్టుబడులు వెదజల్లి ప్రొఫెషనల్ క్రీడగా మార్చడం ఈ లీగ్ లక్ష్యం. వేలంలో ఆటగాళ్ల కోసం భారీ మొత్తాలను యజమానులు పెట్టుబడులుగా పెడుతుండడం ఆశ్చర్యపరుస్తోంది. సన్నీలియోన్, ప్రిన్స్ నరులా కూడా కాస్త పెద్ద మొత్తాలనే పెట్టుబడులుగా పెట్టినట్టు తెలిసింది. ఆర్జే నుంచి క్రీడా వ్యాపారిగా మారిన మహ్వాష్ ఇప్పటికే నటనా రంగంలోను ప్రవేశించింది. కొన్ని సినిమాలకు సంతకాలు చేసి నటిగా బిజీ అయిపోతోంది.

# 'సయ్యారా'ను ఆపలేక పోయిన 'స్పిరిట్' హీరోయిన్!





బాలీవుడ్‌తో పాటు దేశం మొత్తం గత రెండు వారాలుగా సయ్యారా సినిమా గురించిన చర్చ జరుగుతోంది. అంతా కొత్త వారితో కేవలం పాతిక నుంచి ముప్పై కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందిన సయ్యారా సినిమా బాక్సాఫీస్ జోరు మామూలుగా లేదు. దేశంలోనే కాకుండా యూఎస్‌లోనూ సినిమా రికార్డ్ స్థాయి వసూళు నమోదు చేసింది. చాలా తక్కువ సమయంలోనే ఛావా రికార్డ్‌ను బ్రేక్ చేసింది. యూఎస్‌లో ఈ సినిమా రూ.100 కోట్లకు చేరువగా ఉంది. లాంగ్ రన్ లో రూ.150 కోట్లు వసూళ్లు చేసినా ఆశ్చర్యం లేదు. ఇక ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సయ్యారా సినిమా దాదాపుగా రూ.500 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం అందుతోంది. ఈ వీకెండ్ పూర్తి అయ్యేప్పటికి లెక్కలు మరింత షాకింగ్‌గా ఉండే అవకాశాలు ఉన్నాయంటూ బాక్సాఫీస్ వర్గాల వారు అంటున్నారు. సిద్దాంత్ చతుర్వేదికి జోడీగా త్రిప్తి డిమ్రి సయ్యారా సినిమా జోరును తగ్గించడం ఏ సినిమాల వల్ల కావడం లేదు. ఇటీవల 'దఢక్ 2' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సిద్దాంత్ చతుర్వేది, త్రిప్తి డిమ్రి జంటగా నటించిన ఈ సినిమాపై విడుదలకు ముందు పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన దఢక్ సినిమా ఫ్రాంచైజీలో రూపొందుతున్న సినిమా కావడంతో అంచనాలు పెరిగాయి. కానీ ఆ దఢక్ కి ఈ సినిమాకు సంబంధం లేకపోవడంతో ప్రేక్షకులు కొందరు షాక్ అయ్యారు. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే ఈ సినిమా 2018లో తమిళనాట వచ్చిన పరియేరుమ్ పెరుమాళ్ సినిమాకు అఫిషియల్ రీమేక్. అధికారికంగా ప్రకటించనప్పటికీ చిన్న చిన్న మార్పులతో రీమేక్‌ను చేశారు. సయ్యారా ముందు నిలువలేక పోయిన దఢక్ 2 సినిమాలోని మెయిన్ స్టోరీ లైన్‌ను తీసుకుని చేసిన మార్పుల వల్ల సోల్ మిస్ అయింది. తమిళ్‌లో సాగిన ఎమోషనల్ డ్రామా ఈ సినిమాలో కనిపించలేదు. హీరోయిన్‌గా నటించిన త్రిప్తి డిమ్రి ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. లా కాలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ఈ డ్రామాను ఆకట్టుకునే విధంగా మల్చడంలో దర్శకుడు విఫలం అయ్యాడు. భాష మారడంతో పాటు భావోద్వేగంకు సంబంధించిన ఎలిమెంట్స్ మార్చాల్సిన అవసరం ఉంది. కానీ ఈ సినిమాలో ఎమోషన్స్ సరిగ్గా పండించడంలో దర్శకుడు విఫలం అయ్యాడు. అందుకే ఈ సినిమా హిందీ బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. సయ్యారా సినిమా ముందు తేలిపోయింది.

# బులుగు సముద్రాన్ని ఎరుపెక్కించిన సిద్ధిక



2012 నుంచి తెలుగు చిత్రసీమలో కెరీర్ పోరాటం సాగిస్తోంది సిద్ధికా శర్మ. ఈ పంజాబీ బ్యూటీ అందచందాలు, ప్రతిభకు యువతరంలో ఫాలోయింగ్ ఏర్పడింది. అయినా లక్ కలిసి రాక, ఆశించిన హిట్లు దక్కక కెరీర్ పరంగా రేసులో వెనకబడింది. 2012లో టాలీవుడ్ లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ ఆల్ ది బెస్ట్, గల్లీ కుర్రోళ్లు చిత్రాల్లో నటించింది. ఆ తర్వాత క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ తెరకెక్కించిన పైసా నటించింది. ఈ చిత్రంలో నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించారు. 'పైసా' ఫ్లాప్ షోగా మిగలడం సిద్ధిక టాలీవుడ్ బిగ్ డ్రీమ్స్ కి గండి కొట్టింది. ప్రతిభావంతుడైన కథానాయకుడు, పెద్ద దర్శకుడు కూడా సిద్ధిక ఫేట్ ని మార్చలేకపోయారు. ఆ తర్వాత 2019లో 'ప్రేమ పరిచయం' అనే తెలుగు చిత్రంలో నటించింది. నాలుగేళ్ల గ్యాప్ తర్వాత నిన్నే పెళ్లాడుతా (2023) చిత్రంలో కనిపించింది. సిద్ధికను ఒక రకంగా టాలీవుడ్ మాత్రమే ఆదుకుందని చెప్పాలి. జయాపజయాలతో సంబంధం లేకుండా తెలుగు చిత్రసీమ అవకాశాలు కల్పించింది. మాతృపరిశ్రమ పంజాబీలో ఓయ్ మక్నా అనే చిత్రంలోను సిద్ధిక ఆడిపాడింది. కానీ ఆ తర్వాత అక్కడ నటించలేదు. 2024లో ఆపరేషన్ లైలా%-% అనే చిత్రంతో తమిళంలో కూడా అడుగుపెట్టింది. కానీ అక్కడా పాప్పులుడకలేదు. హిట్టు మాత్రమే కోరుకునే పరిశ్రమలో ఒడిదుడుకుల ప్రయాణానికి సిద్ధిక అలవాటు పడిపోయింది. ఈ పంజాబీ బ్యూటీ గ్లామర్ సరిహద్దులు చెరిపేసి చెలరేగిపోతున్నా, పరిశ్రమలో అవకాశాలు రావడం అంత సులువుగా లేదు. ఓ వైపు మలయాళం, కన్నడం నుంచి అందంతో పాటు ప్రతిభావంతులైన కథానాయికలు వెల్లువెత్తుతున్నారు. ఇటీవల తెలుగమ్మాయిలు కూడా ఇతర భామలకు ధీటుగా రాణిస్తున్నారు. దీంతో సిద్ధిక లాంటి ఉత్తరాది భామలకు రఫ్ కాంపిటీషన్ ఎదురవుతోంది. పరిశ్రమ ఎవరికి రెడ్ కార్పెట్ వేస్తుందో, ఎవరిని ఎప్పుడు ఇంటికి పంపుతుందో తెలీదు కదా! సిద్ధిక కూడా చాలా పోరాటాల తర్వాత బాలీవుడ్ లోను ప్రయత్నాలు ప్రారంభించింది. కెరీర్ ఆరంభం నుంచి ప్రముఖ పంజాబీ గాయకులతో కలిసి పలు సింగిల్ ఆల్బమ్స్ తో సందడి చేసింది. ప్రస్తుతానికి సోషల్ మీడియాల్లో వేడెక్కించే ఫోటోషూట్లతో చెలరేగుతోంది. తాజాగా సిద్ధిక రెలిడ్ హాలిట్ లుక్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. ఇన్నర్ అందాలను ఎలివేట్ చేస్తూ డిజైన్ చేసిన ఈ స్పెషల్ డిజైనర్ డ్రెస్ సిద్ధిక ఛామ్ అండ్ గ్లోని ఎలివేట్ చేస్తోంది. నేపథ్యంలో అలలు అలలుగా దుముకుతున్న బులుగు సముద్రంతో పోటీపడుతూ ఈ రెలిడ్ హాలిట్ బ్యూటీ వాతావరణాన్ని ఒక్కసారిగా ఎరుపెక్కించింది. సిద్ధిక అపరిమితమైన గ్లామర్ ట్రీట్ కి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నా, ఇప్పుడు దర్శకనిర్మాతల దృష్టికి రావాల్సి ఉంది. తనకు మళ్లీ టాలీవుడ్ ఒక్క ఛాన్స్ ఇస్తుందేమో

# 'దేవర 2' సెట్స్ మీదకి వెళ్లేది అప్పుడేనా.!



నందమూరి తారక్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దేవర 2' చిత్రంపై ఓ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వెలువడింది. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' సినిమా షూటింగ్ పూర్తికాగానే, 'దేవర 2' సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.దేవర చిత్రం విడుదలై మంచి విజయాన్ని నమోదు చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ మూవీ పార్ట్ 2కి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్, ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ప్రస్తుతం దర్శకుడు కొరటాల శివ తీరిక లేకుండా గడుపుతున్నట్లు తెలుస్తుంది. సోషల్ మీడియాలో వైరల్ వస్తున్న వార్తల ప్రకారం 'దేవర 2' షూటింగ్ వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మొదటి భాగం హిట్ అయిన నేపథ్యంలో, రెండో భాగం కూడా అంతే స్థాయిలో అలరిస్తుందని అభిమానులు నమ్మకంతో ఉన్నారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా తారక్ కెరీర్‌లోనే మరో మైలురాయిగా నిలవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# బాలీవుడ్‌లో మృణాల్.. ప్లాన్ మార్చాల్సిందే!




హీరోయిన్ మృణాల్ ఠాకూర్ నార్త్, సౌత్ లేకుండా వరుస సినిమాలతో బిజీగా ఉన్న అమ్మడు.. టాలీవుడ్ లో సీతా రామంతో ఎలాంటి క్రేజ్ సంపాదించు కున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సీతామహాలక్ష్మిగా అందరి మనసులను గెలుచుకున్న మృణాల్.. తెలుగులో డెబ్యూ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ను సొంతం చేసుకుంది. ఆ తర్వాత హాయ్ నాన్న మూవీతో మరో హిట్ మృణాల్ ఠాకూర్ ఖాతాలో పడింది. ఆ వెంటనే ఫ్యామిలీ స్టార్ తో హ్యాట్రిక్ కొడతుందని అంతా అనుకోగా.. అది జరగలేదు. కానీ క్రేజ్ మాత్రం తగ్గలేదు. ఇప్పుడు డెకాయిట్ లో నటిస్తోంది. యంగ్ హీరో అడివి శేష్ లీడ్ రోల్ లో నటిస్తున్న ఆ మూవీలో జూలియట్ గా సందడి చేయనుంది మృణాల్ ఠాకూర్. %ూశ్రీంశీ =ఋఎ% - కింగ్ డమ్ పై సుకుమార్ రియాక్షన్ ఏంటంటే..? అదే సమయంలో బాలీవుడ్ లో వరుస ఆఫర్స్ అందుకుంటున్న బ్యూటీ.. ఇప్పుడు మూడు సినిమాల్లో నటిస్తుండడం విశేషం. బీ టౌన్ లో సరైన హిట్ కొట్టి చాలా కాలం అయినా.. ఆఫర్లు మాత్రం తెగ వస్తున్నాయి. సూపర్ 30, బాట్లా హౌస్ తర్వాత బ్లాక్ బస్టర్ ను ఇప్పటి వరకు సొంతం చేసుకోలేదు మృణాల్. కానీ ఆఫర్స్ మాత్రం అస్సలు తగ్గడం లేదు. ప్రస్తుతం హై జవానీ తో ఇష్క్ హెూనా హై, తుమ్ హెూ తో, పూజా మేరీ జాన్ సినిమాల్లో నటిస్తోంది అమ్మడు. రీసెంట్ గా సన్ ఆఫ్ సర్దార్ 2తో ప్రేక్షకుల ముందుకు మృణాల్ రాగా.. ఆ సినిమాలో అజయ్ దేవగన్ లీడ్ రోల్ లో నటించారు. విజయ్ కుమార్ అరోరా దర్శకత్వం వహించిన ఆ మూవీ.. ఇటీవల వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా రిలీజ్ అయింది. అయితే సినిమాతో హిట్ అందుకుంటారని ఎక్స్పెక్ట్ చేయగా.. బాక్సాఫీస్ వద్ద సన్ ఆఫ్ సర్దార్ 2 విఫలమైంది. దీంతో ఆమెకు మరోసారి నిరాశ ఎదురైంది. అదే సమయంలో నెక్స్ట్ హై జవానీ తో ఇష్క్ హెూనా హైతో హిట్ అందుకోవాలని చూస్తోంది మృణాల్. బాలీవుడ్ లో ఇప్పటికే మంచి క్రేజ్ సంపాదించుకున్న డేవిడ్ ధావన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ విషయంపై ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఎందుకంటే డేవిడ్ ధావన్ ఇప్పటికే మంచి హిట్స్ అందకున్నప్పటికీ.. ఇప్పటి జనరేషన్ కు ఆయన మేకింగ్ నచ్చుదేమోనని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# గిల్ మాస్టర్‌ప్లాన్.. చివరి ఓవర్లో క్రాలీని సిరాజ్ ఎలా బౌల్డ్ చేశాడో చూడండి..



**లండన్-నవభూమి:** ఇంగ్లండ్‌తో ప్రస్తుతం ఓవల్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో టీమిండియా మెరుగైన స్థితిలో ఉంది ఇంగ్లండ్ ఎదుట 374 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. నాలుగో రోజే బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ చివరి వరకు బాగానే ఆడింది. ఓపెనర్లు జాక్ క్రాలీ, బెన్ డకెట్ తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించారు. ఇక, నాలుగో రోజును ఇంగ్లండ్ వికెట్లేమీ కోల్పకుండానే ముగిస్తుంది అనుకుంటున్న దశలో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మంచి ట్రిక్ ప్లే చేశాడు.వేయించాడు. సిరాజ్ బౌలింగ్ వేస్తున్న సమయంలో స్క్వేర్ లెగ్‌లో ఉన్న యశస్వి జైస్వాల్‌ను గిల్ బౌండరీ లైన్ దగ్గరకు పంపించాడు. ఫీల్డర్‌ను అలా వెనక్కి పంపడం బ్యాటింగ్ చేస్తున్న క్రాలీ చూశాడు. దీంతో సిరాజ్ తర్వాతి బంతికి బౌన్సర్ వేయబోతున్నాడని అనుకున్నాడు. అయితే క్రాలీ ఊహకు అందని విధంగా సిరాజ్ యార్కర్ వేశాడు. బౌన్సర్ వస్తుందనుకుంటే యార్కర్ రావడంతో క్రాలీ షాకయ్యాడు. క్రాలీ తేరుకునే లోపే ఆ బంతి వికెట్లను పడగొట్టింది.గిల్ ప్లే చేసిన ఆ ట్రిక్‌తో ఇంగ్లండ్ కీలకమైన క్రాలీ వికెట్‌ను కోల్పోయింది. దాంతో నాలుగో రోజు ఆటకు తెరపడింది. ఆ వికెట్ పడకపోయి ఉంటే ఇంగ్లండ్ మెరుగైన స్థితిలో నిలిచి ఐదో రోజు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగేది. ఇంగ్లండ్‌కు ఆధిక్యం రాకుండా గిల్ ప్లే చేసిన ఆ ట్రిక్‌ను మాజీలు అందరూ ప్రశంసిస్తున్నారు.

# గిల్ మాస్టర్‌ప్లాన్.. చివరి ఓవర్లో క్రాలీని సిరాజ్ ఎలా బౌల్డ్ చేశాడో చూడండి..



**లండన్-నవభూమి:** ఇంగ్లండ్‌తో ప్రస్తుతం ఓవల్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో టీమిండియా మెరుగైన స్థితిలో ఉంది. ఇంగ్లండ్ ఎదుట 374 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. నాలుగో రోజే బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ చివరి వరకు బాగానే ఆడింది. ఓపెనర్లు జాక్ క్రాలీ, బెన్ డకెట్ తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించారు.ఇంగ్లండ్‌తో ప్రస్తుతం ఓవల్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో టీమిండియా మెరుగైన స్థితిలో ఉంది ఇంగ్లండ్ ఎదుట 374 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. నాలుగో రోజే బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ చివరి వరకు బాగానే ఆడింది. ఓపెనర్లు జాక్ క్రాలీ, బెన్ డకెట్ తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించారు. ఇక, నాలుగో రోజును ఇంగ్లండ్ వికెట్లేమీ కోల్పకుండానే ముగిస్తుంది అనుకుంటున్న దశలో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మంచి ట్రిక్ ప్లే చేశాడు.నాలుగో రోజు చివరి ఓవర్‌ను సిరాజ్ చేత వేయించాడు. సిరాజ్ బౌలింగ్ వేస్తున్న సమయంలో స్క్వేర్ లెగ్‌లో ఉన్న యశస్వి జైస్వాల్‌ను గిల్ బౌండరీ లైన్ దగ్గరకు పంపించాడు. ఫీల్డర్‌ను అలా వెనక్కి పంపడం బ్యాటింగ్ చేస్తున్న క్రాలీ (%ఋఎ జతీఋఞశ్రీవఎ%) చూశాడు. దీంతో సిరాజ్ తర్వాతి బంతికి బౌన్సర్ వేయబోతున్నాడని అనుకున్నాడు. అయితే క్రాలీ ఊహకు అందని విధంగా సిరాజ్ యార్కర్ వేశాడు. బౌన్సర్ వస్తుందనుకుంటే యార్కర్ రావడంతో క్రాలీ షాకయ్యాడు. క్రాలీ తేరుకునే లోపే ఆ బంతి వికెట్లను పడగొట్టింది.

నవక్రీడ

# సిరాజ్ మెరుపు దెబ్బ.. సిరీస్ సమం చేసేందుకు భారత్ సిద్ధం



**లండన్-నవభూమి:** ఇండియా, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదో టెస్ట్ మ్యాచ్‌లో మూడో రోజు ఉత్కంఠభరితంగా ముగిసింది. ఓవల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత పేసర్ మహమ్మద్ సిరాజ్ చివరి బంతితో ఇంగ్లండ్ ఓపెనర్ జాక్ క్రాలీ (14)ని ఔట్ చేసి అదరగొట్టాడు. ఆ క్రమంలో ఇంగ్లండ్ మూడో రోజు స్టంప్స్ వద్ద 13.5 ఓవర్లలో 50/1 స్కోరుతో ఉంది. ఈ క్రమంలో 324 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉందిఇలాంటి పరిస్థితుల్లో నాలుగో రోజు రెండు జట్లకు కీలకంగా మారనుంది. శుభ్‌మాన్ గిల్ నాయకత్వంలోని భారత జట్టు సిరీస్‌ను 2-2తో సమం చేసి అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీని నిలబెట్టుకోవాలంటే 9 వికెట్లు త్వరగా తీయాలి. ఇంగ్లండ్ మాత్రం 324 పరుగులు చేసి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భావిస్తోంది.మూడో రోజు భారత రెండవ ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ (118) సెంచరీతో మెరిసాడు. ఆకాశ్ దీప్ (66), రవీంద్ర జడేజా (53), వాషింగ్టన్ సుందర్ (53) అర్ధ సెంచరీలతో రాణించడంతో భారత్ 396 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జడేజా, ధ్రువ్ జురెల్ (34) కలిసి ఏడవ వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఇంగ్లండ్‌పై ఒత్తిడి పెంచారు. వాషింగ్టన్ సుందర్ దూకుడుగా ఆడి, 12 బంతుల్లో నాలుగు సిక్సర్లతో 39 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ బ్యాటింగ్ ప్రదర్శన భారత్‌కు మంచి పరుగుల ఆధిక్యాన్ని అందించింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**